thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

కాలం ఎవరికీ ఆగదు



11

చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 204 | జగిత్యాల శుక్రవారం 06 నవంబర్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

నిర్బంధం నుంచే 24 గంటలు!

- పోలీసులు అరెస్టు నమోదు ఆలస్యం చేసినా గడువు పొడిగించలేరు
- విచారణ, దర్యాప్తు పేరుతో నిర్బంధ సమయాన్ని మినహాయించడానికి వీల్లేదు
- గడువు దాటితే విడుదల చేయాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టీకరణ
- పోలీసుల నిర్బంధంపై మేజిస్ట్రేట్ల పర్యవేక్షణ తప్పనిసరి

2



పోలీసులు ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్న క్షణం నుంచే రాజ్యాంగం నిర్దేశించిన 24 గంటల గడువు ప్రారంభమవుతుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అధికారికంగా అరెస్టు నమోదు చేసిన సమయం నుంచి గడువును లెక్కించాలన్న వాదనను తిరస్కరించింది.

ఎస్ఐఆర్, ఈవీఎంలపై
చర్చకు సిద్ధం

రాహుల్‌కు అమిత్ షా సవాల్!

- ప్రధాని మోదీతో చర్చ కావాలంటే అధికారికంగా లేఖ రాయండి
- అవసరమైతే ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలకూ సిద్ధమని ప్రకటన
- బోగస్ ఓట్ల తొలగింపును కాంగ్రెస్ ఎందుకు వ్యతిరేకిస్తోంది?
- చొరబాటుదారుల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించాల్సిందే
- వీధుల్లో ఆందోళనలు కాదు.. పార్లమెంట్‌లో చర్చించాలని సూచన

వివరాలు 4లో..






4

అధికారం కోసం బీజేపీ ఎంతకైనా తెగిస్తుంది!

- గోకుల్ డెయిరీ ఎన్నికలపై రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు
- పాడి రైతుల తీర్పును తారుమారు చేస్తున్నారని మండిపాటు
- ప్రభుత్వ నామినేటెడ్ డైరెక్టర్ల నియామకంపై సుప్రీంకోర్టుకు కాంగ్రెస్

కొత్త ఓటర్ల నమోదులో
కీలక మార్పులు!

- ఫారం-6 నుంచి ఎస్ఐఆర్ డిక్లరేషన్‌ను వేరు చేసిన ఈసీ



4



భారీగా పెరిగిన బంగారం ధర

ఒక్క రోజే రూ.5వేలు పైకి..

4



డిసెంబర్‌లో నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026'కు హాజరయ్యే అంతర్జాతీయ ప్రతినిధు లు, పారిశ్రామికవేత్తలు, ప్రముఖులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సదస్సుకు వచ్చే ప్రతి ప్రతినిధికి ప్రత్యేకంగా అను-సంధాన అధికారిని నియమించాలని సూచించారు. ఫ్యూచర్ సిటీలోని యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ప్రాంగణంలో నిర్వహించనున్న సదస్సుకు సంబంధించిన ఏర్పాట్ల పురోగతిని అధికారులు వివరించారు. వేదికలు, సమావేశ మందిరాలు, అంతర్జాతీయ ప్రతినిధుల ఆహ్వానాలు, భద్రత, రవాణా, వసతి సౌకర్యాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు.

ప్రతినిధులకు ఇబ్బందులుండొద్దు

హాజరయ్యే ప్రతీ ప్రతినిధికి లైజనింగ్ ఆఫీసర్

- రక్షా ఎక్స్‌పో, ఇండియా జాయ్, క్లైమేట్ కాంక్లేవ్‌లకు ప్రత్యేక ఏర్పాట్లు
- 15నాటికి ఏర్పాట్ల పూర్తి ప్రణాళికను సిద్ధం చేసుకోవాలి
- గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై మంత్రులు, అధికారులతో సీఎం సమీక్ష

హైదరాబాద్, నవంబర్ 5 (చురకలు) : డిసెంబర్‌లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026 ఏర్పాట్లపై రెడ్డి సచివాలయంలో మంత్రులు, ఉన్నతాధికారులతో గురువారం సీఎం రేవంత్ సమీక్ష నిర్వహించారు. ఫ్యూచర్ సిటీలోని యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ప్రాంగణంలో నిర్వహించనున్న సమ్మిట్ ఏర్పాట్ల పురోగతిని అధికారులు వివరించారు. సమ్మిట్ వేదిక, వివిధ హాల్స్, అంతర్జాతీయ ప్రతినిధుల ఆహ్వానాలు, కార్యక్రమాల నిర్వహణపై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మంత్రులకు, అధికారులకు పలు సూచనలు చేశారు. సమ్మిట్‌కు హాజరయ్యే ప్రతి ప్రతినిధికి ఒక లైజనింగ్ అధికారిని నియమించాలని సీఎం ఆదేశించారు. ప్రతినిధులు విమానాశ్రయానికి చేరుకున్న వెంటనే రిజిస్ట్రేషన్, పాస్‌ల జారీ ప్రక్రియ

మిగతా 2 లో



ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి వెలుగులు!

- లబ్ధిదారులతో కలిసి పండుగ జరుపుకోవాలని సీఎం పిలుపు
- 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' పేరుతో వినూత్న కార్యక్రమం

2

శభాష్ ఎస్డీఆర్ఎఫ్

పడవ బోల్తాపడి వరద ఉధృతిలో చిక్కుకున్న 11మంది ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది

- వరద సహాయక చర్యల్లో మీ సేవలు లేనివి
- సిబ్బందికి పాంగులేటి అభినందన
- అందరినీ సురక్షితంగా ఒడ్డుకు చేర్చిన సహాయక బృందాలు

2



బేతుపల్లి చెరువులో గల్లంతైనవారు క్షేమం



- రాత్రంతా జాగారమే: ఒడ్డుకు చేరిన 11 మంది
- వెరీ గుడ్ కలెక్టర్ దివాకర్ అని ప్రశంసలు
- సీఎం రేవంత్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు కితాబు
- క్షేత్రస్థాయిలో మంత్రి తుమ్మల, పొంగులేటి పర్యటన

వివరాలు 2లో..

బీసీ ఆత్మగౌరవ భవనాలకు
రూ.88.50 కోట్లు



మంజూరు చేస్తూ జీవోలు జారీ చేసిన ప్రభుత్వం!


వివరాలు 3లో..

మోదీ నాయకత్వమే రక్ష

- ఓల్డ్ సిటీ నుంచి బీజేపీలోకి భారీగా చేరికలు
- పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన రామచందర్ రావు



3



అయ్యప్ప సొసైటీలో సర్వే చేయాలి

రేవంత్ ప్రభుత్వానికి కవిత డెడ్‌లైన్!

సీఎం సోదరుల అండతోనే అనుమతులు ఇస్తున్నారని సంచలన ఆరోపణలు

అయ్యప్ప సొసైటీలో ఇళ్లు కొనుగోలు చేసి మోసపోవద్దని ప్రజలకు సూచన

3



శభాష్ ఎస్డీఆర్ఎఫ్

వరద సహాయక చర్యల్లో మీ సేవలు లేనివి

సిబ్బందిని అభినందించిన మంత్రి పొంగులేటి

సత్తుపల్లి, నవంబర్ 5 (చురకలు) : సత్తుపల్లి మండలం బేతుపల్లి చెరువులో వరద ఉధృతిలో పడవ బోల్తా పడిన ఘటనలో బుధవారం రాత్రంతా వరదలో చిక్కుకున్న 11మంది ఎస్డీఆర్ ఎఫ్ సిబ్బంది సురక్షితంగా ఒడ్డుకు చేరడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ఈ సందర్భంగా సహాయక చర్యల్లో పాల్గొన్న సిబ్బందిని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు అభినందించారు.బుధవారం రాత్రి భారీ వర్షాలు, వరదలతో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్న వేళ ప్రాణాలకు తెగించి సహాయక చర్యల్లో పాల్గొన్న రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం(ఎస్డీఆర్ఎఫ్) సిబ్బంది సేవలు మరువలేనివని రెవెన్యూ, గృహ నిర్మాణం శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కొనియాడారు. బేతుపల్లి చెరువు ఉప్పొంగిన ప్రాంతంతోపాటు దమ్మపేట మండలంలోని పలు గ్రామాలకు వరద ముప్పు ఏర్పడిన సమయంలో ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది తక్షణమే స్పందించి చేపట్టిన సహాయక చర్యలను అభినందించారు. సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి మంత్రి పొంగులేటి బేతుపల్లి పెద్ద చెరువు వద్ద పరిస్థితిని గురువారం పరిశీలించారు. అనంతరం దమ్మపేట మండలంలో మల్లెపూల వాగు, ముసలిబంధం చెరువుల వద్ద గండ్లు పడిన ప్రాంతాలను సందర్శించి వరద పరిస్థితులను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో సహాయక చర్యల్లో పాల్గొన్న ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. వారికి శాలువాలు కప్పి సత్కరించారు. విపత్కర పరిస్థితుల్లో ప్రజల ప్రాణాలను కాపాడేందుకు చూపిన ధైర్యసాహసాలు, అంకితభావం ప్రశంసనీయమన్నారు. విధి నిర్వహణలో చూపిన తెగువకు ప్రభుత్వం తరఫున అభినందనలు తెలిపారు. బేతుపల్లి చెరువులో బుధవారం రాత్రి ప్రమాదం జరిగిన విషయం తెలిసినప్పటినుంచి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నిరంతర పర్యవేక్షించారు. బుధవారం రాత్రి పడవ బోల్తాపడి వరద ఉధృతిలో చిక్కుకున్న 11 మంది ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందిలో పదిమందిని సహాయక బృందాలు తొలుత సురక్షితంగా ఒడ్డుకు చేర్చాయి. అనంతరం గల్లంతైన మరో సిబ్బంది ఆచూకీ లభ్యమవడంతో అతడిని కూడా సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఖమ్మం పోలీస్ కమిషనర్, రెవెన్యూ, పోలీస్, రెస్క్యూ బృందాలు సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టాయి. అర్ధరాత్రి దాటే వరకు సహాయక చర్యలను ఫోన్ ద్వారా నిరంతరం పర్యవేక్షించిన మంత్రి పొంగులేటి హైదరాబాద్ నుంచి హుటాహుటిన బయలుదేరి కల్లూరు మండలం నారాయణపురం చేరుకున్నారు.

సహాయక సిబ్బందికి భట్టి విక్రమార్క అభినందనలు

హైదరాబాద్ : బేతుపల్లి చెరువులో గల్లంతైన పదిమంది ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బందితోపాటు ఒక స్థానిక వ్యక్తిని సురక్షితంగా రక్షించడంపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హర్షం వ్యక్తం చేశారు. రాత్రంతా అవిశ్రాంతంగా కొనసాగిన సహాయక చర్యల అనంతరం మొత్తం 11 మందిని క్షేమంగా బయటకు తీసుకురావడం ఎంతో ఊరటనిచ్చిందని పేర్కొన్నారు. ఈ రెస్క్యూ ఆపరేషన్‌లో కీలక పాత్ర పోషించిన ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆరఎఫ్, అగ్నిమాపక శాఖ సిబ్బందిని ఉప ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సహాయక చర్యల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరి సేవలను ప్రశంసించారు. రాత్రంతా సహాయక చర్యలను భట్టి విక్రమార్క ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. గల్లంతైన వారందరినీ సురక్షితంగా కాపాడటంతో వారి కుటుంబ సభ్యులతోపాటు అందరిలోనూ ఆందోళన తొలగి ఉపశమనం కలిగిందని ఆయన అన్నారు.

బేతుపల్లి చెరువులో గల్లంతైనవారు క్షేమం

ఖమ్మం, నవంబర్ 5 : ఉద్వేగ క్షణాలు.. ఉత్కంఠ భరిత ఘటన అనంతరం గురువారం ఉదయం సత్తుపల్లి మండలం బేతుపల్లి చెరువు వద్ద ప్రశాంత వాతావరణం నెలకొంది. ముందు రాత్రంతా అక్కడ జాగరమే అయింది. ఏకంగా రెస్క్యూ అపరేషన్ కు వెళ్లిన 11 మంది గల్లంతుతో బేతుపల్లి చెరువు వార్తలకు ఎక్కింది. వారంతా క్షేమంగా రావడంతో జిల్లా యంత్రాంగం చూపిన అప్రమత్తత, సమన్వయం, బాధ్యతాయుతమైన పనితీరును ప్రశంసలందుకుంది. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బేతుపల్లి చెరువు వద్ద బుధవారం సాయంత్రం ఎనిమిది మంది జాలర్లు చెరువుకు వలలు కట్టేందుకు వెళ్లగా.. వరద ప్రవాహానికి అక్కడే చిక్కుకు పోయారు. స్థానికుల సమాచారంతో భద్రాచలంలో ఉన్న10 మందితో కూడిన ఎస్ డి ఆర్ఎఫ్(స్టేట్ ఫోర్స్) బృందం రంగంలోకి దిగింది. రక్షించే చర్యల్లో భాగంగా ముందుగా బోట్లలో వెళ్లిన సిబ్బంది ముగ్గురిని క్షేమంగా ఒడ్డుకు తీసుకొచ్చారు. మరో ఐదుగురి కోసం ఎస్ డి ఆర్ఎఫ్ సిబ్బంది రెండు బృందాలుగా విడిపోయి రెండు బోట్లలో చీకట్లోనే జాలర్లు చిక్కుకున్న ప్రాంతానికి వెళ్లారు. ఈ క్రమంలో ఒక్కసారిగా వరద ఉధృతి పెరిగి రెండు బోట్లూ ఒకదానికొకటి ఢీకొని నీటిలోనే బోల్తాపడ్డాయి. దీంతో పది మంది ఎస్ డి ఆర్ఎఫ్ సిబ్బంది, ఒకరు స్థానికులు మొత్తం 11 మంది వరద ప్రవా హానికి చెల్లా చెదురయ్యారు. వరద ప్రవాహంలో చిక్కి చెల్లాచె దురైన ఎస్ డి ఆర్ఎఫ్ సిబ్బందిని రక్షించేందుకు విజయవాడ నుంచి ఎన్డీఆర్ఎఫ్ బృందాలు (సెంట్రల్ ఫోర్స్) అక్కడికి వెళ్లాయి. అర్ధరాత్రి రెండున్నర గంటల ప్రాంతంలో బెటాలియన్ కు చెందిన మంచాల వేణు ఆచూకీ లభించగా ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది మొదట అతన్ని ఒడ్డుకు చేర్చారు. అనంతరం గురువారం తెల్లవారు జామున 5 గంటల నుంచి 7.30 గంటల ప్రాంతంలో మిగతా వారిని గాలించి ఒడ్డుకు చేర్చడంతో వరద నీటిలో చిక్కుకున్నవారంతా సేఫ్ గా బయట పడ్డారు. మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ను ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని గుండెనిండుగా ప్రశంసించారు. 'వెరీగుడ్ కలెక్టర్' అంటూ అభినందించారు. పోలీసులు సహా మొత్తం 16మంది ప్రాణాలను వరద నీటి నుంచి రక్షించడంలో అధికార యంత్రాంగం సమర్ధవంతతను ప్రదర్శించినట్లు తుమ్మల కీర్తించారు. ఆపద సమయంలో జిల్లా యంత్రాంగం చూపిన అప్రమత్తత, సమన్వయం, బాధ్యతాయుతమైన పనితీరును ప్రశంసించారు. అదేవిధంగా ఎస్ డి ఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని కూడా మంత్రి తుమ్మల స్థానిక సత్తుపల్లి ఫారెస్ట్ గెస్ట్ హౌజ్ లో ఘనంగా సన్మానించారు. ప్రాణాలను కాపాడడంలో ఆయా విభాగాల సిబ్బంది పోరాట ప్రతిమ అమోఘమని, వారికి జీవితాంతం రుణపడి ఉంటామని తుమ్మల పేర్కొన్నారు.

ప్రతినిధులకు ఇబ్బందులుండొద్దు

మొదటి పేజీ తరువాయి

పూర్తి చేయాలని సూచించారు. సమ్మిట్‌కు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ముందుగానే ప్రతినిధులకు అందజేయాలన్నారు. సదస్సుకు వచ్చే ప్రముఖులు, అన్ని రంగాల ప్రతినిధులకు వేదికలోకి ప్రవేశించినప్పటి నుంచి తిరిగి వెళ్లే వరకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. సమ్మిట్‌లో ప్రతి విభాగానికి ప్రత్యేక అధికారితోపాటు భద్రతా అధికారిని నియమించాలని సీఎం సూచించారు. ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులను కూడా ఆహ్వానించాలని సూచించారు. పెట్టుబడి ఒప్పందాలు చేసుకునేందుకు, పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చే కంపెనీల ప్రతినిధులకు ప్రత్యేక ఆహ్వానాలు అందించాలన్నారు. ఈనెల 15 నాటికి సమ్మిట్ ఏర్పాట్ల పూర్తి ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. పర్యాటక రంగానికి మరింత ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం సూచించారు. రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలను అంతర్జాతీయ ప్రతినిధులను ఆకట్టుకునేలా ప్రదర్శించాలన్నారు. విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధికి సంబంధించి ప్రత్యేక ఎడ్యుకేషన్ ఎక్స్‌పో నిర్వహిస్తున్నారు. నర్సరీ నుంచి ఆక్స్‌ఫర్డ్ వరకు తెలంగాణ విద్యారంగం ప్రతిబింబించేలా గ్లోబల్ సమ్మిట్‌లో చర్చలు జరగాలని సీఎం సూచించారు. మూడు రోజుల సమ్మిట్‌లో నాలుగు ప్రధాన హాళ్లలో 52 రంగాలవారీ సమావేశాలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించినట్లు అధికారులు తెలిపారు. గత ఏడాది సమ్మిట్‌తో పోలిస్తే ఈసారి మరింత విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. గతంలో ఒక ఎక్స్‌పో హాల్ ఉండగా ఈసారి ఆరు ప్రదర్శనశాలలు ఏర్పాటు చేస్తున్నారు. పెట్టుబడులు, పరిశ్రమలు, ఆధునిక సాంకేతికత, ఆవిష్కరణలు, ఉపాధి అవకాశాలకు ప్రాధాన్యమిస్తూ సమ్మిట్ కార్యక్రమాలను రూపొందించారు. రక్షా ఎక్స్‌పో, ఇండియా జాయ్, స్టార్టప్ పెవిలియన్, ఫార్మా అండ్ లైఫ్ సైన్సెస్ ఎక్స్‌పో, వ్యవసాయ అనుబంధ రంగాల ప్రదర్శన, తెలంగాణ పెవిలియన్, ఎడ్యుకేషన్ ఎక్స్‌పో, క్లైమేట్ కాంక్లేవ్‌ల ఏర్పాట్లను అధికారులు వివరించారు. రక్షా ఎక్స్‌పోలో రక్షణ, వైమానిక విన్యాసాలు కూడా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. రక్షా ఎక్స్‌పోలో పాల్గొనేందుకు 575 సంస్థలను ఆహ్వానించగా, ఇప్పటివరకు 49 సంస్థలు ముందుకు వచ్చాయి. యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్ రంగాలకు సంబంధించి ఇండియా జాయ్-2026 నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.స్టార్టప్‌ల కోసం ప్రత్యేక పెవిలియన్ ఏర్పాటు చేసి 136 స్టార్టప్‌ల ఆవిష్కరణలను ప్రదర్శించేలా ప్రణాళిక రూపొందించారు. తెలంగాణ ఇన్నోవేషన్ స్టార్టప్ ఛాలెంజ్‌లో భాగంగా వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, ప్రభుత్వ భూముల పరిరక్షణ, ప్రజా మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమస్యలకు సాంకేతిక పరిష్కారాలను ఆహ్వానిస్తున్నారు. ఇందుకు ఈనెల 20 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాలకు సంబంధించి 60 కంపెనీల ప్రదర్శనకు ఏర్పాట్లు చేస్తున్నారు. వ్యవసాయం, అనుబంధ రంగాల పెవిలియన్‌లో ఆధునిక సాగు పద్ధతులు, వ్యవసాయ డ్రోన్లు, పాడి, మత్స్య, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు ప్రాధాన్యం కల్పిస్తున్నారు.తెలంగాణ చరిత్ర, సంస్కృతి, చేనేత, బతుకమ్మ, కాకతీయుల శిల్పకళతోపాటు రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్ ప్రణాళికలను ప్రతిబింబించేలా ప్రత్యేక తెలంగాణ పెవిలియన్ ఏర్పాటు చేస్తున్నారు. సమ్మిట్ నిర్వహణ కోసం 25 రంగాలవారీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిళ్లను ఏర్పాటు చేశారు. దాదాపు 3,500 ఆహ్వానాలను పంపించారు.

తెలంగాణ క్లైమేట్ కాంక్లేవ్

ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే వాతావరణ మార్పులు, కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు డిసెంబర్ 8న ప్రత్యేకంగా తెలంగాణ క్లైమేట్ కాంక్లేవ్ నిర్వహించనున్నారు. ఈ సదస్సులో దాదాపు 200 మంది శాస్త్రవేత్తలు, రైతులు, వివిధ రంగాల నిపుణులు పాల్గొననున్నారు. కరువును తట్టుకునే వ్యవసాయం, పశుసంరక్షణ, తాగునీటి భద్రత, అధిక ఉష్ణోగ్రతల నుంచి రక్షణ, అడవులు, జీవవైవిధ్య పరిరక్షణ, వ్యర్థాలను సంపదగా మార్చడం వంటి ఐదు ప్రధాన అంశాలపై చర్చించనున్నారు. వాతావరణ మార్పులపై గ్లోబల్ సమ్మిట్‌లో ప్రత్యేకంగా చర్చ జరగాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇప్పటికే వాతావరణ మార్పుల కారణంగా ఎదురవుతున్న సమస్యలను గుర్తించి తక్షణ చర్యలతోపాటు దీర్ఘకాలిక పరిష్కారాలను రూపొందించాలన్నారు. రాష్ట్రంలో కరువు, వాతావరణ సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించే దిశగా ఈ సదస్సు నిర్ణయాత్మక పాత్ర పోషించాలని సీఎం ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతోపాటు మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ముఖ్యమంత్రి సలహాదారు కె.రామకృష్ణారావు, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, గ్లోబల్ సమ్మిట్ అధికారుల కమిటీల సభ్యులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి వెలుగులు!

- లబ్ధిదారులతో కలిసి పండుగ జరుపుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపు
- 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' పేరుతో వినూత్న కార్యక్రమం

హైదరాబాద్, నవంబర్ 5 (చురకలు): పేదల సొంతింటి కల సాకారమైన వేళ వారి ఆనందంలో భాగస్వాములు కావాలని సీఎం రేవంత్ రెడ్డి వినూత్న పిలుపునిచ్చారు. దీపావళి పండుగను పురస్కరించుకుని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి వేడుకలు జరుపుకోవాలని రాష్ట్రంలోని మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రభుత్వ ఉన్నతాధికారులకు సూచించారు. 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' పేరుతో చేపట్టనున్న ఈ కార్యక్రమం గురించి సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా సీఎం వెల్లడించారు. పేదల సొంతింటి కల నెరవేరిన ఆనందాన్ని పంచుకోవడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో సొంతింటి కల నెరవేర్చుకున్న కుటుంబాల మధ్య దీపావళి వేడుకలు నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. కేవలం ప్రభుత్వ పథకాలను అమలు చేయడమే కాకుండా వాటి ద్వారా లబ్ధి పొందిన కుటుంబాల సంతోషంలోనూ ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని సూచించారు. గ్రామగ్రామాన ఇందిరమ్మ ఇళ్లకు స్వయంగా వెళ్లి లబ్ధిదారులతో కలిసి పండుగ జరుపుకోవాలని కోరారు. పేదల ఇళ్లలో వెలిగే దీపాలు వారి జీవితాల్లో కొత్త ఆశలకు ప్రతీకలుగా నిలవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం అందించిన సహకారంతో సొంతింటిని నిర్మించుకున్న కుటుంబాలకు ఈ దీపావళి ప్రత్యేకమైనదని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఎన్నో ఏళ్లుగా అద్దె ఇళ్లలో, అరకొర వసతుల మధ్య జీవించిన కుటుంబాలు సొంతింట్లో పండుగ జరుపుకోవడం ఎంతో ఆనందకరమైన విషయమని పేర్కొన్నారు. ఆ సంతోషాన్ని ప్రజాప్రతినిధులు ప్రత్యక్షంగా పంచుకోవాలని సూచించారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య మరింత అనుబంధం పెరిగేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని పిలుపునిచ్చారు. సీఎం పిలుపు నేపథ్యంలో తమ నియోజకవర్గాల్లోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి దీపావళి వేడుకలు నిర్వహించేందుకు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారి కుటుంబ సభ్యులతో మమేకమై పండుగ ఆనందాన్ని పంచుకునేలా కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు కూడా ఈ కార్యక్రమం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. పేదలకు సొంతింటి వసతి కల్పించడమే కాకుండా వారి జీవితాల్లో ఆనందాన్ని నింపాలన్న సంకల్పంతో ఈ కార్యక్రమానికి పిలుపునిచ్చినట్లు సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ప్రతి పేద కుటుంబం దీపావళి పండుగను సంతోషంగా జరుపుకోవాలని, ఇందిరమ్మ ఇళ్లలో వెలిగే దీపాలు తెలంగాణవ్యాప్తంగా పండుగ శోభను తీసుకురావాలని ఆకాంక్షించారు.



అతిపెద్ద ఇండస్ట్రియల్ ఎక్స్‌పోగా 'సమ్మిట్'

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

హైదరాబాద్, నవంబర్ 5: హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026ను దేశంలోనే అతిపెద్ద పారిశ్రామిక ప్రదర్శనగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. ఈ సమ్మిట్ నిర్వహణకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లు, వివిధ కార్యక్రమాల పురోగతిపై సచివాలయంలో గురువారం ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోని ప్రముఖ పారిశ్రామిక సంస్థలు, కంపెనీలను ఆహ్వానించామని, ఇప్పటికే అనేక సంస్థలు తమ భాగస్వామ్యానికి సంసిద్ధత వ్యక్తం చేశాయని తెలిపారు. సమ్మిట్ నిర్వహణపై తాము ఆశించిన దానికంటే అధికంగా స్పందన లభిస్తోందన్నారు. ఈ సమ్మిట్‌లో భాగంగా రక్షా ఎక్స్‌పో, స్టార్టప్ పెవిలియన్, క్రియేషన్ కార్నర్, ఫార్మా-లైఫ్ సైన్సెస్ ఎక్స్‌పో, తెలంగాణ పెవిలియన్, ఇండస్ట్రియల్ ఎక్స్‌పో, తెలంగాణ క్లైమేట్ కాంక్లేవ్, ఎడ్యుకేషన్ సమ్మిట్, ఏరోబాటిక్-ఎయిర్ షో తదితర ప్రత్యేక ప్రదర్శనలు, కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వివరించారు. ముఖ్యంగా స్టార్టప్ పెవిలియన్, క్రియేషన్ కార్నర్ యువత, జెన్-జీలోని సృజనాత్మకత, ఆవిష్కరణలు, నూతన ఆలోచనలకు ప్రోత్సాహం అందించే వేదికలుగా నిలుస్తాయని తెలిపారు. సమ్మిట్‌ను సమర్థవంతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు వివిధ శాఖల సమన్వయంతో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడులకు ఉన్న అనుకూల వాతావరణం, మౌలిక సదుపాయాలు, వ్యాపార అవకాశాలను జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలకు వివరించి వారిని 'రైజింగ్ తెలంగాణ విజన్'లో భాగస్వాములను చేయడమే ఈ సమ్మిట్ ప్రధాన లక్ష్యమని సీఎస్ పేర్కొన్నారు. ఇప్పటికే హైదరాబాద్‌తోపాటు దిల్లీలో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026 కర్టెన్ రైజర్ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. సమ్మిట్‌లో పాల్గొనే ప్రతినిధుల కోసం డెలిగేట్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియను కూడా ప్రారంభించినట్లు వెల్లడించారు. సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, ప్రభుత్వ కార్యదర్శులు ఇలంబర్తి, హరిచందన, గౌరవ్ ఉప్పల్, దివ్య దేవరాజన్, శశాంక, అనుదీప్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



రూ.3 లక్షల బిల్లుల కోసం రూ.లక్ష డిమాండ్

లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన స్పోర్ట్స్ అధికారి

మహబూబ్‌నగర్, నవంబర్ 5: మహబూబ్‌నగర్ జిల్లాలో లంచం తీసుకుంటూ యూత్ అండ్ స్పోర్ట్స్ అధికారి, కంప్యూటర్ ఆపరేటర్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఓ కాంట్రాక్టర్‌కు సంబంధించిన రూ.3 లక్షల బిల్లుల చెల్లింపు కోసం యూత్ అండ్ స్పోర్ట్స్ అధికారి రాజేందర్ రెడ్డి లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధిత కాంట్రాక్టర్ ఏసీబీని ఆశ్రయించారు. పథకం ప్రకారం గురువారం క్లాక్‌టవర్ సమీపంలోని ఓ హోటల్‌లో భోజనం చేసిన అనంతరం కాంట్రాక్టర్ నుంచి రూ.లక్ష తీసుకుంటుండగా అధికారి, కంప్యూటర్ ఆపరేటర్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

వేగంగా వైఐపీ స్కూల్ నిర్మాణం

హైదరాబాద్, నవంబర్ 5: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ (వైఐపీఎస్) అకడమిక్ బ్లాక్-1 నిర్మాణ పనులను వేగవంతం చేసి, వచ్చే విద్యా సంవత్సరం నాటికి తరగతుల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని డీజీపీ సి.వి.ఆనంద్ అధికారులను ఆదేశించారు. మంచిరేవులలో పాఠశాల నిర్మాణ పనులను గురువారం పరిశీలించారు. పలు పనులకు అనుమతులు ఇస్తూ ఇతర అంశాలపై ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అకడమిక్, మౌలిక సదుపాయాలు, సీఎస్ఆర్, నియామకాలు, ఆర్థిక వ్యవహారాల కమిటీల పనితీరును సమీక్షించారు. తరగతి గదులు, ప్రయోగశాలలు, ఇతర మౌలిక సదుపాయాల నిర్మాణ పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అవసరాలకు అనుగుణంగా అవసరమైన మార్పులు, చేర్పులు చేపట్టాలని సూచించారు. నాణ్యమైన తరగతి గదులతోపాటు ఆహ్లాదకరమైన విద్యా వాతావరణాన్ని కల్పించాలని స్పష్టం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో పిల్లలకు క్రమశిక్షణ, కెరీర్ మార్గదర్శకత్వం ఎంతో అవసరమని డీజీపీ పేర్కొన్నారు. మాదకద్రవ్యాల ప్రభావం లేని వాతావరణంలో విద్యాబోధన ప్రాముఖ్యత పెరుగుతున్న నేపథ్యంలో పోలీస్ స్కూల్ ప్రత్యేకతను చాటుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. క్రమశిక్షణతో కూడిన విద్య, నాణ్యమైన బోధన, సరైన మార్గదర్శకత్వం ద్వారా విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందించాలన్నారు. పోలీసు కుటుంబాల పిల్లలతోపాటు సాధారణ పౌరుల పిల్లలకూ అత్యున్నత ప్రమాణాలతో విద్య అందించే ఈ యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ కు భవిష్యత్తులో మంచి ఆదరణ లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం పాఠశాలలో 345 మంది విద్యార్థులు 6వ తరగతి వరకు విద్యనభ్యసిస్తున్నారని అధికారులు వివరించారు. వచ్చే విద్యా సంవత్సరానికి సుమారు 720 మంది విద్యార్థులకు ప్రవేశాలు, మొత్తం 1000 మంది విద్యార్థులకు విద్య వసతులు కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా నిర్మాణ పనులు పూర్తి చేయాలని డిజిపి సూచించారు. సమావేశంలో శాంతిభద్రతల డీజీ మహేష్ భగవత్, ఆక్టోపస్ డీజీ అనిల్‌కుమార్, ఐజీపీ ఎల్.గజరావు భూపాల్, సిద్ధిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్, ఏజీ అడ్మిన్ రమణ కుమార్, డీసీపీ సీహెచ్.శ్రీనివాస్, విశాల్ గోయల్, ప్రిన్సిపాల్ అనితారెడ్డి, జయకుమార్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



బీసీ ఆత్మగౌరవ భవనాలకు రూ.88.50 కోట్లు

మంజూరు చేస్తూ జీవోలు జారీ చేసిన ప్రభుత్వం!



హైదరాబాద్, నవంబర్ 5 (చురకలు) : రాష్ట్రంలో 38 బీసీ కుల సంఘాల ఆత్మగౌరవ భవనాల నిర్మాణాలను వేగవంతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గతంలో కేటాయించిన భవన నిర్మాణాలకు సంబంధించి రూ.88.50 కోట్ల నిధులు మంజూరు చేస్తూ జీవోలు జారీ చేసింది. మినిస్టర్ క్వార్టర్స్‌లో గురువారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వివిధ కుల సంఘాల ప్రతినిధులకు ఈ జీవో పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ, గతంలో స్థలాలు కేటాయించినప్పటికీ కొన్ని పాలనా, సాంకేతిక కారణాల వల్ల నిర్మాణాలు ముం దుకు సాగలేదని, హెచ్ఎండీఏ సహకారంతో ఆ సమస్యలను పరిష్కరించామని చెప్పారు. కుల సంఘాలకు కేటాయించిన స్థలాలను నిర్మాణాలకు అనువుగా తీర్చిదిద్దేందుకు 'రెడీ టు కన్స్ట్రక్షన్' విధానంలో లేఅవుట్లను అభివృద్ధి చేశామని వెల్లడించారు. నిధులు మంజూరు చేసినందున వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించాలని, ఈ కార్తీక మాసంలోనే శంకుస్థాపనలు చేసుకోవాలని సూచించారు. ఏడాదిలోగా లేదా నిర్మాణ పరిస్థితులనుబట్టి నిర్ణయించిన గడువులోగా పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. బీసీ కుల సంఘాలకు కేటాయించిన భూములను ప్రభుత్వం వెనక్కి తీసుకుంటుందంటూ జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. బీసీలకు కేటాయించిన భూములు బలహీనవర్గాల ఆస్తులని, వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమే కాక ఏ ప్రభుత్వం కూడా తిరిగి తీసుకునే పరిస్థితి ఉండదని స్పష్టం చేశారు. నిర్మాణాల్లో జాప్యం జరిగితే సంబంధిత సంఘాల ప్రతినిధులను బాధ్యులుగా చేస్తూ పనులు పూర్తి చేయించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. బీసీ కుల సంఘాల భవనాల నిర్మాణం, నిర్వహణ కోసం ప్రభుత్వం జీవో నంబర్ 14 ద్వారా కొత్త కార్యవర్గాల ఎంపికకు మార్గదర్శకాలు తీసుకొచ్చిందని తెలిపారు. నిర్మాణాలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం జరగాలని, భవనాలను బీసీ విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి, వసతి సౌకర్యాలు, గ్రంథాలయాలు, సామాజిక కార్యక్రమాలు, కుల సంఘాల అభ్యున్నతికి ఉపయోగించుకోవాలని సూచించారు. హైదరాబాద్ నగరంలో పద్మశాలి, పేరక, గౌడ, కాపు తదితర కుల సంఘాల వసతి గృహాల ద్వారా వేలాదిమంది విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదిగారని, అదే స్ఫూర్తితో ఇప్పుడు నిర్మించబోయే ఆత్మగౌరవ భవనాలు భవిష్యత్ తరాలకు విద్యా, సామాజిక అభివృద్ధి కేంద్రాలుగా నిలవాలని ఆకాంక్షించారు. బీసీల అభ్యున్నతి, సామాజిక న్యాయం కాంగ్రెస్ ప్రభుత్వ విధానంలో అంతర్భాగమని పేర్కొన్నారు. అంబర్‌పేట ఛే నంబర్ చౌరస్తా పరిసరాల్లో ఉ స్మానియా వర్సిటీకి సమీపంలో ఇప్పటికే ఉన్న స్థలాన్ని బీసీ అవసరాల కోసం వినియోగించుకోవాలని ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు సూచించారు. ఆ స్థలంలో ఇప్పటికే ఫూలే విగ్రహం ఏర్పాటు చేశామని, అక్కడ గ్రంథాలయంతో పాటు రవీంద్రభారతి తరహాలో పెద్ద ఆడిటోరియం నిర్మిస్తే విద్యార్థులకు, బలహీనవర్గాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రభుత్వం వెనుకడుగు వేయకుండా మంత్రి పొన్నం ప్రత్యేక చొరవతో 40 బీసీ కుల సంఘాలు, 36 సంచార జాతుల కులాలకు కలిపి నిధుల మంజూరు జీవోలు అందించడం అభినందనీయమన్నారు. ఆత్మగౌరవ భవనాలు కేవలం భవనాలుగా కాకుండా విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, సామాజిక ఐక్యతకు కేంద్రాలుగా రూపుదిద్దుకోవాలని నేతలు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ సురేష్ షెట్కర్, బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాలమాయ దేవి, ఓబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్, మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, ఇతర కార్పొరేషన్ చైర్మన్లు, అధికారులు పాల్గొన్నారు.

అయ్యప్ప సొసైటీలో సర్వే చేయాలి



రేవంత్ ప్రభుత్వానికి కవిత డెడ్‌లైన్!

హైదరాబాద్, నవంబర్ 5 (చురకలు) : ఖానామెట్‌లోని అయ్యప్ప సొసైటీ భూముల్లో వెంటనే సమగ్ర సర్వే నిర్వహించాలని ప్రభుత్వాన్ని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రంగా డిమాండ్ చేశారు. అందుకోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి నెల రోజుల సమయం ఇస్తున్నట్లు స్పష్టం చేశారు. అయ్యప్ప సొసైటీలో ఇల్లు కొని ఏ పౌరుడూ మోసపోయి నష్టపోవద్దని ప్రజలకు సూచించిన కవిత, ఈ అయ్యప్ప సొసైటీ పరిధిలో ఎలాంటి చెల్లుబాటయ్యే రిజిస్ట్రేషన్లు ఉండవని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఈ సొసైటీ పరిధిలో దాదాపు 750 అక్రమ నిర్మాణాలు జోరుగా జరిగాయని ఆరోపించారు. గురువారం హైదరాబాద్‌లో కల్వకుంట్ల కవిత విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, అయ్యప్ప సొసైటీ పరిధిలో విచ్చలవిడిగా అక్రమాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నా సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ ఏం చేస్తున్నారంటూ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఇదే సొసైటీ ప్రాంతంలో ప్రముఖ నారాయణ, చైతన్య విద్యా సంస్థలు ఉన్నాయని గుర్తు చేస్తూ, సర్వే నంబర్లు 11/18 నుంచి 11/44 వరకు పెద్ద ఎత్తున అక్రమ నిర్మాణాలు సాగాయని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులు దగ్గరుండి అనుమతులు ఇప్పించి డబ్బులు దండుకుంటున్నారని సంచలన ఆరోపణలు చేశారు. హైదరాబాద్ నగరం చుట్టూ ఉన్న భూములు, టీడీఆర్ అక్రమ దందాలు తప్ప ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మరేమీ కనిపించడం లేదని కవిత వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఈ అక్రమ దందాను వెంటనే ఆపించాలని ముఖ్యమంత్రిని డిమాండ్ చేశారు. గతంలో గురుకుల ట్రస్ట్ భూముల పరిరక్షణపై ఎన్నో ఉద్యమాలు చేశామని ఈ సందర్భంగా కవిత గుర్తు చేశారు. మరోవైపు, ఇటీవల కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా హైదరాబాద్ వచ్చి కేవలం రాజకీయాలు తప్ప ప్రజా సమస్యలపై ఏం మాట్లాడలేదని విమర్శించారు. దిల్లీ వేదికగా కాంగ్రెస్ ధర్నా చేస్తే, దానికి పోటీగా అమిత్ షా హైదరాబాద్‌లో ర్యాలీ నిర్వహించారని తెలిపారు. ప్రాంతీయ పార్టీలపై నిందలు వేస్తూ మాట్లాడటం ఎవరికీ పనికొచ్చే అంశం కాదని కవిత అభిప్రాయపడ్డారు.

గిరిజన విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యత

- **సమస్యల పరిష్కారానికి టోల్‌ఫ్రీ, వాట్సాప్ నంబర్లు**
- **పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క**



ఏటూరునాగారం, నవంబర్ 5 : గిరిజన విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క పేర్కొన్నారు. గిరిజన విద్యాసంస్థల్లో విద్యా ప్రమాణాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించి నాణ్యమైన విద్య అందించాలని సూచించారు. ఏటూరునాగారం ఐటీడీఏ పరిధిలోని విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాల కల్పన, విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థుల సంక్షేమం తదితర అంశాలపై ఐటీడీఏ కార్యాలయంలో ఐటీడీఏ పీవో లెనిన్ వత్సల్ టోప్పోతో కలిసి సంబంధిత అధికారులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతోపాటు వారి విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులనూ అభినందించి ప్రోత్సహించాలని చెప్పారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించాలని, మౌలిక సదుపాయాల నిర్వహణపై అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. సమస్యలను సకాలంలో గుర్తించి పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. అనంతరం పీవో లెనిన్‌తో కలిసి విద్యార్థుల సమస్యలను తెలియజేసేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక టోల్ ఫ్రీ, వాట్సాప్ నంబర్ల సేవలను మంత్రి ప్రారంభించి పోస్టర్లను ఆవిష్కరించారు. గురుకులాలు, గిరిజన సంక్షేమ విద్యాసంస్థలు, వసతి గృహాల్లోని విద్యార్థులు తమ సమస్యలను 1800-425-3369 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి లేదా 9493368361 వాట్సాప్ నంబర్‌కు సందేశం పంపి తెలియజేయవచ్చని మంత్రి తెలిపారు. సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకునేందుకు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగా కళ్యాణి, డిప్యూటీ డైరెక్టర్లు, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారులు, డిప్యూటీ ఎడ్యుకేషన్ అధికారులు, సహాయ గిరిజన అభివృద్ధి అధికారులు, ప్రధానోపాధ్యాయులు, హాస్టల్ సంక్షేమ అధికారులు, ఐటీడీఏ వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'ఆర్ఆర్ ట్యాక్స్' నిజమే అయితే చర్యలేవి? మోదీ, షాకు కేటీఆర్ ప్రశ్న

ఆర్ఆర్ ట్యాక్స్‌పై కేటీఆర్ మరోసారి విమర్శలు

చదరపు అడుగుకు రూ.200 వసూలు చేస్తున్నారని ఆరోపణ

విమర్శలు చేస్తున్న కేంద్రం చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్న

బీజేపీ-కాంగ్రెస్ మధ్య అవగాహన ఉందని ఆరోపణ

హైదరాబాద్, నవంబర్ 5 (చురకలు) : తెలంగాణ రాజకీయాల్లో 'ఆర్ఆర్ ట్యాక్స్' వ్యవహారాన్ని మరోసారి తెరపైకి తెచ్చారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. ఈ అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ అగ్రనేతలు ఆరోపణలు చేస్తున్నారే తప్ప చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలను ప్రశ్నించారు. హైదరాబాద్‌కు వచ్చిన ప్రతిసారీ విమర్శలు చేయడం మినహా కేంద్రం చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. తన ఎక్స్ పోస్టులో కేటీఆర్ ఈ అంశాన్ని ప్రస్తావించారు. హైదరాబాద్‌లో ఏ బిల్డర్‌ను, డెవలపర్‌ను అడిగినా 'ఆర్ఆర్ ట్యాక్స్' వసూళ్ల గురించి చెబుతారని పేర్కొన్నారు. చదరపు అడుగుకు రూ.200 చొప్పున వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు నిజం కాదా? అని ప్రశ్నించారు. రియల్ ఎస్టేట్ రంగంలో ఈ విషయం అందరికీ తెలిసినప్పుడు కేంద్రంలోని బీజేపీ పెద్దలకు తెలియదా అని నిలదీశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాహుల్ గాంధీ కలిసి 'ఆర్ఆర్ ట్యాక్స్' పేరుతో కోట్ల రూపాయలు దోచుకుంటున్నారని ప్రధాని మోదీ, అమిత్ షా ఆరోపిస్తున్నారని కేటీఆర్ అన్నారు. అలాంటప్పుడు ఆ వసూళ్లను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. హైదరాబాద్‌కు తరచూ వస్తున్న మోదీ, అమిత్ షాలు ఈ అంశంపై బహిరంగంగా విమర్శలు చేయడం తప్ప, తదుపరి చర్యలు తీసుకోవడం లేదని వ్యాఖ్యానించారు. ఆర్ఆర్ ట్యాక్స్ వ్యవహారంలో బీజేపీ, కాంగ్రెస్ మధ్య అంతర్గత అవగాహన ఉందని కేటీఆర్ ఆరోపించారు. అందుకే కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై చర్యలకు ముందుకు రావడం లేదని విమర్శించారు. ఆరోపణలు చేయడం, రాజకీయంగా విమర్శలు గుప్పించడం తప్ప ఆ వసూళ్లపై విచారణ జరిపించేందుకు బీజేపీ నేతలు చొరవ చూపడం లేదని అన్నారు. 'ఆర్ఆర్ ట్యాక్స్' అంశంపై ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన సభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ఈ ఆరోపణలను తెలంగాణ కాంగ్రెస్ నాయకత్వం ఖండించింది. దీంతో రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ మధ్య ఈ అంశం రాజకీయ విమర్శలకు కేంద్రంగా మారింది. అయితే చదరపు అడుగుకు రూ.200 వసూలు చేస్తున్నారన్న కేటీఆర్ ఆరోపణపై స్వతంత్రంగా నిర్ధారితమైన ఆధారాలు ఈ కథనంలో ప్రస్తావించలేదు.



మోదీ నాయకత్వమే రక్ష

ఓల్డ్ సిటీ నుంచి బీజేపీలోకి భారీగా చేరికలు

పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన రామచందర్ రావు

హైదరాబాద్, నవంబర్ 5: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమర్థవంతమైన నాయకత్వమే దేశానికి, రాష్ట్రానికి రక్ష అని విశ్వసించి కాంగ్రెస్, బీఆరఎస్‌లను వీడి బీజేపీలో చేరుతున్నారని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు అన్నారు. ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కాంగ్రెస్, బీఆరఎస్‌లకు ప్రజలు ప్రత్యామ్నాయంగా బీజేపీ వైపే చూస్తున్నారని అన్నారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పాత బస్తీకి చెందిన పలువురు ప్రముఖులు, వివిధ పార్టీల నాయకులు, యువత భారీ సంఖ్యలో పార్టీలో గురువారం చేరారు. వారందరికీ రామచందర్‌రావు కాషాయ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. జాంబాగ్ డివిజన్‌కు చెందిన శ్రీనివాస్ యాదవ్, బీఆరఎస్ నుంచి వచ్చిన భాస్కర్, రాజ్‌పుత్ సమాజ్ ప్రతినిధులతోపాటు ఆదిత్య, బాలపరమేష్, ధరమ్ కుమార్, అమర్‌నాథ్, ప్రేమ్ కుమార్, గణేష్, పవన్ కుమార్, మహేశ్, బాలాజీ, మంగీలాల్, రూపేష్, హరీష్, మహేందర్, విక్రమ్, రాజేష్, రమేష్ ముదిరాజ్, సాయిబాబా, నరేష్, రాజు, బాలరాజు, రాహుల్, కార్తీక్, నవీన్ తదితరులు సంతోష్ ఆధ్వర్యంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా రామచందర్ రావు మాట్లాడుతూ యువతకు, నాయకులకు మనస్ఫూర్తిగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయశ్రీ, రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి అండ్ మీడియా ఇన్‌చార్జి ఎన్.వి.సుభాష్, రాష్ట్ర అధికార ప్రతినిధి సందీప్ సాయి, తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

బొగ్గు గని కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

దీపావళి శుభాకాంక్షలు తెలిపిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

సింగరేణి కార్మికులకు రూ.1,10,250 పీఎలఆర్ బోనస్ చెల్లింపు



న్యూదిల్లీ, నవంబర్ 5 : సింగరేణి కార్మిక సోదర, సోదరీమణులకు, వారి కుటుంబ సభ్యులకు దీపావళి పండుగ సందర్భంగా కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి సందర్భంగా సింగరేణి కార్మికులకు ఒక్కొక్కరికి రూ.1,10,250 చొప్పున పర్ఫార్మెన్స్ లింక్డ్ రివార్డు (పీఎలఆర్) బోనస్ గురువారం అందుతుండటం సంతోషకరమన్నారు. కోల్‌కతాలోని కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్) ప్రధాన కార్యాలయంలో జాతీయ కార్మిక సంఘాలతో కూడిన కోలిండియా సంయుక్త సంప్రదింపుల కమిటీ సమావేశంలో 2025-26లో సంస్థల పనితీరును పరిగణనలోకి తీసుకుని అర్హులైన కార్మికులకు రూ.1,10,250 చొప్పున బోనస్ అందించాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. ఈమేరకు సింగరేణి కార్మికులకు దీపావళి సందర్భంగా ఈ బోనస్ అందనున్నదని అన్నారు. ఇప్పటికే దసరా సందర్భంగా కార్మికులకు సంస్థ లాభాల వాటా కింద ఒక్కొక్కరికి సగటున రూ.1,53,912 అందించారు. తాజాగా పీఎల్ఆర్ బోనస్ కూడా అందుతుండటంతో పండుగ వేళ కార్మికులకు, వారి కుటుంబాలకు మరింత ఆర్థిక ప్రయోజనం చేకూరనుంది. దేశ ఇంధన అవసరాలను తీర్చడంలో, పారిశ్రామికాభివృద్ధికి అవసరమైన బొగ్గును అందించడంలో సింగరేణి కార్మికుల కృషి ఎంతో విలువైనదని, ప్రతికూల పరిస్థితుల్లోనూ శ్రమిస్తున్న కార్మికులు దేశ ఇంధన భద్రతకు వెన్నెముకగా నిలుస్తున్నారని కిషన్‌రెడ్డి కొనియాడారు. వారి కష్టాన్ని, అంకితభావాన్ని అభినందించారు. సింగరేణి అభివృద్ధికి, కార్మికుల సంక్షేమం, వారి కుటుంబాల భద్రత, మెరుగైన జీవన ప్రమాణాలకు కేంద్రం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందన్నారు. దీపావళి పండుగ కార్మికుల కుటుంబాల్లో కొత్త వెలుగులు నింపాలని, అందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, ఆర్థికాభివృద్ధితో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

టీపీసీసీ విచారణకు మంత్రి దామోదర రాజనర్సింహా డుమ్మా..!



హైదరాబాద్, నవంబర్ 5 (చురకలు) : ఢిల్లీ షాంగ్రిలా హోటల్‌లో మంత్రి దామోదర రాజనర్సింహా, ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు తన్నుకున్న ఘటనపై టీపీసీసీ విచారణ చేపట్టింది. ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావుతో జరిగిన గొడవపై వివరణ ఇవ్వాలని మంత్రి దామోదర రాజనర్సింహను ఆదేశించింది. ఈ మేరకు గురువారం ఉదయం 10:30 గంటలకు గాంధీభవన్‌కు వచ్చి వివరణ ఇవ్వాలని దామోదరకు సమాచారం కూడా అందించారు. అయితే దామోదర రాజనర్సింహ విచారణకు హాజరుకాలేదు. ఇప్పటివరకు గాంధీభవన్‌కు రాలేదు.. మరోవైపు మధ్యాహ్నం 2 గంటలకు రావాలంటూ లక్ష్మీకాంతారావుకు కూడా సమాచారం వెళ్లింది. షాంగ్రిలా హోటల్‌కు ముందు జరిగిన పరిణామాలను వివరిస్తానన్న లక్ష్మీకాంతారావు.. షాంగ్రిలా హోటల్ సీసీ టీవీ ఫుటేజీని తెప్పించారని... ఈ సీసీ కెమెరా ఫుటేజీని టీపీసీసీకి సాక్ష్యాలుగా సమర్పించబోతున్నారని సమాచారం.



కొత్త ఓటర్ల నమోదులో కీలక మార్పులు!

ఫారం-6 నుంచి ఎస్ఐఆర్ డిక్లరేషన్‌ను వేరు చేసిన ఎన్నికల సంఘం

ఇకపై ప్రత్యేకంగా సమర్పించాల్సిన ఎస్ఐఆర్ ధ్రువీకరణ పత్రం

దేశంలోని అన్ని రాష్ట్రాలకు కొత్త విధానం వర్తింపు

ఈసీ సమావేశాల అజెండా, నిర్ణయాల నమోదు తప్పనిసరి

విదేశీ పర్యటనలకు ముందస్తు అనుమతి..

సాంకేతిక వ్యవస్థల పరిశీలనకు ప్రత్యేక కమిటీ

న్యూఢిల్లీ, నవంబర్ 5 (చురకలు): కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియలో కేంద్ర ఎన్నికల సంఘం కీలక మార్పులు చేపట్టింది. ఓటరు జాబితాలో కొత్తగా పేరు నమోదు చేసుకునేందుకు ఆన్‌లైన్‌లో సమర్పించే ఫారం-6 నుంచి ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ధ్రువీకరణ పత్రాన్ని వేరు చేసింది. ప్రస్తుతం కొన్ని రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియ కొనసాగుతున్నప్పటికీ కొత్త విధానం దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు వర్తిస్తుందని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. తాజా మార్పులతో కొత్తగా ఓటరుగా నమోదు కావాలనుకునేవారు ఫారం--6తోపాటు ఎస్ఐఆర్ ధ్రువీకరణ పత్రాన్ని జత చేయాల్సిన అవసరం ఉండదని, అవసరమైన సందర్భాల్లో దానిని ప్రత్యేకంగా సమర్పించాల్సి ఉంటుందని తెలిపింది. ఓటర్ల నమోదు ప్రక్రియను మరింత సులభతరం చేయడంతోపాటు పరిపాలనలో పారదర్శకత పెంచడమే ఈ నిర్ణయం ప్రధాన ఉద్దేశమని పేర్కొంది. ఎన్నికల సంఘం అంతర్గత పరిపాలనా వ్యవస్థలోనూ పలు మార్పులు తీసుకొచ్చింది. అధికారిక సమావేశాల నిర్వహణలో స్పష్టత, జవాబుదారీతనం పెంచేందుకు కొత్త నిబంధనలను అమల్లోకి తీసుకురావాలని నిర్ణయించింది. ఇకపై ఎన్నికల సంఘం నిర్వహించే సమావేశాలకు సంబంధించిన అజెండాను ముందుగానే సభ్యులకు అందించాల్సి ఉంటుంది. సమావేశం ముగిసిన తర్వాత చర్చించిన అంశాలు, తీసుకున్న నిర్ణయాలను అధికారికంగా నమోదు చేసి సమావేశ వివరాలను జారీ చేయడం తప్పనిసరి చేసింది. గతంలో ఈ విధానం కచ్చితంగా అమలులో లేకపోవడంతో నిర్ణయాల నమోదు, సమాచార నిర్వహణలో మరింత స్పష్టత తీసుకురావాలని ఎన్నికల సంఘం భావిస్తోంది. మరోవైపు ఎన్నికల సంఘంలో పనిచేసే అధికారులు విదేశీ పర్యటనలకు వెళ్లే ముందు తప్పనిసరిగా ముందస్తు అనుమతి పొందాలని నిర్ణయించింది. అధికారిక విధులకు సంబంధించిన విదేశీ పర్యటనల విషయంలో నియంత్రణ, పర్యవేక్షణ పెంచేందుకు ఈ నిబంధనను తీసుకొచ్చినట్లు వెల్లడించింది. ఎన్నికల నిర్వహణలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో కొత్త సమాచార సాంకేతిక వ్యవస్థల రూపకల్పన, పరిశీలన, ఆమోద ప్రక్రియలోనూ మార్పులు చేపట్టింది. గతంలో కొత్త సాంకేతిక వ్యవస్థల ఆమోదానికి సంబంధించి ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల మధ్య అభిప్రాయభేదాలు తలెత్తిన నేపథ్యంలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇకపై కొత్త సాంకేతిక వ్యవస్థలకు సంబంధించిన ప్రతిపాదనలను తొలుత ఈ కమిటీ పరిశీలించనుంది. వాటి అవసరం, పనితీరు, అమలు సాధ్యాసాధ్యాలు తదితర అంశాలపై సమగ్ర సమీక్ష నిర్వహించిన తర్వాతే తుది ఆమోదం కోసం ఎన్నికల సంఘం ముందుకు తీసుకురానుంది. మొత్తంగా ఓటర్ల నమోదు ప్రక్రియను సులభతరం చేయడంతోపాటు ఎన్నికల సంఘం అంతర్గత వ్యవహారాల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంచే దిశగా ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఫారం-6 నుంచి ఎస్ఐఆర్ ధ్రువీకరణ పత్రాన్ని వేరు చేయడం కొత్త ఓటర్ల నమోదు విధానంలో కీలక పరిణామంగా భావిస్తున్నారు.

మహాదేవ్ బెట్టింగ్ యాప్ కేసులో కీలక పరిణామం

దుబాయ్‌లో సహ వ్యవస్థాపకుడు రవి ఉప్పల్ అరెస్ట్

మరో నిందితుడు సౌరభ్ చంద్రకర్‌ను రప్పించే ప్రయత్నాలు

న్యూఢిల్లీ, నవంబర్ 5 (చురకలు): దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన మహాదేవ్ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ యాప్ సహ వ్యవస్థాపకుడు రవి ఉప్పల్‌ను దుబాయ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు భారత భద్రతా వర్గాలకు సమాచారం అందింది. మరో ప్రధాన నిందితుడు సౌరభ్ చంద్రకర్‌ను ఒమన్ నుంచి భారత్‌కు తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్న సమయంలో ఉప్పల్ పట్టుబడటం ప్రాధాన్యం సంతరించుకుంది. ఛత్తీస్‌గఢ్ కేంద్రంగా సాగిన ఈ బెట్టింగ్ వ్యవహారంలో రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారులు, పోలీసు వర్గాలకు సంబంధాలున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తులో ఆరోపణలు వెలుగుచూశాయి. బెట్టింగ్ కార్యకలాపాలకు అడ్డంకులు లేకుండా చూసేందుకు కొందరు నేతలు రాజకీయ అండదండలు అందించగా, ఉన్నతాధికారులు, పోలీసులకు నెలవారీగా భారీ మొత్తంలో ముడుపులు చెల్లించినట్లు ఆరోపణలున్నాయి. యాప్ ప్రచారం, సాంకేతిక కార్యకలాపాలను చంద్రకర్ పర్యవేక్షించగా.. రాజకీయ నేతలు, అధికారులతో సెటిల్‌మెంట్లు, హవాలా మార్గాల్లో నగదు బదిలీల బాధ్యతలను ఉప్పల్ చూసుకున్నట్లు దర్యాప్తు సంస్థలు పేర్కొన్నాయి. ఈడీ అంచనాల ప్రకారం మహాదేవ్ యాప్, దాని అనుబంధ వేదికల ద్వారా సుమారు రూ.94 వేల కోట్ల లావాదేవీలు జరిగాయి. ప్రమోటర్లకు రూ.4 వేల కోట్ల నుంచి రూ.5 వేల కోట్ల వరకు ఆదాయం చేరినట్లు దర్యాప్తు వర్గాలు వెల్లడించాయి. ఇందులో అధిక భాగం హవాలా మార్గాల్లో విదేశాలకు తరలించగా, కొంత మొత్తం రాజకీయ నాయకులు, అధికారులకు చేరినట్లు ఆరోపణలున్నాయి. 2023 అక్టోబర్‌లో జారీ చేసిన ఇంటర్‌పోల్ రెడ్ కార్నర్ నోటీసు ఆధారంగా ఉప్పల్‌ను దుబాయ్‌లో అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అయితే, ఈ పరిణామంపై యూఏఈ ప్రభుత్వ వర్గాల నుంచి భారత విదేశాంగ శాఖకు అధికారిక సమాచారం అందాల్సి ఉంది. దౌత్య మార్గాల ద్వారా ఉప్పల్‌ను భారత్‌కు తీసుకొచ్చేందుకు దర్యాప్తు సంస్థలు చర్యలు చేపట్టాయి. ఉప్పల్‌ను భారత్‌కు తీసుకొచ్చి విచారిస్తే బెట్టింగ్ సొమ్ము ఎవరెవరికి చేరింది? రాజకీయ నాయకులు, ఉన్నతాధికారుల పాత్ర ఎంత? హవాలా లావాదేవీల వెనుక ఉన్న వ్యక్తులెవరు? అనే అంశాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని దర్యాప్తు వర్గాలు భావిస్తున్నాయి. ఎన్నికల ఖర్చులు, వ్యక్తిగత ఆస్తుల సమీకరణకు ఈ నిధులు వినియోగించారన్న ఆరోపణలపైనా విచారణ జరగనుంది.

ఎస్ఐఆర్, ఈవీఎంలపై చర్చకు సిద్ధం

- **రాహుల్‌కు అమిత్ షా సవాల్!**
- **ప్రధాని మోదీతో చర్చ కావాలంటే అధికారికంగా లేఖ రాయండి**
- **అవసరమైతే ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలకూ సిద్ధమని ప్రకటన**
- **బోగస్ ఓట్ల తొలగింపును కాంగ్రెస్ ఎందుకు వ్యతిరేకిస్తోంది?**
- **చొరబాటుదారుల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించాల్సిందే**
- **వీధుల్లో ఆందోళనలు కాదు.. పార్లమెంట్‌లో చర్చించాలని సూచన**



న్యూఢిల్లీ, నవంబర్ 5 (చురకలు): ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్), ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం) వ్యవహారంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో బహిరంగ చర్చకు సిద్ధమని ప్రకటించిన లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి కేంద్ర హోంమంత్రి అమిత్ షా సవాల్ విసిరారు. చర్చపై నిజంగా ఆసక్తి ఉంటే ప్రధానమంత్రికి అధికారికంగా లేఖ రాయాలని సూచించారు. ఎస్ఐఆర్, ఈవీఎంలు, ఓటర్ల జాబితాలో అనర్హుల పేర్ల తొలగింపు వంటి అంశాలపై చర్చించేందుకు అవసరమైతే ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు నిర్వహించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు సంబంధించిన కీలక అంశాలపై వీధుల్లో ఆందోళనలు చేయడం కంటే పార్లమెంట్ వేదికగా చర్చించడం సముచితమని పేర్కొన్నారు. హరియాణాలోని కర్నాల్‌లో భారతీయ జనతా పార్టీ నిర్వహించిన 'లోక్‌తంత్ర బచావో, అరాజకత హఠావో' యాత్రలో అమిత్ షా మాట్లాడారు. పార్లమెంట్‌లో చర్చలకు సహకరించకుండా బయట రాజ్యాంగ పుస్తకాన్ని పట్టుకుని తిరగడం వల్ల ప్రయోజనం ఏమిటని రాహుల్ గాంధీని ప్రశ్నించారు. ఓటర్ల జాబితాలో బోగస్ ఓట్లను తొలగించే ప్రక్రియను కాంగ్రెస్ ఎందుకు వ్యతిరేకిస్తోందని నిలదీశారు. దేశంలో అక్రమంగా ప్రవేశించిన వ్యక్తుల పేర్లు ఓటర్ల జాబితాలో ఉంటే వాటిని తొలగించాల్సిందేనని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా విశ్వసనీయతను కాపాడటం ఎన్నికల వ్యవస్థకు అత్యంత అవసరమని అభిప్రాయపడ్డారు. పార్లమెంట్ కార్యకలాపాలను కాంగ్రెస్ అడ్డుకుంటోందని అమిత్ షా ఆరోపించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ గురించి మాట్లాడుతున్న ప్రతిపక్ష నేతలు చట్టసభల్లో చర్చలకు ముందుకు రావాలని సూచించారు. ఎస్ఐఆర్, ఈవీఎంలపై ఉన్న సందేహాలను పార్లమెంట్‌లో ప్రస్తావిస్తే ప్రభుత్వం సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రత్యేక సమావేశాల నిర్వహణకు కూడా వెనుకాడబోమని పేర్కొన్నారు. రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా ప్రజలకు సంబంధించిన అంశాలపై నిర్మాణాత్మక చర్చ జరగాలని అన్నారు. ఈ సందర్భంగా హరియాణా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడి ఓటుకు సమాన విలువ ఉంటుందని పేర్కొన్నారు. ఓటర్ల జాబితా సవరణ ఎన్నికల సంఘం చేపట్టే సాధారణ ప్రక్రియేనని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండేలా చూడటం ముఖ్యమని చెప్పారు. ఓటర్ల జాబితాలో అనర్హుల పేర్లను గుర్తించి తొలగించడాన్ని రాజకీయ వివాదంగా మార్చడం సరికాదని అభిప్రాయపడ్డారు. మరోవైపు నిరుద్యోగం, దేశ భద్రత, ఆర్థిక వ్యవస్థతోపాటు ప్రజలను ప్రభావితం చేస్తున్న కీలక అంశాలపై ప్రధాని నరేంద్ర మోదీతో ఒకే వేదికపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నానని రాహుల్ గాంధీ ప్రకటించారు. దేశంలోని 73 శాతం మంది యువత ఇద్దరు నేతల మధ్య చర్చను కోరుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు సంబంధించిన ప్రధాన సమస్యలపై దేశ అగ్రనేతలు బహిరంగంగా చర్చించడం ప్రజాస్వామ్యానికి అవసరమని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో ఎస్ఐఆర్, ఈవీఎంల వ్యవహారంపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం మరింత ముదిరింది. అయితే ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల నిర్వహణపై అధికారిక నిర్ణయం వెలువడాల్సి ఉంది.



భారీగా పెరిగిన బంగారం ధర

ఒక్క రోజే రూ.5వేలు పైకి..

న్యూఢిల్లీ, నవంబర్ 5 (చురకలు): దేశీయ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలకు మళ్లీ రెక్కలొచ్చాయి. అంతర్జాతీయ పరిణామాలు, డాలర్ విలువ పడిపోవడం తదితర కారణాలతో ఈ లోహాలకు డిమాండ్ ఏర్పడింది. దీంతో అంతర్జాతీయంగా వీటి ధరలు పెరుగుతున్నాయి. ఆ ప్రభావంతో దేశీయంగానూ బంగారం, వెండి ధరలు దూసుకెళ్తున్నాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో మేలిమి 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1.49లక్షలకు చేరింది. క్రితం రోజుతో పోలిస్తే దాదాపు రూ.5వేలు పెరగడం గమనార్హం. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల పుత్తడి ధర రూ.1.35లక్షలు పలికింది. అటు వెండిపై గురువారం ఒక్కరోజే దాదాపు రూ.9వేలు పెరిగింది. నేటి మార్కెట్‌లో కిలో వెండి ధర రూ.2.04లక్షలకు చేరింది. అంతర్జాతీయ విపణిలో స్పాట్ గోల్డ్ ఔన్సు ధర 4129 డాలర్లకు ఎగబాకింది. క్రితం రోజుతో పోలిస్తే దాదాపు 100 డాలర్ల పైనే పెరగడం గమనార్హం. ఇక, ఔన్సు వెండి ధర 52.83 డాలర్లు పలికింది. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలో డిసెంబరు డెలివరీ బంగారం 10 గ్రాములు రూ.1.45 లక్షలు పలుకుతుండగా.. కిలో వెండి రూ.1.89లక్షల వద్ద కొనసాగుతోంది. అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాలతో డాలరు విలువ క్షీణించింది. దీంతో కేంద్ర బ్యాంకులు బంగారం కొనొచ్చనే అంచనాలు ఏర్పడ్డాయి. మరోవైపు, డిసెంబరులో ఫెడ్ వడ్డీరేట్లు పెరగకపోవచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. దీంతో ప్రస్తుత పరిణామాల దృష్ట్యా మదుపర్లు తమ పెట్టుబడులను బంగారం, వెండిపైకి మళ్లిస్తుండటం వీటి ధరల పెరుగుదలకు కారణమైంది. ఇదిలా ఉండగా.. దీపావళికి ముందు వచ్చే ధనత్రయోదశి నేపథ్యంలోనూ ఈ లోహాలకు గిరాకీ పెరిగిందని బులియన్ వర్గాలు వెల్లడించాయి.

నిర్బంధం నుంచే 24 గంటలు!

పోలీసులు అరెస్టు నమోదు ఆలస్యం చేసినా గడువు పొడిగించలేరు

విచారణ, దర్యాప్తు పేరుతో నిర్బంధ సమయాన్ని మినహాయించడానికి వీల్లేదు

గడువు దాటితే విడుదల చేయాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టీకరణ

పోలీసుల నిర్బంధంపై మేజిస్ట్రేట్ల పర్యవేక్షణ తప్పనిసరి



న్యూఢిల్లీ, నవంబర్ 5 (చురకలు): పోలీసులు ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్న క్షణం నుంచే రాజ్యాంగం నిర్దేశించిన 24 గంటల గడువు ప్రారంభమవుతుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అధికారికంగా అరెస్టు నమోదు చేసిన సమయం నుంచి గడువును లెక్కించాలన్న వాదనను తిరస్కరించింది. విచారణ, దర్యాప్తు, తనిఖీల పేరుతో వ్యక్తిని పోలీసుల అదుపులో ఉంచిన సమయాన్ని మినహాయించడానికి వీల్లేదని తేల్చిచెప్పింది. జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ అతుల్ ఎస్. చంద్రుర్కర్‌లతో కూడిన ధర్మాసనం గురువారం ఈ కీలక తీర్పును వెలువరించింది. వ్యక్తిగత స్వేచ్ఛకు రాజ్యాంగం కల్పించిన రక్షణలను పోలీసులు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని అధికరణం 22(2) ప్రకారం అరెస్టు చేసిన వ్యక్తిని 24 గంటల్లోగా సమీప మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచాలని సుప్రీంకోర్టు గుర్తుచేసింది. ఈ గడువును లెక్కించేటప్పుడు న్యాయస్థానానికి తరలించేందుకు పట్టే ప్రయాణ సమయాన్ని మాత్రమే మినహాయించవచ్చని పేర్కొంది. పోలీసుల విచారణ కోసం అదుపులో ఉంచిన సమయాన్ని పక్కనపెట్టి, అరెస్టు నమోదు చేసిన సమయం నుంచి గడువును ప్రారంభించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని స్పష్టం చేసింది. నిర్ణీత గడువులోగా మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచకపోతే, ఇతర చట్టబద్ధమైన నిర్బంధ ఉత్తర్వులు లేని పక్షంలో సంబంధిత వ్యక్తిని విడుదల చేయాల్సి ఉంటుందని పేర్కొంది. పోలీసుల నిర్బంధంపై మేజిస్ట్రేట్లు కచ్చితమైన పర్యవేక్షణ చేపట్టాలని ధర్మాసనం సూచించింది. వ్యక్తిని వాస్తవంగా ఎప్పుడు అదుపులోకి తీసుకున్నారు, అధికారికంగా అరెస్టు ఎప్పుడు నమోదు చేశారు, ఎంతసేపు పోలీసుల నిర్బంధంలో ఉంచారు, నిర్ణీత గడువులోగా న్యాయస్థానం ఎదుట హాజరుపరిచారా అనే అంశాలను పరిశీలించాలని స్పష్టం చేసింది. అరెస్టు పత్రాల్లో పేర్కొన్న సమయాన్ని మాత్రమే కాకుండా వాస్తవ నిర్బంధ సమయాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొంది. త్రిపురలో మాదకద్రవ్యాల నిరోధక చట్టం కింద నమోదైన కేసులో నలుగురి అరెస్టుకు సంబంధించిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ తీర్పును వెలువరించింది. కేసు వివరాల ప్రకారం 2025 సెప్టెంబర్ 29న మధ్యాహ్నం 2 గంటలకు నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకోగా, మరుసటి రోజు ఉదయం 11 గంటలకు అధికారికంగా అరెస్టు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో 24 గంటల గడువును ఏ సమయం నుంచి లెక్కించాలన్న అంశం వివాదంగా మారింది. దీనిపై విచారణ జరిపిన ధర్మాసనం అధికారిక అరెస్టు నమోదు సమయం కాకుండా వాస్తవంగా నిర్బంధించిన సమయమే ప్రామాణికమని స్పష్టం చేసింది. పోలీసులు అరెస్టు నమోదు చేయడంలో జాప్యం చేయడం ద్వారా రాజ్యాంగపరమైన గడువును పొడిగించుకునే అవకాశం లేదని ఈ తీర్పు స్పష్టం చేసింది. వ్యక్తిగత స్వేచ్ఛ, పౌరుల ప్రాథమిక హక్కుల పరిరక్షణలో ఈ నిర్ణయం కీలకంగా మారనుంది. ముఖ్యంగా విచారణ పేరుతో వ్యక్తులను గంటల తరబడి అదుపులో ఉంచి, ఆ తర్వాత అరెస్టు నమోదు చేసే విధానంపై న్యాయపరమైన పర్యవేక్షణకు ఈ తీర్పు ప్రాధాన్యం కల్పించింది.

అధికారం కోసం బీజేపీ ఎంతకైనా తెగిస్తుంది!

- **గోకుల్ డెయిరీ ఎన్నికలపై రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు**
- **పాడి రైతుల తీర్పును తారుమారు చేస్తున్నారని మండిపాటు**
- **ప్రభుత్వ నామినేటెడ్ డైరెక్టర్ల నియామకంపై సుప్రీంకోర్టుకు కాంగ్రెస్**



న్యూ ఢిల్లీ, నవంబర్ 5 (చురకలు): ఇటీవల మహారాష్ట్రలోని కొల్హాపుర్‌లో జరిగిన గోకుల్ మిల్క్ కోఆపరేటివ్ ఎన్నికల్లో ప్రజా తీర్పును తారుమారు చేయడానికి భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తీవ్రంగా ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో ఆరోపించారు. మహారాష్ట్రలోని మహాయుతి కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ, డైరెక్టర్ల బోర్డులో మెజారిటీని అక్రమంగా దక్కించుకోవడానికి ఎన్నికలు ముగిసిన తర్వాత నిబంధనలను మార్చారని ఆయన దుయ్యబట్టారు. ఈ మేరకు రాహుల్ గాంధీ గురువారం తన 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతా వేదికగా ఒక సుదీర్ఘమైన పోస్టు పెట్టారు. గోకుల్ డెయిరీ ఎన్నికల్లో పాడి రైతులు స్పష్టంగా బీజేపీ కూటమిని ఓడించారని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. అందుకే ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత బీజేపీ నిబంధనలను మార్చిందని మండిపడ్డారు. ఇందుకోసం బోర్డులో నలుగురు నామినేటెడ్ డైరెక్టర్లను నియమించి, మొత్తం సభ్యుల సంఖ్యను 12 నుంచి 16కి పెంచి మెజారిటీని దొంగిలించిందని విమర్శించారు. ఇది ముమ్మాటికి పాల ఉత్పత్తిదారుల ఓట్లను దొంగిలించడమేనని, ప్రజా తీర్పును కల్తీ చేయడమేనని స్పష్టం చేశారు. కేవలం అధికారాన్ని కాపాడుకోవడానికి బీజేపీ ఎంతకైనా తెగిస్తుందని, రైతుల ఓట్లను దొంగిలించే వారిని దేశంలోని రైతాంగం ఎప్పటికీ మరచిపోదని రాహుల్ గాంధీ హెచ్చరించారు. కాంగ్రెస్ సీనియర్ నేత పవన్ ఖేడా ఈ అంశంపై స్పందిస్తూ, ఎన్నికలు ముగిసి ఫలితాలు వెలువడిన తర్వాత ప్రభుత్వం తనకిష్టమొచ్చినట్లు నిబంధనలను ఎలా మారుస్తుందని ప్రశ్నించారు. అక్టోబర్ 19న జరిగిన గోకుల్ డెయిరీ (కొల్హాపుర్ జిల్లా సహకార పాల ఉత్పత్తిదారుల సంఘం) ఎన్నికల్లో మొత్తం 25 స్థానాలకు గాను కాంగ్రెస్ నాయకుడు సతేజ్ పాటిల్ నేతృత్వంలోని ప్యానెల్ 13 స్థానాలను గెలుచుకుని స్పష్టమైన మెజారిటీ దక్కించుకుందని గుర్తుచేశారు. అధికార మహాయుతి ప్యానెల్ కేవలం 12 స్థానాలకే పరిమితమైందని వివరించారు. మహాయుతి మద్దతు ఉన్న డైరెక్టర్లు గైర్హాజరై చైర్మన్ ఎన్నికను అడ్డుకున్న తర్వాత, నవంబర్ 10న తిరిగి ఎన్నికలు నిర్వహించాలని బాంబే హైకోర్టు ఆదేశించిందని తెలిపారు. అయితే ఎన్నికైన బోర్డును సజావుగా పనిచేయనివ్వకుండా, రూ.500 కోట్లకు పైగా వార్షిక టర్నోవర్ ఉన్న సహకార సంస్థల మేనేజింగ్ కమిటీల్లో ఐదుగురు ప్రభుత్వ నామినేటెడ్ సభ్యులను నియమించే కొత్త ప్రతిపాదనకు మహారాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపిందని, అందులో నలుగురికి ఓటింగ్ హక్కు కల్పించి తీర్పును తారుమారు చేయడానికి చూస్తోందని ఆరోపించారు. ఈ ప్రజాస్వామ్య వ్యతిరేక నిర్ణయాన్ని సహకార సంస్థల స్వయంప్రతిపత్తిని కాపాడటానికి తాము సుప్రీంకోర్టును ఆశ్రయిస్తున్నట్లు పవన్ ఖేడా వెల్లడించారు. ఇదిలా ఉండగా, సామాజిక సంక్షేమ పథకాల లబ్ధిదారులను గుర్తించేందుకు ఆధార్‌కు బదులుగా ఓటరు గుర్తింపు కార్డును ఉపయోగిస్తామని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ తీవ్రంగా స్పందించారు. 'ఓట్ల చోరీ' అనేది కేవలం ట్రైలర్ మాత్రమేనని, అసలు కథ 'హక్కుల చోరీ' అని దుయ్యబట్టారు. సంక్షేమ పథకాల లబ్ధిదారులను గుర్తించేందుకు ఆధార్ స్థానంలో ఓటరు గుర్తింపు కార్డును ఉపయోగిస్తామని పంచాయతీ రాజ్ మంత్రి పదేపదే చెప్పడం మోదీ ప్రభుత్వ అధికారిక విధానమేనా అని జైరాం రమేశ్ తీవ్రంగా ప్రశ్నించారు.

గజ్వేల్‌లోని ఆర్‌వీఆర్ ఆసుపత్రి ఎదుట ఉద్రిక్తత

- కల్పన మృతిపై బంధువుల ఆగ్రహం
- వైద్యం వికటించడంతోనే కల్పన మృతి చెందిందని కుటుంబ సభ్యుల ఆరోపణ
- ఆసుపత్రి ఎదుట టెంటు వేసి, అంతిమ దీపం వెలిగిస్తూ నిరసన.. న్యాయం చేయాలని డిమాండ్..

గజ్వేల్ ప్రతినిధి, నవంబర్ 05, :



గజ్వేల్ పట్టణంలోని ఆర్‌వీఆర్ ఆసుపత్రి ఎదుట తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కల్పన మృతి చెందిందని, వైద్యం వికటించడం వల్లే ఆమె ప్రాణాలు కోల్పోయిందని మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపిస్తూ గురువారం ఆందోళనకు దిగారు. ఆసుపత్రి ఎదుటే టెంటు ఏర్పాటు చేసి, అంతిమ దీపం వెలిగిస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. కల్పన మృతికి ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు న్యాయం జరిగే వరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు. ఈ ఘటనతో ఆసుపత్రి పరిసరాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కల్పన మృతికి గల అసలు కారణాలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

సర్పంచ్ సత్యం ముదిరాజ్ మృతి పార్టీకి, గ్రామానికి తీరని లోటు

కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటాం మాజీ మంత్రి హరీష్ రావు

నంగునూరు, నవంబర్ 05, :



సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం అప్పలాయ చెరువు గ్రామ సర్పంచ్ పెద్దమ్మల సత్యం ముదిరాజ్ గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతి పట్ల మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. సత్యం ముదిరాజ్ మృతి బాధాకరమని, ఆయన మరణం పార్టీకి, గ్రామానికి తీరని లోటని హరీష్ రావు పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం పరితపిస్తూ, ప్రజాసేవే లక్ష్యంగా పనిచేసిన నాయకుడిగా ఆయన సేవలను కొనియాడారు. సత్యం ముదిరాజ్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ కష్ట సమయంలో కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటానని, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని భరోసా ఇచ్చారు.

ఘనంగా స్వర్గీయ కేఎం పాండు 8వ వర్ధంతి.. నివాళులు..

- ప్రజాసేవలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయం.. భావితరాలకు ఆదర్శం..

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 05, :



కుత్బుల్లాపూర్ మాజీ సర్పంచ్, తొలి కుత్బుల్లాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్, ప్రజానాయకులు స్వర్గీయ కేఎం పాండు 8వ వర్ధంతి సందర్భంగా గురువారం కుత్బుల్లాపూర్‌లోని సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయం వద్ద ఆయన విగ్రహానికి పూలమాల వేసి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వీరారెడ్డి నరేందర్ రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, కమిటీ సభ్యులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని కేఎం పాండు సేవలను స్మరించుకున్నారు. ప్రజాసేవకు అంకితమైన ఆయన జీవితం, ప్రజల సంక్షేమం కోసం చేసిన విశేష కృషి ఎప్పటికీ మరువలేనివని పలువురు పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి ఆయన అందించిన సేవలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ప్రజల హృదయాల్లో ఆయన స్థానం ఎప్పటికీ చిరస్మరణీయంగా నిలిచిపోతుందని నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, అసోసియేషన్ ప్రతినిధులు, స్థానిక ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేటలో కాంగ్రెస్ నేత ఇంట పెళ్లి సందడి.. మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యేల హాజరు

దమ్మపేట, నవంబర్ 05, :



దమ్మపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చిన్నశెట్టి చిట్టిబాబు కుమారుడి వివాహ వేడుకలో గురువారం తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి పాల్గొన్నారు.ఈ సందర్భంగా నూతన వధూవరులను ప్రముఖులు ఆశీర్వదించి, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వాసం శ్రీను, సొంగా ఏసుమణి, పగడాల రమాదేవి, రాంబాబు, చిన్నశెట్టి యుగంధర్, సత్యనారాయణ, గోపి, అప్పారావు, రమేష్, అంగోతు శ్రీనివాసరావు, జెట్టి వెంకటేశ్వరరావు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల స్వచ్ఛ కార్మికులకు 11 నెలలుగా వేతనాలేవి

- పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలి
- నవంబర్ 16, 17, 18 తేదీల్లో కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్షలు

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 05, :



ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వచ్ఛ కార్మికులకు గత 11 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని స్వచ్ఛ కార్మికుల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసు మాధవి డిమాండ్ చేశారు. వేతనాల చెల్లింపులో జిల్లా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆమె విమర్శించారు. సిద్దిపేటలో గురువారం జోగు రాములు అధ్యక్షతన నిర్వహించిన స్వచ్ఛ కార్మికుల సీఐటీయూ జిల్లా స్థాయి సమావేశానికి కాసు మాధవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత నెలలో పెద్దఎత్తున ధర్నా నిర్వహించడంతో జిల్లా విద్యాశాఖ అధికారులు, జిల్లా పరిపాలనాధికారులు, కలెక్టర్‌తో చర్చించి దసరా పండుగలోపు వేతనాలు చెల్లిస్తామని హామీ ఇచ్చినా, నెల రోజులు గడిచినా ఇప్పటివరకు చెల్లించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో లేని వేతనాల సమస్య సిద్దిపేట జిల్లాలోనే తలెత్తడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, మరుగుదొడ్లను శుభ్రం చేయడం, మొక్కలకు నీరు పోయడం వంటి కీలక బాధ్యతలను స్వచ్ఛ కార్మికులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇంతటి సేవలు అందిస్తున్న కార్మికులకు 11 నెలలుగా వేతనాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించకపోతే సీఐటీయూ ఆధ్వర్యంలో నవంబర్ 16, 17, 18 తేదీల్లో సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. పెండింగ్ వేతనాలను తక్షణమే విడుదల చేయాలని, అక్రమ తొలగింపులను అరికట్టాలని, కార్మికులకు గుర్తింపు కార్డులు అందించాలని, అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా కాకుండా నేరుగా కార్మికుల బ్యాంకు ఖాతాల్లోనే వేతనాలు జమ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కామని గోపాలస్వామి, జిల్లా కోశాధికారి గొడ్డుబర్ల భాస్కర్, జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్‌తో పాటు వివిధ మండలాలకు చెందిన స్వచ్ఛ కార్మికులు మల్లేశం, వెంకటేశం, కళావతి, రేణుక, రజిత, సమీనా, సుమలత, మణెమ్మ, కవిత, పుష్పలత, మంజుల, కనకలక్షి , లావణ్య, బాలమణి, సునీత, భాగ్య, కనకయ్య, మల్లమ్మ, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తాం

- కళాశాల అభివృద్ధి పనులను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తాం
- జిల్లా గ్రంథాలయ చైర్మన్ ధర్వల్లి చంద్రం

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 05, :



జిల్లాలో వేలాది మంది విద్యార్థులకు ఉన్నత విద్యను అందిస్తున్న సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మరింత అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపల్లి చంద్రం అన్నారు. గురువారం ఆయన సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలోని విద్యా వసతులు, విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, అభివృద్ధి పనులపై అధ్యాపకులతో చర్చించారు. ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్య అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కళాశాలకు అవసరమైన సౌకర్యాలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనుల పూర్తి వివరాలను అధ్యాపకులు అందించాలని సూచించారు. వాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, సాధ్యమైనంత త్వరగా అభివృద్ధి పనులు చేపట్టేలా తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ కళాశాలల్లో మెరుగైన వసతులు కల్పించడం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత, అధ్యాపకులు, మాజీ కౌన్సిలర్ బుచ్చిరెడ్డి, సిద్దిపేట జిల్లా డీసీసీ ఉపాధ్యక్షుడు మంద పాండు, బాల్ నర్సు, నరేష్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముస్లింల విద్యా ప్రమాణాలను మెరుగు పరిచేందుకు ఎంఐఎం కృషి

- సాలారే మిల్లత్ ఆల్ ఇన్ వన్ గైడ్స్ పంపిణీలో నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్

జగిత్యాల, నవంబర్ 05:-





తెలంగాణ రాష్ట్రంలో ముస్లింల విద్యా ప్రమాణాలు పెంచేందుకు ఎంఐఎం పార్టీ విశేషంగా కృషి చేస్తుందని నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ అన్నారు. శుక్రవారం జగిత్యాల పట్టణంలో రూబీ ఫంక్షన్ హాల్లో ఏర్పాటుచేసిన సాలారే మిల్లత్ ఆల్ ఇన్ వన్ 2026 గైడ్స్ ను జగిత్యాల పట్టణ ప్రభుత్వ ఉర్దూ మీడియం పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ మాట్లాడుతూ.. విద్యార్థులందరూ ముఖ్యంగా బాల, బాలికలు కష్టపడి చదివి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, జీవితంలో పదవ తరగతి వార్షిక పరీక్ష కీలకమని, ఈ పరీక్షలో ఉత్తీర్ణులు అవ్వడానికి సాలారే మిల్లత్ గైడ్ దోహ దపడుతుందని అన్నారు. మాజీ ఎంపీ దివంగత సుల్తాన్ సలావుద్దీన్ ఓవైసీ భవిష్యత్ తరాలకు ఉన్నత విద్యను అందించాలనే సంకల్పంతో గత 25 సంవత్సరాల క్రితం ఆల్ ఇన్ వన్ గైడ్లను ఎంఐఎం పార్టీ తరఫున ఉచితంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అందజేస్తున్నట్లు, సాలారే మిల్లత్ తర్వాత, తమ అధినేత బారిస్టర్ అసదుద్దీన్ ఒవైసీ, శాసనసభ పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీలు తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో ఉర్దూను బ్రతికించడం కోసం ఉర్దూ మీడియం పాఠశాలల విద్యా ప్రమాణాలు పెంచడం కోసం, ముస్లింల విద్య అభివృద్ధి కోసం అమోఘమైనటువంటి కృషి చేస్తున్నట్లు తెలిపారు. తమ అధినేత బారిస్టర్ అసదుద్దీన్ ఒవైసీ, శాసనసభ పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీల సారథ్యంలో.. హైదరాబాద్ నగ రవ్యాప్తంగా పేద ముస్లింల పిల్లలకు బాసటగా నిలవాలని సంకల్పంతో కార్పొరేట్ స్థాయిలో 20 పాఠశాలలను స్థాపించి, 20 వేల మంది విద్యార్థులకు ప్రతి ఏటా విద్యను ఉచితంగా అందిస్తున్నటువంటి ఘనత వీరికి దక్కుతుంద న్నారు. ముస్లిం యువత చెడు వ్యసనాలను మాని ఉన్నత మైనటువంటి చదువులు చదివి ఉన్నత శిఖరాలను అధిరో హించి రాజకీయాల్లో రాణించాలని తమ అధినేత బారిస్టర్ అసదుద్దీన్ ఓవైసీ పిలుపునిచ్చారని గుర్తుచేశారు. సాలరే మిల్లత్ గైడ్స్ ను దివంగత సుల్తాన్ సలావుద్దీన్ నాడు భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా ఈవిద్యా ప్రణాళికను తయారు చేశారని ఆయన గొప్ప సంకల్పంతో నేడు ముస్లింలు క్రీడల్లో, ఉన్నత విద్యలో, సివిల్స్ ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్, గ్రూప్1 వంటి ఉద్యోగాల్లో, డాక్టర్లుగా, ఇంజనీర్లుగా , ఇటు రాజకీయాల్లో రాణిస్తున్నారని చెప్పారు. ఈకార్యక్రమంలో ఎంఐఎం కరీంనగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు ఖాజా లియాఖాత్ అలీ మొహసీన్, జమాతే ఇస్లామీ జిల్లా అధ్యక్షుడు షోయబ్ ఉల్ హఖ్, ,పార్టీ పట్టణ అధ్యక్షుడు సుమేర్ అలీ, కౌన్సిలర్ రజియుద్దీన్, కౌన్సిలర్ ఆయుబ్ ఖాన్, నాయకులు, నౌమాన్, వహీద్, జిల్లా ఉపాధ్యక్షుడు బాసిత్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫాక్స్ సాగర్ సుందరీకరణ పనులతో ఉమామహేశ్వర కాలనీకి ఎలాంటి ఇబ్బంది లేదు

- కాలనీ వాసులు ఆందోళన చెందవద్దు.. అండగా ఉంటాం: ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

కుత్బుల్లాపూర్, నవంబర్ 05, :



సీఎంసీ కొంపల్లి సర్కిల్ పరిధిలోని ఉమామహేశ్వర కాలనీలో బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ గురువారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలోని స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫాక్స్ సాగర్ సుందరీకరణ పనుల్లో భాగంగా హైడ్రా చేపడుతున్న చర్యల నేపథ్యంలో ఉమామహేశ్వర కాలనీ పరిస్థితిపై వస్తున్న ప్రచారాలు, పుకార్లతో తాము ఆందోళన చెందుతున్నామని కాలనీ వాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ స్పందిస్తూ.. ఫాక్స్ సాగర్ సుందరీకరణ పనుల వల్ల ఉమామహేశ్వర కాలనీకి ఎలాంటి ఇబ్బంది ఉండదని స్పష్టం చేశారు. అనవసరమైన పుకార్లను నమ్మి కాలనీ వాసులు భయాందోళనలకు గురికావద్దని సూచించారు. కాలనీ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని, వారి సమస్యల పరిష్కారానికి అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, మాజీ ఎంపీపీ సన్న కవితా శ్రీశైలం యాదవ్, స్థానిక బీఆర్ఎస్ నాయకులు రియాజుద్దీన్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి చరణ్ మృతికి కారణమైన ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలి

- బాధిత కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం, ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలి
- కలెక్టర్ కార్యాలయం ఎదుట యుఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుల ధర్నా

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 05, :

గజ్వేల్ నియోజకవర్గం వర్గల్ మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహంలో ఉంటూ పదో తరగతి చదువుతున్న విద్యార్థి చరణ్ ఆత్మహత్య ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని యునైటెడ్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (యుఎస్ఎఫ్ఐ) సిద్దిపేట జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం సిద్దిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నాయకులు ధర్నా నిర్వహించి, జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఏడి శాస్త్రికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నాచారం శేఖర్, జిల్లా కార్యదర్శి గుడికందుల రవి మాట్లాడుతూ బుధవారం ఉదయం పాఠశాలకు వెళ్లిన విద్యార్థి చరణ్‌ను గణిత ఉపాధ్యాయుడు మహిపాల్ రెడ్డి తీవ్రంగా కొట్టి, తోటి విద్యార్థుల ఎదుట అవమానించారని ఆరోపించారు. ఉపాధ్యాయుడి వేధింపులు, దూషణలతో మనస్తాపానికి గురైన చరణ్ వసతి గృహానికి తిరిగి వచ్చి ఆత్మహత్యకు పాల్పడ్డాడని పేర్కొన్నారు. ఈ ఘటన తమను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో చదువుకునే పేద విద్యార్థుల భద్రతపై అధికారులు సరైన పర్యవేక్షణ చేపట్టకపోవడం వల్లే ఇలాంటి విషాదకర ఘటనలు చోటుచేసుకుంటున్నాయని విమర్శించారు. విద్యార్థి మృతిపై నిష్పక్షపాతంగా ఉన్నతస్థాయి విచారణ జరిపించాలని, విచారణ పూర్తయ్యే వరకు ఆరోపణలు ఎదుర్కొంటున్న గణిత



ఉపాధ్యాయుడు మహిపాల్ రెడ్డిని తక్షణమే విధుల నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఘటనకు సంబంధించి చట్ట ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే తోటి విద్యార్థులు, ప్రత్యక్ష సాక్షులు, వసతి గృహ సిబ్బంది నుంచి పారదర్శకంగా వాంగ్మూలాలు సేకరించాలని విజ్ఞప్తి చేశారు. మృతుడు చరణ్ కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించడంతో పాటు, కుటుంబంలో అర్హులైన ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లాలోని అన్ని బీసీ, ఎస్సీ, ఎస్టీ వసతి గృహాలు, పాఠశాలల్లో విద్యార్థులకు నిరంతర మానసిక కౌన్సెలింగ్ అందించాలని, విద్యార్థుల సమస్యలు, ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. చరణ్ కుటుంబానికి న్యాయం జరిగే వరకు, ఘటనకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునే వరకు విద్యార్థులతో కలిసి యుఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు.

ఎల్‌నినో ప్రభావంతో ఎండుతున్న పంటలు

- క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాఖ పరిశీలన
- భూగర్భ జలాలు తగ్గడంతో బోర్లు ఎండిపోయి వరి పంటకు తీవ్ర నష్టం
- ఎండిపోయిన పంటల వివరాల నమోదు ప్రారంభం
- రైతులు ఏఈఓలను సంప్రదించాలి
- మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్ కుమార్

దుబ్బాక ప్రతినిధి, నవంబర్ 05, :

ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో చోటుచేసుకుంటున్న మార్పులు, భూగర్భ జలాలు తగ్గిపోవడం, బోర్లు ఎండిపోవడం, విద్యుత్ సరఫరాలో అంతరాయాల కారణంగా పలు గ్రామాల్లో పంటలు



ఎండిపోతున్నాయి. ఈ నేపథ్యంలో రైతులకు జరిగిన పంట నష్టాన్ని గుర్తించి నమోదు చేసేందుకు వ్యవసాయ శాఖ క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టింది. దుబ్బాక మండలంలోని గంభీర్‌పూర్, పోతారం గ్రామాల్లో గురువారం ఎండిపోయిన పంటలను మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్ కుమార్ క్షేత్రస్థాయిలో పరిశీలించి, పంట నష్టాల నమోదు ప్రక్రియను పర్యవేక్షించారు. భూగర్భ జలాలు అడుగంటడం, కొన్ని బోర్లు పూర్తిగా ఎండిపోవడం, విద్యుత్ సరఫరాలో సమస్యల కారణంగా వరి, కంది తదితర పంటలు దెబ్బతింటున్నట్లు గుర్తించారు. జిల్లా వ్యవసాయ అధికారి ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాల్లో వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు) పంట పొలాలను సందర్శించి, ఎండిపోయిన పంటల వివరాలను రైతుల వారీగా సంబంధిత యాప్‌లో నమోదు చేస్తున్నారు.

రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

గ్రామాల్లో ఎండిపోయిన పంటలు సాగు చేసిన రైతులు తమ పంట నష్ట వివరాలు నమోదు చేయించుకునేందుకు సంబంధిత ఏఈఓలను సంప్రదించాలని మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్ కుమార్ సూచించారు. ప్రజాప్రతినిధులు కూడా రైతులకు అవగాహన కల్పించి, పంట నష్టాల నమోదు ప్రక్రియకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సంతోష్, ఆయా గ్రామాల సర్పంచులు, రైతులు బాణాల శ్రీనివాస్, మల్లేశం, కృష్ణాగౌడ్, వినీత్, కాశీ, మల్లవ్వ తదితరులు పాల్గొన్నారు.

భట్రాజుల చిరకాల స్వప్నానికి నిధుల సాకారం!

- ఆత్మగౌరవ భవన నిర్మాణానికి రూ.కోటి మంజూరు
- మంత్రి పొన్నం ప్రభాకర్‌కు భట్రాజ సంఘం కృతజ్ఞతలు
- త్వరలో భూమిపూజ.. నిర్మాణ పనులకు శ్రీకారం

హైదరాబాద్ ప్రతినిధి, నవంబర్ 05, :

తెలంగాణ రాష్ట్ర భట్రాజ సంఘం చిరకాల స్వప్నమైన ఆత్మగౌరవ భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.కోటి నిధులు మంజూరు చేయడంపై సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా కోకాపేటలో గత ప్రభుత్వం సంఘానికి కేటాయించిన అర ఎకరం (20 గుంటల) స్థలంలో ఈ భవనాన్ని నిర్మించేందుకు ప్రస్తుత ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఈ మేరకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తన నివాసంలో తెలంగాణ రాష్ట్ర భట్రాజ సంఘం అధ్యక్షులు దేవరాజు విష్ణువర్ధన్ రాజుకు ప్రభుత్వ ఉత్తర్వుల (జీఓ) ప్రతిని గురువారం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ త్వరలోనే భూమిపూజ నిర్వహించి నిర్మాణ పనులు ప్రారంభించాలని సూచించారు. భవన నిర్మాణ పనుల పర్యవేక్షణకు రాష్ట్ర సంఘం తరఫున సభ్యులు, ప్రతినిధులతో కమిటీ ఏర్పాటు చేయాలని తెలిపారు. టెండర్ల ప్రక్రియ ద్వారా భవన నిర్మాణాన్ని పూర్తి చేసే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. కాగా, ప్రస్తుతం మంజూరైన రూ.కోటి నిధులు భవన నిర్మాణానికి సరిపోవని, మరిన్ని నిధులు కేటాయించాలని రాష్ట్ర అధ్యక్షులు దేవరాజు విష్ణువర్ధన్ రాజు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన మంత్రి.. నిర్మాణ పనులు ప్రారంభమైన అనంతరం అవసరమైన అదనపు నిధులను కూడా మంజూరు చేస్తామని భరోసా ఇచ్చారు. భట్రాజుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలవనున్న ఈ భవన నిర్మాణాన్ని త్వరితగతిన ప్రారంభించి, పూర్తిచేసేందుకు రాష్ట్ర సంఘం



కృషి చేస్తుందని నాయకులు తెలిపారు. సంఘం చిరకాల ఆకాంక్షను నెరవేర్చే దిశగా నిధులు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి, ప్రత్యేక చొరవ చూపిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సంఘం తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు దేవరాజు విష్ణువర్ధన్ రాజు, ప్రధాన కార్యదర్శి ప్రతికంఠం పూర్ణచందర్ రాజు, కార్యనిర్వాహక అధ్యక్షులు కూరపాటి కరుణాకర్ రాజు, రాష్ట్ర అధికార ప్రతినిధి బొల్లేపల్లి సీతారామరాజు, బిరుదరాజు రాజేందర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత

- ఇందిరమ్మ ఇళ్ల మంజూరుతో గ్రామగ్రామాన పండుగ వాతావరణం
- ఎల్‌నినో ప్రభావంపై అసత్య ప్రచారాలు నమ్మవద్దు
- నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలి.
- జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

జగిత్యాల ప్రతినిధి, నవంబర్ 05, :

జగిత్యాల మండలం పొలాస గ్రామ ప్రముఖ ప్రాచీన పుణ్యక్షేత్రం శ్రీ పొలేస్తేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్. ఈ సందర్భంగా జగిత్యాల ఎమ్మెల్యేకి ఆశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలు అందజేసి సత్కరించిన ఆలయ అర్చకులు, ఈవో. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పరమేశ్వరుడి, ప్రజల ఆశీస్సులతో ఎమ్మెల్యేగా గెలుపొందానని, జగిత్యాల నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి తన వంతుగా నిరంతరం కృషి చేస్తున్నానని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ అన్నారు. పొలాస గ్రామంలోని శ్రీ పోలాస పొలేస్తేశ్వర స్వామి ఆలయంలో కళ్యాణ మండపం, ప్రహరీ నిర్మాణం తదితర అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం, దాతల సహకారంతోనే ఆలయాల అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. గతంలో ఆలయాల అభివృద్ధిని విస్మరించారని, తాను ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన అనంతరం జగిత్యాల



నియోజకవర్గంలోని అన్ని ఆలయాలకు నిధులు మంజూరు చేయించి అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నానని అన్నారు. అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం పనిచేస్తానని స్పష్టం చేశారు. అలాగే పొలాస గ్రామంలో సుమారు 50 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయని, ఇందిరమ్మ ఇళ్ల మంజూరుతో గ్రామగ్రామాన పండుగ వాతావరణం నెలకొందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావం పై కొందరు కావాలని రాష్ట్ర ప్రభుత్వం పై అసత్య ప్రచారాలు చేస్తున్నారని ప్రపంచ వ్యాప్తంగా ప్రభావం ఉందని అన్నారు. ప్రజలు, రైతులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా నీటిని, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని సూచించారు. రానున్న రోజుల్లో వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు ఆరుతడి పంటలను మాత్రమే సాగు చేయాలని సూచించారు. ప్రకృతి పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగుపై రైతులు ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శంకర్, ఏఎంసీ చైర్మన్ గడ్డం నారాయణరెడ్డి, ఆలయ చైర్మన్ భూమన్న, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాల ముకుందం, ఏఎంసి డైరెక్టర్ జైరాం సురేష్, సత్యనారాయణ గౌడ్, తిరుపతి గౌడ్ తదితరులు పాల్గొన్నారు .

సూరారం ఆర్జీకే కాలనీ సమస్యలపై వారాల వినోద్ కుమార్‌కు ప్రజల వినతి

- సమస్యలను ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తా: వారాల వినోద్ కుమార్



కుత్బుల్లాపూర్, నవంబర్ 05, :

సాయిబాబా నగర్ పరిధిలోని సూరారం కాలనీ రాజీవ్ గృహకల్ప (ఆర్జీకే) ప్రాంతంలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక ప్రజలు గురువారం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వారాల వినోద్ కుమార్‌ను కలిశారు. ఈ సందర్భంగా కాలనీలో ఎదుర్కొంటున్న సమస్యలను ఆయనకు వివరించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలు వివరించిన సమస్యలను వారాల వినోద్ కుమార్ సావధానంగా విన్నారు. ఆయా సమస్యలను కుత్బుల్లాపూర్ హ్యాట్రిక్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ గౌడ్‌తో పాటు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, త్వరితగతిన పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, ఎలాంటి సమస్య ఎదురైనా తనను సంప్రదించవచ్చని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్జీకే కాలనీకి చెందిన ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కె.ఎం. పాండు సేవలు చిరస్మరణీయం

కుత్బుల్లాపూర్ అభివృద్ధికి ఆయన చేసిన కృషి మరువలేనిది

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 05, :

మాజీ సర్పంచ్, తొలి మున్సిపల్ చైర్మన్,



కీర్తిశేషులు కె.ఎం. పాండు 8వ వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుత్బుల్లాపూర్ ప్రాంత అభివృద్ధికి ఆయన చేసిన విశేష సేవలను, ప్రజలకు అందించిన సేవలను నాయకులు స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్, సాయిబాబా నగర్ డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వారాల వినోద్ కుమార్ పాల్గొని కె.ఎం. పాండు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాజ్ కుమార్ ముదిరాజ్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కీర్తిశేషులు కె.ఎం. పాండు సేవలను స్మరించుకున్నారు.

కాంగ్రెస్ కార్యకర్త పాడె మోసిన మంత్రి అడ్లూరి

జగిత్యాల/పెగడపల్లి, నవంబర్ 05, :



పెగడపల్లి గ్రామ

కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు వడ్లూరి ప్రవీణ్ కుమార్ అనారోగ్యంతో మృతి చెందగా విషయం తెలుసుకున్న రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రవీణ్ కుమార్ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం నిర్వహించిన ప్రవీణ్ కుమార్ అంతిమయాత్రలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొని స్వయంగా పాడె మోశారు. అలాగే అంత్యక్రియలు, దహన సంస్కారాల కార్యక్రమంలో పాల్గొని తుది వీడ్కోలు పలికారు. వెంట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

క్రిషన్ దశదిన కర్మకు ఎమ్మెల్యే హాజరు

- చిత్రపటానికి నివాళులర్పించిన కవ్వంపల్లి

హైదరాబాద్ బ్యూరో, నవంబర్ 05, :
ముషీరాబాద్‌లోని కాశిష్ కన్వెన్షన్ సెంటర్‌లో గురువారం నిర్వహించిన విద్యావేత్త, మిత్రుడు ఎం. క్రిషన్ దశదిన కర్మ కార్యక్రమానికి మానకొండూరు ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ హాజరయ్యారు. ఇటీవల అనారోగ్యంతో మరణించిన క్రిషన్‌కు నివాళులర్పిస్తూ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో అధికారి దొడ్డి ఆంజనేయులు, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ విసి సజ్జనార్ తదితరులతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. క్రిషన్ మృతి పట్ల ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, ఆయనతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.



టీటీడీ ఆలయ భూములను పరిరక్షించాలి

- ఐదు ఎకరాల భూమిలో అక్రమ కబ్జాలు, నిర్మాణాలను అడ్డుకోవాలి

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 05, :
సిద్దిపేట పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన భూములను పరిరక్షించేందుకు అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని దేవాలయ పరిరక్షణ సమితి నాయకులు డిమాండ్ చేశారు. సిద్దిపేట రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 1340లో ఉన్న ఐదు ఎకరాల దేవస్థాన భూమిని అక్రమ కబ్జాలు, నిర్మాణాల నుంచి కాపాడాలని కోరుతూ గురువారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమితి నాయకుడు జిల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ దేవస్థానానికి చెందిన భూముల్లో ప్రైవేటు కార్యక్రమాలు, వ్యాపార కార్యకలాపాలకు అనుమతులు ఇవ్వడం సరికాదన్నారు. ముఖ్యంగా దీపావళి పేరుతో ఆలయ



భూమిలో దుకాణాలు ఏర్పాటు చేసి వ్యాపారాలు నిర్వహించేందుకు ఎలాంటి అనుమతులు ఇవ్వకూడదని కోరారు. 1995-96 పహాణీ రికార్డుల్లో ఈ ఐదు ఎకరాల భూమి దేవస్థానానికి చెందినదిగా నమోదై ఉందని, గతంలో దేవాదాయ శాఖకు సంబంధించిన రికార్డులు కూడా ఉన్నాయని వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రస్తుతం భూమిపై వివాదాలు నెలకొన్న నేపథ్యంలో కొందరు వ్యక్తులు అక్రమంగా స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. భూమికి సంబంధించిన రెవెన్యూ, దేవాదాయ శాఖ రికార్డులను సమగ్రంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించాలని కోరారు. వివాదం పరిష్కారమయ్యే వరకు భూమిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా యథాతథ స్థితిని కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. దేవాదాయ శాఖ నిబంధనల ప్రకారం ఆలయ ఆస్తులను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే దీపావళి సందర్భంగా ఆలయ భూమిలో వ్యాపార దుకాణాల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వవద్దని కోరుతూ బుధవారం సిద్దిపేట ఆర్డీఓ, ఏసీపీ, అగ్నిమాపక శాఖ అధికారులకు సైతం వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ పరిరక్షణ సమితి నాయకులు ఉడుత మల్లేశం, పాసికంటి సత్యం తదితరులు పాల్గొని ఆలయ భూముల పరిరక్షణకు అధికారులు వెంటనే స్పందించాలని కోరారు.

పదవీ విరమణ హోంగార్డులకు బెనిఫిట్స్ చెక్కులు అందజేసిన ఎస్పీ



జగిత్యాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 05, :
పోలీస్ శాఖలో విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన హోంగార్డుల సేవలను గుర్తిస్తూ వారికి ప్రభుత్వం మంజూరు చేసిన రిటైర్మెంట్ బెనిఫిట్స్‌లో భాగంగా హోంగార్డులు నరసింహులు, వెంకయ్యలకు ఒక్కొక్కరికి రూ.1.30 లక్షల చొప్పున మంజూరైన చెక్కులను జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో హోంగార్డుల సేవలు ఎంతో విలువైనవని, పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ విధి నిర్వహణలో వారు అందించిన సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం కూడా వారి సంక్షేమానికి పోలీస్ శాఖ ప్రాధాన్యత ఇస్తుందని, ప్రభుత్వం తరఫున వారికి అందాల్సిన ఆర్థిక ప్రయోజనాలు సకాలంలో అందేలా శాఖ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ సైదులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలు శ్రావణికి టిఎస్యూటిఎఫ్ ఆధ్వర్యంలో సన్మానం

చొప్పదండి/కొడిమ్యాల, నవంబర్ 5, :
జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని అరేపల్లి పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి ఎచ్ఎం శ్రావణి ప్రతిభా, కృషి అభినందనీయని టిఎస్యూటిఎఫ్ కొడిమ్యాల అధ్యక్ష, కార్యదర్శులు నిషాని మహేందర్, కొత్తూరి నాగరాజు అన్నారు. ఒక మహిళా ఉపాధ్యాయులుగా, కళాకారినిగా, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలిగా అభినందనీయమని, సభ్యత్వ నమోదు కార్యక్రమం సందర్భంగా వారిని ఘనంగా సన్మానించారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షులు తిరుకోవెల



శ్యామ్ సుందర్, ప్రధాన కార్యదర్శి అంబటి భూమేశ్వర్, కుటుంబ సంక్షేమ నిధి కన్వీనర్ వేముల రాజీవ్ హాజరై వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నారి, సంపత్ కుమార్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల ప్రతినిధి, నవంబర్ 05, :
జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన మెంగు లక్ష్మీ రాజన్నర్సు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు చీరను కానుకగా అందజేసి, నూతన గృహాన్ని ప్రారంభించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మెన్ గడ్డం



నారాయణ రెడ్డి, ఉప సర్పంచ్ సత్తిరెడ్డి, ధర్మారం సర్పంచ్ మల్లేష్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాల ముకుందం, నాయకులు పురిపాటి రాజిరెడ్డి, మాజీ ఎంపీటీసీ గిద్దె శంకర్, నల్ల స్వామి రెడ్డి, దనేశ్వర్ రావు, సత్తవ్వ, వార్డు సభ్యులు, లత మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కేఎం. పాండు ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- ఆయన సేవలు, ప్రజాసేవా స్ఫూర్తి చిరస్మరణీయం: బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్

కుత్బుల్లాపూర్, నవంబర్ 05, :
కుత్బుల్లాపూర్ రాజకీయ పితామహుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ స్వర్గీయ కేఎం. పాండు 8వ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం చింతల్‌లోని కేఎం. పాండు మార్గ్ వద్ద నిర్వహించిన సంస్మరణ కార్యక్రమంలో ఆయన తనయుడు, బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ పాల్గొని ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్వర్గీయ కేఎం. పాండు విగ్రహానికి పూలమాల వేసి స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ మాట్లాడుతూ.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి స్వర్గీయ కేఎం. పాండు చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. విద్యాభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుచూపుతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. అక్షరాస్యతతోనే పేద ప్రజల జీవితాల్లో నిజమైన వెలుగులు నిండుతాయని బలంగా విశ్వసించి, విద్యకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ అనేక కుటుంబాల జీవితాల్లో మార్పు తీసుకురావడానికి కృషి చేసిన మహానేతగా కొనియాడారు. రాజకీయ రంగంలో తనదైన ముద్ర వేసుకున్న కేఎం. పాండు ఎంతోమంది నాయకులకు రాజకీయంగా అవకాశాలు కల్పించి, ప్రజాసేవకు మార్గదర్శకంగా నిలిచారని అన్నారు. ఆయన ఆశయాలు, ప్రజాసేవా స్ఫూర్తిని కొనసాగిస్తూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ అంకితభావంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సంస్మరణ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వివిధ పార్టీల



నాయకులు, మహిళా నాయకురాళ్లు, అనుబంధ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొని స్వర్గీయ కేఎం. పాండుకు ఘనంగా నివాళులర్పించారు.

కార్మిక వాడల సృష్టికర్త కీర్తిశేషులు కేఎం పాండు

- చింతల్‌లో ఘనంగా వర్ధంతి కార్యక్రమం
- విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన గూడ ఐలయ్య గౌడ్, కార్మిక, దళిత నాయకులు

కుత్బుల్లాపూర్, నవంబర్ 05, :
కుత్బుల్లాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్, ప్రముఖ కార్మిక నాయకులు కీర్తిశేషులు కేఎం పాండు వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం చింతల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు, రాష్ట్రీయ ఓబీసీ జాతీయ అధ్యక్షులు, ఐఎన్‌టీయూసీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్య గౌడ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు, దళిత నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గూడ ఐలయ్య గౌడ్ మాట్లాడుతూ ఒకప్పుడు అరణ్య ప్రాంతంగా ఉన్న కుత్బుల్లాపూర్ ప్రాంతాన్ని



పారిశ్రామికంగా అభివృద్ధి చేయడంలో కేఎం పాండు కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ హయాంలో హెచ్ఎంటీ పరిశ్రమ స్థాపనతో పాటు జీడిమెట్ల, షాపూర్‌నగర్, కుత్బుల్లాపూర్ ప్రాంతాల్లో పారిశ్రామిక అభివృద్ధికి ఆయన ఎనలేని కృషి చేశారని కొనియాడారు. వివిధ రాష్ట్రాలు, జిల్లాల నుంచి ఉపాధి కోసం వలస వచ్చిన నిరుపేద కార్మికులకు నివాసం కల్పించాలనే గొప్ప సంకల్పంతో ఇళ్ల స్థలాలు అందించి కార్మిక వాడల ఏర్పాటుకు కేఎం పాండు విశేష కృషి చేశారని తెలిపారు. పేదల పక్షాన నిలబడి వారి అభ్యున్నతికి నిరంతరం శ్రమించిన ఆయన సేవలు, చరిత్ర చిరస్మరణీయమని పేర్కొన్నారు. నాటి తరం నాయకులకు, నేటి తరం నాయకులకు కేఎం పాండు జీవితం ఆదర్శప్రాయమని అన్నారు. ఆయన కుమారుడు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద ప్రజలకు సేవలందిస్తూ ప్రజా నాయకుడిగా తన తండ్రి ఆశయాలను కొనసాగించడం అభినందనీయమని పేర్కొన్నారు. కేఎం పాండు చేసిన నిస్వార్థ రాజకీయ, సామాజిక సేవలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని గూడ ఐలయ్య గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఐఎన్‌టీయూసీ అధ్యక్షులు హెచ్ఎంటీ కృష్ణ గౌడ్, రాష్ట్రీయ దళిత సేన అధ్యక్షులు డాక్టర్ ఏవీ జేమ్స్ శంకర్, పలువురు కార్మిక, దళిత నాయకులు పాల్గొని కేఎం పాండుకు ఘనంగా నివాళులర్పించారు.

24 గంటల్లోనే కేసును ఛేదించిన పోలీసు సిబ్బందికి ఎస్పీ అభినందనలు

- మల్యాల సీఐ, కొడిమ్యాల ఎస్ఐ, పోలీస్ కానిస్టేబుళ్లకు బహుమతులు అందజేత

జగిత్యాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 05, :
జగిత్యాల జిల్లా కొడిమ్యాల పోలీస్ స్టేషన్ పరిధిలో మహిళ మెడలో నుంచి బంగారు పుస్తెలతాడును లాక్కొని పరారైన ముగ్గురు నిందితులను సంఘటన జరిగిన కేవలం 24 గంటల్లోనే గుర్తించి అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించడంలో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులను, సిబ్బందిని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ గురువారం ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఈరోజు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో మల్యాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజ్ కుమార్, కొడిమ్యాల పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ నరేష్, ఐడీ పార్టీ కానిస్టేబులు రాజేందర్, అంజనేయులు, విక్రాంత్ లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి, వారి విధి నిర్వహణను ప్రశంసిస్తూ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ నేరం జరిగిన వెంటనే స్పందించి, ఎలాంటి ఆలస్యం లేకుండా దర్యాప్తు ప్రారంభించడం, అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం, క్షేత్రస్థాయిలో సమాచార సేకరణ చేయడం, పోలీసు బృందాల మధ్య సమన్వయంతో పనిచేయడం వల్లే ఈ కేసును కేవలం 24 గంటల్లోనే ఛేదించడం సాధ్యమైందని తెలిపారు. మహిళ మెడలో నుంచి బంగారు పుస్తెలతాడును లాక్కొని పరారైన ముగ్గురు నిందితులను వేగంగా గుర్తించి అరెస్ట్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. పోలీసు శాఖలో విధి నిర్వహణలో వేగం, సమయస్ఫూర్తి, అంకితభావం, సమన్వయం ఎంతో ముఖ్యమని ముఖ్యంగా మహిళలపై జరిగే నేరాలు, చైన్ స్నాచింగ్ వంటి ఆస్తి సంబంధిత నేరాల విషయంలో పోలీసులు అప్రమత్తంగా ఉంటూ బాధితులకు త్వరితగతిన న్యాయం



జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతిభ కనబరిచే పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల డిఎస్పి పురుషోత్తం రెడ్డి పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం

- నూతన పైప్‌లైన్ నిర్మాణానికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాలు

కూకట్‌పల్లి ప్రతినిధి, నవంబర్ 05, :
మంగళబస్తీలో డ్రైనేజీ పైప్‌లైన్ లీకేజీ సమస్యతో స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు గురువారం ఆ ప్రాంతాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా పాత పైప్‌లైన్ స్థానంలో నూతన పైప్‌లైన్ నిర్మాణం చేపట్టి



సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో ఎలాంటి అలసత్వం వహించరాదని, డ్రైనేజీ సమస్యను ప్రాధాన్యతగా తీసుకొని పనులను తక్షణమే ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని వాటర్ వర్క్స్ అధికారులకు సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, వాటర్ వర్క్స్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమగడ్డ సిద్ధిపేట నుంచే మరో పోరాటానికి శ్రీకారం

- ఈ నెల 13న టీఆర్ఎస్ జిల్లా కార్యాలయానికి భూమిపూజ
- పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత రాక.. భారీగా జనసమీకరణకు ఏర్పాట్లు..
- వెల్లడించిన జిల్లా అధ్యక్షుడు లోక రవిచంద్ర

సిద్ధిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 05, :

తొలి, మలిదశ తెలంగాణ ఉద్యమాలకు ఊపిరిలూదిన సిద్ధిపేట గడ్డ నుంచే మరో సామాజిక ఉద్యమానికి శ్రీకారం చుట్టనున్నట్లు తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) సిద్ధిపేట జిల్లా అధ్యక్షుడు లోక రవిచంద్ర తెలిపారు. ఈ నెల 13న సిద్ధిపేటలో పార్టీ జిల్లా కార్యాలయ భవన నిర్మాణానికి భూమిపూజ నిర్వహించ నున్నట్లు వెల్లడించారు. గురువారం రంగధాంపల్లి చౌరస్తా సమీపంలో పార్టీ నాయకులతో కలిసి భూమిపూజ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రవిచంద్ర మాట్లాడుతూ భౌగోళిక తెలంగాణ సాధన అనంతరం రాష్ట్రంలో సామాజిక న్యాయం, అంతరాలు లేని తెలంగాణ నిర్మాణమే లక్ష్యంగా కల్వకుంట్ల కవిత నాయకత్వంలో టీఆర్ఎస్ పార్టీ ముందుకు సాగుతోందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీకి ప్రజల ఆదరణ పెరుగుతోందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ప్రతి జిల్లాలో పార్టీ కార్యాలయాల నిర్మాణం చేపడుతున్నట్లు వివరించారు. ఈ నెల 13న ఉదయం 9 గంటలకు పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత స్వయంగా సిద్ధిపేటకు విచ్చేసి జిల్లా కార్యాలయ భవన నిర్మాణానికి భూమిపూజ చేయనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

భూమిపూజకు ముమ్మర ఏర్పాట్లు



భూమిపూజ కార్యక్రమం కోసం రంగధాంపల్లి చౌరస్తా సమీపంలోని స్థలాన్ని చదును చేయించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వాహనాల పార్కింగ్‌కు అనువైన ప్రదేశాలను పరిశీలించారు. పార్టీ కార్యకర్తలు, ముఖ్య నాయకులకు కార్యక్రమ నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. కవిత పర్యటన మార్గానికి సంబంధించి రూట్ మ్యాప్‌ను కూడా సిద్ధం చేశారు. ఈ కార్యక్రమంలో సిద్ధిపేట, గజ్వేల్, హుస్నాబాద్ నియోజకవర్గాల పార్టీ ఇన్‌ఛార్జీలు చల్లారం మల్లారెడ్డి, కొట్టాల యాదగిరి, శ్రవణ్ కుమార్ గౌడ్, దుబ్బాక పట్టణ అధ్యక్షురాలు అనూరాధ, గౌస్ మియా, బాలాచారి, అనిల్ కుమార్, వెంకటేశ్, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దొడ్ల వెంకటేష్ గౌడ్ చేతుల మీదుగా వెంకటేశ్వర మెడికల్ స్టోర్ ప్రారంభం

కూకట్పల్లి ప్రతినిధి, నవంబర్ 05, :

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ మహాత్మా గాంధీ నగర్ మెయిన్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన వెంకటేశ్వర మెడికల్, జనరల్ స్టోర్‌ను గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ హాజరై రిబ్బన్ కట్ చేసి స్టోర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన స్టోర్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఈ మెడికల్ స్టోర్ ద్వారా స్థానిక ప్రజలకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచి మెరుగైన సేవలు అందించాలని సూచించారు. వ్యాపారంలో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, స్టోర్ యజమాని లాల్ బాబు, వాలి నాగేశ్వరరావు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



వేములవాడ రూరల్ తహశీల్దార్ కార్యాలయానికి ఎకరం స్థలం కేటాయింపు

- మార్కెట్ యార్డులో తహశీల్దార్ కార్యాలయం.. ఏకగ్రీవంగా తీర్మానం
- మార్కెట్ అభివృద్ధికి ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవ
- చైర్మన్ రొండి రాజు*

వేములవాడ ప్రతినిధి, నవంబర్ 05, :

వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ సాధారణ సమావేశం చైర్మన్ రొండి రాజు అధ్యక్షతన గురువారం మార్కెట్ కమిటీ యార్డు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, కార్యదర్శి సరోజన, మరియు పాలకవర్గ డైరెక్టర్లందరూ పాల్గొని పలు కీలక అంశాలపై చర్చించారు. సమావేశం అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు మాట్లాడుతూ, తమ పాలకవర్గం ఏర్పడి రెండు సంవత్సరాల కాలం పూర్తవుతున్న సందర్భంగా ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు,



వేములవాడ రూరల్ మండల నూతన తహశీల్దార్ కార్యాలయం ఏర్పాటు కోసం మార్కెట్ కమిటీ యార్డులో ఎకరం స్థలాన్ని కేటాయిస్తూ పాలకవర్గ సభ్యులు, సెక్రటరీ సమక్షంలో ఏకగ్రీవంగా తీర్మానం చేయడం జరిగిందన్నారు. గత మూడేళ్ల పాలనా కాలంలో ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ నేతృత్వంలో నియోజకవర్గంలో అపూర్వమైన అభివృద్ధి పనులు జరిగాయని వివరించారు. రైతుల సంక్షేమం కోసం మర్రిపెల్లిలో రైతు విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు 40 ఎకరాల స్థలాన్ని కేటాయించామని తెలిపారు. దక్షిణకాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం పరిధిలోని గోశాల కొరకు కూడా మరిపెల్లిలోనే మరో 40 ఎకరాల స్థలాన్ని కేటాయించడం జరిగిందన్నారు. వీటితో పాటు గత పదేళ్లుగా మూలకుపడ్డ మరిపెల్లి రిజర్వాయర్ పనులను పునరుద్ధరించి, ఇప్పటికే దాదాపు 75 శాతం పనులను విజయవంతంగా పూర్తి చేయడం జరిగిందని చెప్పారు. తమ రెండు సంవత్సరాల పాలనా కాలంలో ఇప్పటివరకు 10 పాలకవర్గ సమావేశాలను విజయవంతంగా నిర్వహించుకున్నామని చైర్మన్ తెలిపారు. ఈ సమావేశాలు మరియు మార్కెట్ విధులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో సాగేందుకు నిరంతరం సహకరించిన రైతులకు పూర్వపు సెక్రటరీలకు, ప్రస్తుత సెక్రటరీకి, మార్కెట్ సిబ్బందికి, టైపిస్టులకు మరియు సెక్యూరిటీ గార్డులందరికీ చైర్మన్ రొండి రాజు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు బచావో, దేశ్ బచావో కార్యక్రమం విజయవంతం



- బండి రమేష్ ఆధ్వర్యంలో హేమదుర్గ భవన్‌లో విజయోత్సవ సంబరాలు

కూకట్పల్లి ప్రతినిధి, నవంబర్ 05, :

ఏఐసీసీ, పీసీసీ పిలుపు మేరకు ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించిన ఓటు బచావో – దేశ్ బచావో' కార్యక్రమాన్ని విజయవంతం చేసి తిరిగి వచ్చిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు, సీనియర్ నాయకులకు అభినందనలు తెలియజేస్తూ గురువారం కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం శ్రీ హేమదుర్గ భవన్‌లో విజయోత్సవ సంబరాలు నిర్వహించారు.టీపీసీసీ ఉపాధ్యక్షుడు కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేక్ కట్ చేసి విజయోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమానికి కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు, సీనియర్ నాయకులు పెద్ద సంఖ్యలో బస్సుల ద్వారా తరలివెళ్లి విజయవంతం చేయడం అభినందనీయమన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ శ్రేణులు ఐక్యంగా ముందుకు సాగడం గర్వకార ణమని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ కాంగ్రెస్ పార్టీ చేపట్టే ప్రతి కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

క్రీడా మైదానంలో భాష్యం విద్యార్థుల విజయకేతనం

- జోనల్ స్థాయి పోటీల్లో పలు విభాగాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం
- వైభవంగా క్రీడా సంబరాలు ప్రారంభం
- ముఖ్య అతిథిగా డిప్యూటీ కమిషనర్ జి ఆంజనేయులు

కూకట్‌పల్లి ప్రతినిధి,నవంబర్ 05, :

కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ కాలనీలోని భువన విజయం గ్రౌండ్‌లో భాష్యం విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన జోనల్ స్థాయి క్రీడా పోటీలు బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. నవంబర్ 4, 5 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ క్రీడా సంబరాల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కూకట్‌పల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జి ఆంజనేయులు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలని, క్రీడా స్ఫూర్తి, క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు. ఈ పోటీల్లో కబడ్డీ, క్రికెట్, ఖో-ఖో, వాలీబాల్, త్రోబాల్, 4×100 మీటర్ల రిలే పరుగు, టెన్నికాయిట్, చెస్, క్యారమ్స్ తదితర విభాగాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. కాగా, భాష్యం విద్యార్థులు పలు విభాగాల్లో అద్భుత ప్రతిభ కనబరిచి విజయాలు సాధించారు. జూనియర్ బాలుర క్రికెట్, ఖో-ఖో విభాగాల్లో ప్రథమ స్థానాలు సాధించగా, జూనియర్ బాలికల ఖో-ఖో, టెన్నికాయిట్, 100 మీటర్ల పరుగు పందెం, జూనియర్ బాలుర క్యారమ్స్ పోటీల్లో ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. యోగా పోటీల్లోనూ విద్యార్థులు ప్రతిభ కనబరిచి తదుపరి రౌండ్లకు అర్హత సాధించారు. నృత్య పోటీల్లో జూనియర్ బాలికలు ప్రథమ బహుమతి, సీనియర్ బాలురు ద్వితీయ బహుమతి సాధించారు. విద్యార్థులు సాధించిన విజయాలపై భాష్యం విద్యాసంస్థల సీఈఓ చైతన్య, ఇతర ప్రతినిధులు, ప్రిన్సిపాల్



శ్రీదేవి హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు క్రీడా, సాంస్కృతిక రంగాల్లో ప్రతిభ కనబరచడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందించి ప్రోత్సహించిన పీఈటీలను అభినందించారు. భవిష్యత్తులోనూ విద్యార్థులు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

సర్పంచ్ పెద్దమ్మల సత్యం మృతి పట్ల విఆర్ఆర్ దిగ్భ్రాంతి

- అంతిమయాత్రలో పాల్గొన్న వంగ రాజేశ్వర్ రెడ్డి

నంగునూరు, నవంబర్ 05 :

సిద్దిపేట నియోజకవర్గం నంగునూరు మండలం అప్పలయ చెరువు గ్రామ సర్పంచ్ పెద్దమ్మల సత్యం ముదిరాజ్ మృతి చెందారనే విషయం తెలుసుకున్న యువ పారిశ్రామికవేత్త వంగ రాజేశ్వర్ రెడ్డి వెంటనే వారి నివాసానికి చేరుకొని తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. అనంతరం వంగ రాజేశ్వర్ రెడ్డి మృతుడి అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యం ముదిరాజ్ పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గ్రామ సర్పంచ్‌గా ప్రజలకు సేవలందించిన పెద్దమ్మల సత్యం ముదిరాజ్ మరణం అప్పలాయ చెరువు గ్రామానికి తీరని లోటని ఆయన పేర్కొన్నారు. ప్రజా జీవితంలో ఆయన అందించిన సేవలను స్మరించుకుంటూ వారి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా కల్పించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.



వివేకానంద నగర్‌లో నూతన వైద్యశాల ప్రారంభం

- కాలనీవాసులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి,జనంపల్లి పురేందర్ రెడ్డి

కూకట్‌పల్లి ప్రతినిధి, నవంబర్ 05, :

వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని రామకృష్ణ వీధి కాలనీలో లక్షి చిల్డ్రన్, ఆంకాలజిస్ట్ క్లినిక్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గురువారం ఉదయం 10:30 గంటలకు జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రమ్యవర్ధిని, కమిటీ సభ్యులు పి సూర్యనారాయణ, రాజు సమక్షంలో రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి, కార్యదర్శి రాంచందర్ రావు, కమిటీ సభ్యులు జి ప్రసాద్, టైగర్ పురుషోత్తం, లక్ష్మీనారాయణ మూర్తి,



వెంకటేశ్వరరావు, జి నర్సింగ్ రావు, కిషోర్, భాస్కర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొని క్లినిక్‌ను ప్రారంభించారు.అనంతరం డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రమ్యవర్ధినిలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి మాట్లాడుతూ, వైద్యులు కాలనీవాసులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. నూతనంగా ప్రారంభించిన వైద్యశాల దినదినాభివృద్ధి చెంది ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. అదేవిధంగా ఈ కార్యక్రమానికి సహకరించిన కమిటీ సభ్యులు పి సూర్యనారాయణకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న కాలనీవాసులకు, అసోసియేషన్ కమిటీ సభ్యులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు.

జన సంకల్ప యాత్ర విజయంతో బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం

- విజయోత్సవ అభినందన సభకు హాజరైన వడ్డేపల్లి రాజేశ్వరరావు

కూకట్పల్లి ప్రతినిధి, నవంబర్ 05, :

జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ తరలింపు కోసం ఈటల రాజేందర్ ఆధ్వర్యంలో చేపట్టిన జన సంకల్ప యాత్ర విజయవంతమైన సందర్భంగా గురువారం నిర్వహించిన విజయోత్సవ అభినందన సభలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గ బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సభకు హాజరైన ఆయన, యాత్ర విజయవంతానికి కృషి చేసిన నాయకులు, కార్యకర్తలను అభినందించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీజేపీ నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు ధాన్యాన్ని విక్రయించాలి

- కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గం ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి
- ఐకేపీ వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన చెరుకు శ్రీనివాస్ రెడ్డి



దుబ్బాక ప్రతినిధి, నవంబర్ 05, :
రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు విక్రయించుకోవాలని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గం ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి సూచించారు. నార్సింగి మండలం నర్సంపల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు సెంటర్ ని గురువారం దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు ధాన్యాన్ని విక్రయించుకోవాలని, నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. సన్న ధాన్యానికి బోనస్ తో పాటు, దొడ్డు ధాన్యానికి నిర్ణీత మద్దతు ధర చెల్లించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో నార్సింగ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యేన్నం రాజేందర్ రెడ్డి, టీపీసీసీ సేవాదళ్ ఐ ఇరప్ప యాదగిరి యాదవ్, డీసీసీ జనరల్ సెక్రెటరీ బక్కన్న గారి సంపత్ రెడ్డి, నర్సంపల్లి గ్రామ సర్పంచ్ కొండాపురం భాగ్యలక్ష్మి రాజేశ్వర్ గౌడ్, ఉప సర్పంచ్ బొమ్మగారి ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు ఎండీ . అన్వర్,ఆకుల నరేష్, బాచి, జానీ, శ్రీధర్ రెడ్డి, అంచనూరి రాజేష్, సుధాకర్ ప్రజాప్రతినిధులు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేసిన తహసీల్దార్ శ్రీనివాస్ రావు



నూతనకల్, నవంబర్, 05, :
ప్రభుత్వ బాలుర షెడ్యూల్డ్ కులముల వసతిగృహమును తహసిల్దార్ శ్రీనివాస్ రావు గురువారం తనిఖీ చేశారు. మొత్తము 66 మంది విద్యార్థులకు 56 మంది విద్యార్థులు హాజరైనారు. ఫేషియల్ రికగ్నిషన్ అప్లికేషన్ ద్వారా హాజరు తీసుకోవడం జరుగుతున్నదని గమనించారు.విద్యార్థులతో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకోవడం జరిగినది మరియు ఈరోజు మెనూ ప్రకారం పప్పు మరియు ఎగ్స్ లను అందించినారు విద్యార్థులతో మాట్లాడినప్పుడు వసతిగృహంపరంగా మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నట్లుగా తెలిపినారు మరియు వాచ్మెన్ కూడా ప్రతిరోజు ఉంటున్నారని తెలిపినారు. విద్యార్థులకు ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే వెంటనే తహసిల్దార్ తెలియజేయవలసిందిగా కోరడం జరిగినది.

రాష్ట్రస్థాయి తైక్వాండోలో అస్మితకు బంగారు పతకం

మంచిర్యాల, నవంబర్ 05, : హైదరాబాద్లో గల జవహర్లాల్ నెహ్రూ టెక్నాలజీకల్ యూనివర్సిటీ (జేఎన్టీయూ) ఆధ్వర్యంలో గురువారం జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో మంచిర్యాలకు చెందిన విశ్వనాథ్ అస్మిత అండర్–62లో తన ఘనతను చాటి బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. శిక్షకుడు మండ శ్రీనివాస్తో పాటు అస్మిత తల్లిదండ్రులు విశ్వనాథ్ జయంతి, విశ్వనాధ్ రాము అభినందించారు. అస్మిత మరెన్నో విజయాలను సాధించాలని ఆకాంక్షించారు.

భూ భారతి రీసర్వేను పారదర్శకంగా నిర్వహించాలి





- రైతులకు రెండు రోజుల ముందుగానే సమాచారం ఇవ్వాలి
- జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 05, :
రైతులు, భూ యజమానుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూ భారతి రీ సర్వే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి అధికారులను ఆదేశించారు. గురువారం మిరుదొడ్డి మండలం లింగుపల్లి, తొగుట మండలం చందాపూర్ గ్రామాల్లో కొనసాగుతున్న భూ భారతి రీసర్వే పనులను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ యజమానులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సర్వే ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. తొలుత గ్రామ సరిహద్దులు, ప్రభుత్వ భూములు, ఆబాది, చెరువులు, కుంటలు, నక్షా బాటల సర్వే పూర్తి చేసిన తర్వాతే పట్టా భూముల సర్వే చేపట్టాలని స్పష్టం చేశారు. పట్టా భూముల సర్వేకు కనీసం రెండు రోజుల ముందుగానే రైతులు, భూ యజమానులకు సమాచారం అందించాలని, గ్రామంలో నివసించని భూ యజమానులకు సైతం ముందస్తు సమాచారం ఇవ్వాలని జీపీఓలు, సర్వేయర్లను ఆదేశించారు. సర్వే సమయంలో రైతులు, భూ యజమానులు స్వయంగా పాల్గొని ప్రక్రియను పరిశీలించాలని, ఏవైనా సందేహాలు ఉంటే అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సూచించారు. సర్వే పూర్తయిన వెంటనే సంబంధిత భూమి వివరాలను రైతులకు తప్పనిసరిగా తెలియజేయాలని ఆదేశించారు. ఒకే భూ యజమానికి ఒకే ప్రాంతంలో పలు సర్వే నంబర్లలో భూములు ఉన్నట్లయితే భూ భారతి చట్టం ప్రకారం ఒకే సర్వే నంబర్ కేటాయించే విధానం ఉంటుందని కలెక్టర్ వివరించారు. రీ సర్వేకు రైతులు, భూ యజమానులు అధికారులకు సహకరించాలని కోరారు. భూమి కొనుగోలు చేసే ముందు తప్పనిసరిగా సర్వే చేయించుకుని, భూమి హద్దులు నిర్ధారించుకున్న తర్వాతే కొనుగోలు చేయాలని సూచించారు. ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న సాదా బైనామా దరఖాస్తులను పెండింగ్లో ఉంచకుండా త్వరితగతిన పరిష్కరించాలని తహసీల్దార్లను ఆదేశించారు.

సర్వే వివరాలు ఇలా..

మిరుదొడ్డి మండలం లింగుపల్లి గ్రామంలో మొత్తం 556 ఎకరాల విస్తీర్ణానికి గాను ఇప్పటివరకు 186 ఎకరాల్లో సర్వే పూర్తయింది. తొగుట మండలం చందాపూర్ గ్రామంలో 780 ఎకరాలకు గాను 50 ఎకరాల్లో సర్వే పూర్తయినట్లు అధికారులు కలెక్టర్కు వివరించారు. ఈ పర్యటనలో ఆయా మండలాల తహసీల్దార్లు, గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధులు, భూ యజమానులు తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రిలో అరుదైన ఆపరేషన్

- ఒకే శస్త్రచికిత్సలో తల్లికి ప్రసవం, గర్భాశయ ఫైబ్రాయిడ్ తొలగింపు

దుబ్బాక ప్రతినిధి, నవంబర్ 05, :
దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రిలో అరుదైన ఆపరేషన్ నిర్వహించారు. ఒకే శస్త్రచికిత్సలో తల్లికి ప్రసవం, గర్భాశయ ఫైబ్రాయిడ్ గడ్డను తొలగించినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ హేమరాజ్ సింగ్ తెలిపారు. మిరుదొడ్డి మండలం రుద్రారం గ్రామానికి చెందిన 34 సంవత్సరాల స్వప్న అనే గర్భిణి ప్రతి నెలా దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకుంటూ వచ్చారు. ఆమెకు నిర్వహించిన స్కానింగ్లో గర్భంతో పాటు గర్భాశయంలోని ముందు భాగంలో 2 కిలోల 200 గ్రాముల పరిమాణంలో రక్తప్రసరణ కలిగిన ఫైబ్రాయిడ్ గడ్డ ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. పుట్టిన బిడ్డ బరువు 3 కిలోలు ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ క్లిష్టమైన కేసును సవాలుగా స్వీకరించిన దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రి వైద్య బృందం అత్యంత సమర్థవంతంగా వ్యవహరించింది. ఒకే ఆపరేషన్ ద్వారా సిజేరియన్ ప్రసవం నిర్వహించడంతో పాటు గర్భాశయంలో ఉన్న ఫైబ్రాయిడ్ గడ్డను కూడా తొలగించారు. ఈ శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తికావడంతో తల్లి స్వప్నతో పాటు పుట్టిన బిడ్డ కూడా సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారు. ఈ విజయవంతమైన వైద్య సేవల్లో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమరాజ్ సింగ్, గైనకాలజిస్ట్ డాక్టర్ శ్రావంతి, మత్తు డాక్టర్ ప్రేమ్ కిషోర్, ఆసుపత్రి సిబ్బంది కీలక పాత్ర పోషించారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకాన్ని మరింత పెంచేలా దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రి వైద్య బృందం అందించిన ఈ సేవలు అభినందనీయం. పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ, క్లిష్టమైన శస్త్రచికిత్సలను కూడా విజయవంతంగా నిర్వహిస్తూ దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రి ప్రజల మన్ననలు



పొందుతోంది. ప్రభుత్వ వైద్య వ్యవస్థలోని వైద్యుల అంకితభావానికి, నైపుణ్యానికి, సేవా స్ఫూర్తికి ఈ సంఘటన ఒక చక్కని నిదర్శనం.

విద్యా ప్రమాణాల పెంపునకు తల్లిదండ్రుల సహకారం అవసరం

- ధర్మాజీపేటలో ఘనంగా తల్లిదండ్రులు-ఉపాధ్యాయు ల సమావేశం

దుబ్బాక ప్రతినిధి, నవంబర్ 05, :
విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపునకు తల్లిదండ్రుల సహకారం ఎంతో అవసరమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీందర్, పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు మహమ్మద్ సాదత్ అలీ తెలిపారు. దుబ్బాక మున్సిపాలిటీ ధర్మాజీపేట వార్డు లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా సమావేశ ఎజెండాలోని అంశాలైన విద్యార్థుల హాజరు, ప్రవర్తన, క్రమశిక్షణ, ఎస్ఏ–I పరీక్షల ఫలితాల సమీక్ష, విద్యార్థుల విద్యా ప్రగతి మరియు ప్రతిభ, పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు



ప్రత్యేక మార్గదర్శకత్వం, తల్లిదండ్రుల సూచనలు, అభిప్రాయాలపై అంశాలవారీగా చర్చించారు. విద్యార్థుల అభ్యసన ప్రగతి, పరీక్షల సన్నద్ధత, భవిష్యత్తు లక్ష్యాలపై విలువైన సూచనలు అందించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరిచి, అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు గత జూలై మాసం నుండి 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు విద్యార్థులకు ప్రతిరోజూ సాయంత్రం 4:15 గంటల నుండి 5:15 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రత్యేక తరగతుల ద్వారా విద్యార్థులలో విషయ పరిజ్ఞానం, అభ్యసన సామర్థ్యాలు, పరీక్షల సన్నద్ధతను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని వివరించారు. అదేవిధంగా ఉపాధ్యాయులు తమ తమ తరగతుల విద్యార్థుల ప్రగతి, ప్రతిభ, పరీక్షల ఫలితాలు మరియు మెరుగుపరచు కోవాల్సిన అంశాలను తల్లిదండ్రులకు వివరించారు. తల్లిదండ్రులు కూడా తమ విలువైన అభిప్రాయాలు, సూచనలు తెలియజేస్తూ సమావేశం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశం ద్వారా పాఠశాల, తల్లిదండ్రుల మధ్య పరస్పర అవగాహన, సమన్వయం మరింత బలపడిందని, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఇటువంటి సమావేశాలు ఎంతగానో దోహదపడతాయని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మహమ్మద్ సాదత్ అలీ, పల్లె శ్రీనివాస్ గౌడ్, శ్రీకాంత్, బాలకిషన్, పద్మావతి, శైలజ పిడి, సిహెచ్ చంద్రశేఖర్ జూనియర్ అసిస్టెంట్, సిఆర్పి నవీన్ కుమార్, రేణుక, కావ్య, దుబ్బరాజం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


పేరంటాల చెరువు గండిని పరిశీలించిన మంత్రి పొంగులేటి

- వరద నష్టాలపై ఆరా, శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశం

దమ్మపేట, నవంబర్ 05, :
మురసు తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలంలోని మల్లెపూల వాగు, ముసలిబంధం, దమ్మపేట పేరంటాల చెరువులకు గండ్లు పడి అపార నష్టం వాటిల్లిన నేపథ్యంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజు, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారిణి ఎం.విద్యా చందన తో కలిసి వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించి సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పంటలు నష్టపోయిన రైతులను పరామర్శించి, ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. నష్టపోయిన రైతులు, ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలను ఆదుకునేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దమ్మపేట పేరంటాల చెరువుకు తరచూ గండ్లు పడుతుండటంపై మంత్రి ప్రత్యేకంగా ఆరా తీశారు. చెరువు గండ్లు పడటానికి గల కారణాలు, శాశ్వత నివారణకు చేపట్టాల్సిన చర్యలపై రైతులు, అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా సుమారు 18 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువు ఆక్రమణలకు గురై ఉండవచ్చని, శివాలయం ముందు ఉన్న బ్రిడ్జి వరద ప్రవాహానికి సరిపడా సామర్థ్యంతో లేకపోవడం, ఇరిగేషన్ శాఖ నుంచి ముందస్తు చర్యలు తీసుకోవడంలో లోపాలు ఉండవచ్చని రైతులు తమ అభిప్రాయాలను మంత్రికి వెల్లడించారు. ఈ అంశాలపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవ పరిస్థితులను నిర్ధారించాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి నష్టం పునరావృతం కాకుండా శివాలయం వద్ద ఉన్న బ్రిడ్జిని విస్తరించి, వరద నీరు సాఫీగా వెళ్లేలా పటిష్టమైన నిర్మాణం చేపట్టాలని రైతులు విజ్ఞప్తి చేశారు. వారి అభిప్రాయాలను, సూచనలను పరిగణనలోకి తీసుకున్న మంత్రి సంబంధిత అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి నష్టం పునరావృతం కాకుండా శివాలయం వద్ద ఉన్న బ్రిడ్జిని విస్తరించి, వరద నీరు సులభంగా వెళ్లేలా పటిష్టంగా నిర్మించాలని మంత్రిని కోరారు. రైతుల సమస్యలను సావధానంగా విన్న మంత్రి, సంబంధిత అంశాలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో సీఐ నాగరాజు, దమ్మపేట ఎస్ఐ బి. రాజేష్ కుమార్, అశ్వారావుపేట ఎస్ఐ సాయి కిషోర్ రెడ్డి, సర్పంచ్ పగడాల రమాదేవి, ఉప సర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు, వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు అత్తులూరి వెంకటరామారావు, జూపల్లి రమేష్, కక్కిరాల రమేష్, చిన్నశెట్టి యుగంధర్, పగడాల రాంబాబు, శ్రీరాముల ప్రసాద్, పర్వతనేని ప్రసాద్, కూరం అర్జునరావు, పానుగంటి సుబ్బారావు, రొయ్యల కుమార్, సాయిల నర్సి, పిట్టల శ్రీనివాసరావు, ధర్మసోతు నరేష్, షేక్ రషీద్, జెట్టి వెంకటేశ్వరరావు, అన్నవరపు నాగేంద్రరావు గ్రామస్తులు మురహరి రఘు, పసుమర్తి పెద్దబాబు, సత్తిపండు, పానకాల సత్యనారాయణ,



గుడిమెట్ల కృష్ణమోహన్, రైతులు తదితరులు పాల్గొని వరద నష్టాలను వివరించారు.




నడిచే విజ్ఞాన సర్వస్వం కపిలవాయి లింగమూర్తి

నేడు కవి కేసరి వర్ధంతి

కపిలవాయి లింగమూర్తి (మార్చి 31, 1928 నవంబర్ 6, 2018) పాలమూరు జిల్లాకు చెందిన ప్రముఖ కవి, రచయిత, సాహితీ పరిశోధకుడు. పద్య రచనతో ఆయన ప్రస్థానం ఆరంభమైనా కథా రచన, విమర్శ ప్రక్రియతో వెలుగులోకి వచ్చారు. జానపద సాహిత్యం, పాలమూరు జిల్లా లోని దేవాలయాలపై విస్తృత పరిశోధనలు చేశాడు. 70 కి పైగా పుస్తకాలు రచించాడు. ఈయనకు కవి కేసరి అనే బిరుదు ఉంది. తెలంగాణా రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత తెలుగు విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేటు అందుకున్న తొలివ్యక్తి కపిలవాయి లింగమూర్తి.

ఆయన అచ్చంపేట తాలుకా, బల్మూర్ మండలం, జినుకుంటలో మాణిక్యమ్మ, వెంకటాచలం దంపతులకు మార్చి 31, 1928కు సరియైన ప్రభవ నామ సంవత్సరం మాఘ శుద్ధ నవమి నాడు జన్మించారు. ఆయనకు రెండున్నరేళ్ళ వయసులో తండ్రి మృతి చెందడంతో మేనమామ పెద లక్ష్మయ్య దగ్గర పెరిగారు. పాఠశాల విద్యను ఉర్దూ మాధ్యమంలో పూర్తి చేశారు. ఆంధ్ర సారస్వత పరిషత్ పరీక్షలు రాసి తెలుగులో విశారద ప్రమాణ పత్రాన్ని సంపాదించారు. అనంతరం ఉస్మానియా విశ్వ విద్యాలయం నుంచి ఎం.ఏ. (తెలుగు) పట్టా పొంది 1954లో నాగర్‌కర్నూల్ జాతీయోద్యమ పాఠశాలలో తెలుగు పండితునిగా చేరారు. ఆ తర్వాత 1972 లో పాలెం శ్రీవేంకటేశ్వర ప్రాచ్య డిగ్రీ కళాశాలలో ఉపన్యాసకుడుగా చేరి దశాబ్దం పాటు సేవలందించి 1983లో ఉద్యోగ విరమణ పొందారు. లింగమూర్తి నడిచే విజ్ఞాన సర్వస్వంగా పేరుపొందారు. పలుగ్రంథాలు, పరిశోధనలు రచించి సాహితీవేత్తగా పేరుపొందాడు. కపిలవాయికి తెలుగు విశ్వవిద్యాలయం 26.8.2014 న గౌరవ డాక్టరేట్‌ను ప్రకటించింది. 30.08.2014 రోజున విశ్వవిద్యాలయం 13వ స్నాత కోత్సవంలో చాన్స్‌లర్, రాష్ట్ర గవర్నర్ నరసింహన్ ఆయనకు గౌరవ డాక్టరేట్‌ను అందించారు. తెలంగాణ రాష్ట్రంలో తెలుగు యూనివర్సిటీ నుంచి తొలి గౌరవ డాక్టరేట్ పొందిన వ్యక్తిగా కపిలవాయికి ఈ ఘనత దక్కింది. 1954 నుంచి 1983లో పదవీ విరమణ పొందే వరకు నాగర్‌కర్నూల్ లోని జాతీయోన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేసి, అక్కడే స్థిరపడ్డారు. అనేక స్థలచరిత్రలు, దేవాలయాల కథలకు ఆయన ప్రాణంపోశారు. మొత్తం 70 రచనలు ముద్రితమయ్యాయి. 11రచనలు ద్విముద్రితాలు, 25 రచనలు ముద్రించాల్సి ఉంది. సమైక్యరాష్ట్రంలో తెలంగాణ కవులు, సాహితీ వేత్తలకు అన్యాయం జరిగింది. జీవోలు తెలుగులో రావాలి. పాఠశాలల్లో తెలుగు బోధించాలి అని సూచనలు చేశారు. ఆయన శతాధిక రచనలు చేశాడు. కపిలవాయి లింగమూర్తి కావ్యాలు, గీతాలు, శతకాలు, వచన సాహిత్యం, స్థల చరిత్రలు, బాల సాహిత్యం మొదలగు వివిధ సాహిత్య ప్రక్రియలలో రచనలు చేశారు. ఈ రచనలపై పలువురు విద్యార్థులు పరిశోధనలు చేస్తున్నారు. ఇప్పటికి వీరి రచనలపై వివిధ విశ్వ విద్యాలయాలలో ఆరు సిద్ధాంత గ్రంథాలు రూపొందినవి. 1992లో కవితా కళానిధి, పరిశోధనా పంచానన, 1996లో కవికేసరి, 2005లో వేదాంత విశారద,2010లో గురు శిరోమణి, 2012లో సాహిత్య స్వర్ణ సౌరభ కేసరి, సాహితీ విరాణ్మూర్తి తదితర బిరుదులు, సత్కారాలు పొందారు. కపిలవాయి లింగమూర్తికి సాహిత్య రంగంలో చేసిన విశేషకృషికి గుర్తింపుగా రాష్ట్ర స్థాయిలో అనేక సందర్భాలలో సన్మానాలు జరిగాయి. 1983లో అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వీరిని సన్మానించారు. తరువాత నారా చంద్రబాబు నాయుడు, వై.యస్. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రులుగా ఉన్నకాలం లోనూ వారిచే సన్మానాలు పొందారు. తెలంగాణ రాష్ట్ర సమితి దశాబ్ధి ఉత్సవాల సందర్భంగా ఆ పార్టీ అధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఆయనను సన్మానించారు. నలుగురు ముఖ్యంత్రులచే సన్మానింపబడిన ఏకైక తెలుగు కవి, పరిశోధకులు కపిలవాయి లింగమూర్తి. ఇంకా తెలుగు విశ్వవిద్యాలయ ప్రతిభాపురస్కారం, బూర్గుల రామకృష్ణారావు ప్రతిభా పురస్కారం, బ్రౌన్ సాహిత్య పురస్కారం, నోరి నరసింహశాస్త్రి పురస్కారం, కందుకూరి రుద్రకవి పురస్కారం, పులికంటి సాహితీ పురస్కారం, బి.ఎన్.శాస్త్రి స్మారక పురస్కారం మొదలైన ఎన్నో సత్కారాలను పొందాడు. వెన్నెల సాహిత్య అకాడమీ కపిలవాయి లింగమూర్తి జీవితం, సాహిత్య సృజన, పరిశోధనలపై కవితా కళానిధి కపిలవాయి లింగమూర్తి పేరుతో ఓ డాక్యుమెంటరీని రూపొందించింది. దీనికి 2011లో అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తమ రెండో డాక్యుమెంటరీ చిత్రంగా నంది అవార్డును ప్రకటించింది.



రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత

నేడు అంతర్జాతీయ పర్యావరణ దోపిడీ నివారణ దినోత్సవం



అంతర్జాతీయ పర్యావరణ దోపిడీ అనేది ఒక దేశం లేదా సంస్థ తన ఆర్థిక లాభం కోసం సహజ వనరులను దోచుకోవడం, దుర్వినియోగం చేయడం. ఇది ప్రధానంగా అడవుల నరికివేత, ఖనిజ సంపదను పెద్ద స్థాయిలో తవ్వుకోవడం, నీటి వనరులను అతిగా వినియోగించడం వంటి రూపాలలో ఉంటుంది. ఈ దోపిడీ వల్ల స్థానిక జీవజాలం, స్థానిక జనాభా తీవ్రంగా ప్రభావితం అవుతుంది. తక్కువ అభివృద్ధి చెందిన దేశాలు లేదా అభివృద్ధి చెందుతున్న దేశాలు, తమ పర్యావరణం మరియు వనరులను పరిరక్షించడానికి తగిన విధానాలను అనుసరించలేక పోతున్నాయి. ఇది ఆ దేశాల పర్యావరణాన్ని తీవ్ర స్థాయిలో నాశనం చేస్తోంది.

ప్రపంచం మొత్తం పర్యావరణ సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. గ్లోబల్ వార్మింగ్, వాయు కాలుష్యం, నీటి ప్రదూషణ, జీవవైవిధ్యం నష్టం వంటి అనేక సమస్యలు మన జీవన విధానాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఈ సమస్యలకు ప్రధాన కారణం అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న పర్యావరణ దోపిడీ. ఒక దేశం లేదా సంస్థ తన ఆర్థిక ప్రయోజనాల కోసం ఇతర దేశాల సహజ వనరులను దోపిడీ చేయడం, తద్వారా స్థానిక ప్రజల జీవన విధానాలపై ప్రతికూల ప్రభావం చూపడం, పర్యావరణ దోపిడీకి ఉదాహరణలుగా చెప్పవచ్చు. ఈ సమస్యను అరికట్టేందుకు మరియు పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించేందుకు ప్రతి సంవత్సరం ఒక నిర్దిష్ట దినాన్ని పాటిస్తారు. ఈ సందర్భంలో అంతర్జాతీయ పర్యావరణ దోపిడీ అంటే ఏమిటి, దాని ప్రభావాలు, నివారణ చర్యలు, మన బాధ్యతలు వంటి అంశాలను పరిశీలించడం అవసరం. అడవుల నరికివేత, భారీ పరిశ్రమల నెలకొల్పటం, రసాయనాల వాడకం వంటివి అనేక జంతువుల, వృక్షజాలం నివాసాలను ధ్వంసం చేస్తాయి. వీటి వల్ల అనేక జీవజాతులు అంతరించి పోతాయి. జీవవైవిధ్యం కనుమరుగవడం వల్ల పర్యావరణ సమతుల్యతలో గణనీయమైన మార్పులు వస్తాయి. పరిశ్రమల నుంచి ఉద్గారాలు, వ్యవసాయ రసాయనాలు, మరియు ఇతర వ్యర్థ పదార్థాలు నదులు, సముద్రాలు, వాయు మండలాన్ని కలుషితం చేస్తాయి. ఇది పర్యావరణానికి మాత్రమే కాకుండా, మన ఆరోగ్యానికీ ప్రమాదకరం. దీని వలన వాయు కాలుష్యం, నీటి కాలుష్యం, భూసమ-ర్థవంతత తగ్గిపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయి. వనరులను అతిగా వినియోగించడం, చెట్లను నరికివేయడం, గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాలను పెంచడం వలన వాతావరణంలో వేడి పెరుగుతోంది. దీని కారణంగా గ్లోబల్ వార్మింగ్ అనే సమస్య పెరిగి వాతావరణంలో అతివృష్టి, కరువు వంటి ప్రతికూల మార్పులు చోటు. చేసుకుంటున్నాయి. వాతావరణ మార్పు వల్ల వరదలు, కరువులు, అగ్ని ప్రమాదాలు వంటి సహజ వైపరీత్యాలు ఎక్కువగా సంభవిస్తున్నాయి. ఈ ప్రక్రియలతో పర్యావరణ నాశనం తక్షణమే కనిపించక పోయినా, దీర్ఘకాలంలో వీటి ప్రతికూల ప్రభావం పెద్ద స్థాయిలో ఉంటుంది. కాలుష్యం వల్ల మన ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు ఏర్పడతాయి. వాయు కాలుష్యం వల్ల శ్వాసకోశ వ్యాధులు, నీటి కాలుష్యం వల్ల నీటి ద్వారా వ్యాప్తిచెందే వ్యాధులు ప్రబలుతున్నాయి. శరీరంలో విష పదార్థాలు చేరటం వల్ల కేన్సర్, జన్యు వ్యాధులు వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు కూడా ఉత్పన్నం అవుతున్నాయి. అంతర్జాతీయ పర్యావరణ దోపిడీని అరికట్టడానికి ప్రయత్నాలు జరిగాయి. పర్యావరణ పరిరక్షణ కోసం పలు అంతర్జాతీయ ఒప్పందాలు కుదిరాయి. టోక్యో ప్రోటోకాల్, పారిస్ ఒప్పందం వంటి ఒప్పందాలు ద్వారా వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు దేశాలు ఒక ప్రణాళికను అనుసరిస్తున్నాయి. ఈ ఒప్పందాలు పర్యావరణ పరిరక్షణకు దేశాల మధ్య సహకారాన్ని పెంపొందిస్తున్నాయి. ప్రతి దేశం పర్యావరణ పరిరక్షణ కోసం స్వంత చట్టాలను రూపొందిస్తోంది. వనరులను అధికంగా వినియోగించే సంస్థలపై నియంత్రణ విధించేలా చట్టాలు అమలు చేస్తున్నాయి. కాలుష్య నియంత్రణ, వనరుల పరిరక్షణ, రక్షణాత్మక చర్యలు తీసుకునేలా ప్రభుత్వాలు చట్టాలను రూపొందిస్తున్నాయి. పర్యావరణ అవగాహన కార్యక్రమాలు: పర్యావరణ పరిరక్షణపై ప్రజలలో అవగాహన పెంచేందుకు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు మరియు ఇతర సంస్థలు జాగృతి కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. పర్యావరణ సమస్యలను ప్రజలకు వివరించడం, అవగాహన కల్పించడం వల్ల ప్రజలు తమ జీవనశైలిని సవరించు కోవడానికి ఆసక్తి చూపిస్తారు. శిలాజ ఇంధనాలకు ప్రత్యామ్నాయంగా సౌరశక్తి, పవనశక్తి వంటి పునరుత్పాదక ఇంధనాలను వినియోగించడాన్ని ప్రోత్సహిస్తున్నారు. ఈ వనరులు పర్యావరణానికి హానికరమైన కర్బన ఉద్గారాలను తగ్గించడంలో సహాయ. పడతాయి. ప్రతి వ్యక్తి పర్యావరణ పరిరక్షణలో తన వంతు బాధ్యతను నిర్వర్తించాలి. వాహనాలను తక్కువగా వినియోగించడం, పునర్వినియోగ పదార్థాలు ఉ పయోగించడం, నీటి వనరులను ఆదా చేయడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించవచ్చు. పర్యావరణానికి మేలు చేసే మొక్కలను నాటి, వాటిని సంరక్షించడం ద్వారా వాయు కాలుష్యం తగ్గించవచ్చు. పర్యావరణానికి హాని కలిగించని ఉత్పత్తులను ఎంచుకోవడం, ప్లాస్టిక్ వంటి పదార్థాల వాడకాన్ని తగ్గించడం, మన పరిసరాల్లోని వారికి పర్యావరణ పరిరక్షణ యొక్క ప్రాముఖ్యతను వివరించడం చేపట్టాలి. అంతర్జాతీయ పర్యావరణ దోపిడీ ఒక తీవ్రమైన సమస్యగా మనముందుంది. దీనిని అరికట్టడానికి ప్రభుత్వాలు, సంస్థలు, మరియు ప్రజలు కలిసి కృషి చేయాలి. పర్యావరణాన్ని కాపాడడంలో ప్రతి ఒక్కరి బాధ్యత అత్యంత కీలకం. మనం పర్యావరణాన్ని కాపాడుకుంటేనే భవిష్యత్తు తరాలకు ఆరోగ్యకరమైన జీవనం అందించ గలుగుతాం.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

సంచార ముస్లింల డిమాండ్లు నెరవేర్చాలి!

- **కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ఒకరోజు నిరాహార దీక్ష**
- **దీక్షకు జమాతే ఇస్లామీ హింద్ సంపూర్ణ సంఘీభావం**
- **ప్రత్యేక ఆర్థిక సంస్థ ఏర్పాటు చేయాలని డిమాండ్**
- **ప్రత్యామ్నాయ ఉపాధికి ఏటా రూ.వెయ్యి కోట్లు కేటాయించాలి**
- **పేద విద్యార్థులకు రూ.5 లక్షల విద్యా సహాయం అందించాలి**
- **ఇంటి స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి**



కరీంనగర్, నవంబర్ 5 (చురకలు): సంచార ముస్లిం తెగల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించి, ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర సంచార ముస్లిం తెగల సంఘం డిమాండ్ చేసింది. తమ సమస్యల పరిష్కారం కోసం గురువారం కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట సంఘం ఆధ్వర్యంలో ఒకరోజు శాంతియుత నిరాహార దీక్ష నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగిన ఈ దీక్షకు జమాతే ఇస్లామీ హింద్ కరీంనగర్ నగర శాఖ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఆ సంస్థ నాయకులు దీక్షా శిబిరాన్ని సందర్శించి నిరసనకారులకు సంఘీభావం తెలిపారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన సంచార ముస్లిం వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. విద్య, ఉద్యోగాల్లో నాలుగు శాతం రిజర్వేషన్ అమలవుతున్న బీసీ-ఈ వర్గానికి చెందిన 14 సంచార, వెనుకబడిన ముస్లిం ఉపకులాల ప్రతినిధులు ఈ నిరాహార దీక్షలో పాల్గొన్నారు. అచ్చుకట్టవాండ్లు, అత్తర్ సాయిబులు, ధోబీ ముస్లిం, ఫకీర్, గారడి ముస్లిం, గోసంగి ముస్లిం, గుడ్డి ఎలుగువాళ్లు, హజామ్ లేదా నాయీ, లబ్బీ, పకీర్ల, ఖురేషీ, షేక్, సిద్ధి, తురక కాశా వర్గాల ప్రతినిధులు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల నిర్వహించిన కుల గణనలో బీసీలలో అత్యంత వెనుకబడిన వర్గాల్లో సంచార ముస్లింలు మొదటి స్థానంలో ఉన్నారని దీక్షా నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ వర్గాల సామాజిక, ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంచార ముస్లిం తెగల ఆర్థికాభివృద్ధి కోసం ప్రత్యేక ఆర్థిక సంస్థను వెంటనే ఏర్పాటు చేయాలని నిరసనకారులు కోరారు. సంప్రదాయ వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రతి సంవత్సరం రూ.వెయ్యి కోట్ల ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. స్వయం ఉపాధి, వృత్తి నైపుణ్య శిక్షణ, చిన్నతరహా వ్యాపారాల ఏర్పాటుకు ఆర్థిక సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. సంచార ముస్లిం కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని కోరారు. విద్యారంగంలో వెనుకబడిన పేద ముస్లిం విద్యార్థులకు ఉన్నత విద్య అవకాశాలు కల్పించేందుకు 'అబుల్ కలాం ఆజాద్ తోఫా-ఏ-తాలీమ్' పేరుతో ప్రత్యేక ఉపకార వేతన పథకాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ పథకం ద్వారా అర్హులైన విద్యార్థులకు రూ.5 లక్షల వరకు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా విద్యకు దూరమవుతున్న విద్యార్థులను ఆదుకునేందుకు ప్రభుత్వం ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. అలాగే నిరుపేద సంచార ముస్లిం కుటుంబాలకు ఇంటి స్థలాలు కేటాయించి, ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జమాతే ఇస్లామీ హింద్ నాయకులు మాట్లాడుతూ సమాజంలోని వెనుకబడిన, అణగారిన వర్గాలకు న్యాయం జరగాలన్నదే తమ సంస్థ లక్ష్యమని పేర్కొన్నారు. న్యాయం, ధర్మం ప్రాతిపదికన వివిధ వర్గాల ప్రజల హక్కుల కోసం తమ సంస్థ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని తెలిపారు. సంచార ముస్లిం తెగల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, వారి డిమాండ్ల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. జమాతే ఇస్లామీ హింద్ కరీంనగర్ నగర అధ్యక్షుడు సొహైబ్ అహ్మద్ ఖాన్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం దీక్షా శిబిరాన్ని సందర్శించి నిర్వాహకులకు సంఘీభావం తెలిపింది. సంచార ముస్లిం తెగల న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు వారి పోరాటానికి తమ మద్దతు కొనసాగుతుందని హామీ ఇచ్చింది. సామాజిక న్యాయం, విద్య, ఉపాధి, గృహవసతి వంటి ప్రాథమిక అవసరాల కల్పనలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాలని నాయకులు కోరారు. సంచార ముస్లింల అభ్యున్నతికి ప్రభుత్వం ఇచ్చిన హామీలను కార్యరూపంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.



కీపర్ చేసిన చిన్న తప్పు..

గెలుపోటములే తారుమారు!

- చివరి బంతికి అనూహ్య మలుపు..
- సూపర్ ఓవర్ లేకుండానే రెనెగేడ్స్ విజయం
- వికెట్ల ముందుకు వచ్చి బంతిని అందుకున్న హోబర్ట్ వికెట్ కీపర్
- నిబంధనల ఉల్లంఘనతో నోబాల్ ప్రకటించిన అంపైర్
- చేతిదాకా వచ్చిన అవకాశం చేజారడంతో హరికేన్స్‌కు నిరాశ
- మహిళల బిగ్ బాష్ లీగ్‌లో అరుదైన ఘటన



హోబర్ట్, నవంబర్ 5 (చురకలు): మహిళల బిగ్ బాష్ లీగ్‌లో ఓ అరుదైన ఘటన మ్యాచ్ ఫలితాన్నే తారుమారు చేసింది. హోబర్ట్ హరికేన్స్, మెల్‌బోర్న్ రెనెగేడ్స్ మధ్య జరిగిన ఉత్కంఠభరిత పోరులో చివరి బంతికి వికెట్ కీపర్ చేసిన చిన్న పొరపాటు హోబర్ట్ జట్టు ఓటమికి కారణమైంది. మ్యాచ్ టై అయి సూపర్ ఓవర్‌కు దారితీస్తుందని భావించిన సమయంలో వికెట్ కీపర్ లిజెల్ లీ నిబంధనలను ఉల్లంఘించినట్లు తేలడంతో అంపైర్ నోబాల్ ప్రకటించారు. దీంతో అదనపు పరుగు లభించిన మెల్‌బోర్న్ రెనెగేడ్స్ అనూహ్య విజయాన్ని అందుకుంది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన హోబర్ట్ హరికేన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 154 పరుగులు చేసింది. జట్టు కెప్టెన్ నికోలా కేరీ అద్భుతంగా రాణించి 43 బంతుల్లో 10 ఫోర్లతో 62 పరుగులు సాధించింది. ఆమె అర్ధశతకంతో హోబర్ట్ ప్రత్యర్థి ముందు 155 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన మెల్‌బోర్న్ రెనెగేడ్స్‌కు ఓపెనర్ హేలీ మాథ్యూస్ అర్ధశతకంతో శుభారంభం అందించింది. అయితే మధ్య ఓవర్లలో వరుసగా వికెట్లు కోల్పోవడంతో రెనెగేడ్స్ ఒత్తిడిలో పడింది. 101 నుంచి 138 పరుగులకు చేరుకునే క్రమంలో ఐదు కీలక వికెట్లు కోల్పోవడంతో మ్యాచ్ చివరి ఓవర్ వరకు ఉత్కంఠగా సాగింది. చివరి బంతికి రెనెగేడ్స్ విజయానికి ఒక్క పరుగు అవసరమైంది. అప్పటికే ఇరు జట్ల స్కోర్లు 154 పరుగులతో సమమయ్యాయి. నికోలా కేరీ వేసిన ఆఖరి బంతిని డియాండ్రా డాటిన్ సరిగా ఆడలేకపోయింది. బంతిని వికెట్ కీపర్ లిజెల్ లీ అందుకోవడంతో బ్యాటర్లు పరుగు సాధించలేకపోయారు. దీంతో మ్యాచ్ టై అయిందని, విజేతను నిర్ణయించేందుకు సూపర్ ఓవర్ నిర్వహించాల్సి ఉంటుందని ఇరు జట్లు భావించాయి. అయితే అదే సమయంలో మూడో అంపైర్ బంతికి సంబంధించిన దృశ్యాలను పరిశీలించడంతో అసలు మలుపు చోటుచేసుకుంది. దృశ్యాలను పరిశీలించిన అంపైర్‌కు వికెట్ కీపర్ లిజెల్ లీ బంతిని అందుకునే సమయంలో తన చేతులను వికెట్ల ముందుకు తీసుకొచ్చినట్లు కనిపించింది. క్రికెట్ నిబంధనల్లోని 27.3 ప్రకారం బౌలర్ వేసిన బంతి బ్యాటర్‌ను లేదా బ్యాట్‌ను తాకే వరకు, వికెట్లను దాటే వరకు లేదా బ్యాటర్ పరుగు కోసం ప్రయత్నించే వరకు వికెట్ కీపర్ పూర్తిగా వికెట్ల వెనుకే ఉండాలి. ఈ నిబంధనను ఉల్లంఘిస్తే అంపైర్ నోబాల్ ప్రకటించే అవకాశం ఉంటుంది. లిజెల్ లీ చేతులు వికెట్ల రేఖను దాటి ముందుకు వచ్చినట్లు నిర్ధారణ కావడంతో అంపైర్ నోబాల్ ప్రకటించారు. దీంతో మెల్‌బోర్న్ రెనెగేడ్స్ ఖాతాలో అదనంగా ఒక పరుగు చేరింది. ఫలితంగా సూపర్ ఓవర్ అవసరం లేకుండానే రెనెగేడ్స్ విజయం సాధించింది. చివరి బంతి వరకు పోరాడిన హోబర్ట్ హరికేన్స్‌కు వికెట్ కీపర్ చేసిన పొరపాటు తీవ్ర నిరాశ మిగిల్చింది. అప్పటివరకు మ్యాచ్‌ను సమం చేసిన ఆనందంలో ఉన్న హోబర్ట్ ఆటగాళ్లు అంపైర్ నిర్ణయంతో నిరాశకు గురయ్యారు. మరోవైపు ఓటమి అంచుల నుంచి అనూహ్యంగా విజయం దక్కడంతో రెనెగేడ్స్ ఆటగాళ్లు సంబరాలు చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. క్రికెట్‌లో ఒక్క చిన్న పొరపాటు కూడా మ్యాచ్ ఫలితాన్ని ఎంతగా ప్రభావితం చేస్తుందో ఈ సంఘటన మరోసారి చాటిచెప్పింది.

కాలం ఎవరికీ ఆగదు

విరాట్ కోహ్లీ ఆఖరి పోరాటం

అయినా ఇంకా 14 కొట్టొచ్చు ఇలా!





హైదరాబాద్, నవంబర్ 5 (చురకలు) : టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ కెరీర్ ఇప్పటికే ఎన్నో చారిత్రాత్మక రికార్డులు, మైలురాళ్లతో నిండిపోయింది. వన్డే ప్రపంచ కప్, టీ20 ప్రపంచ కప్, ఛాంపియన్స్ ట్రోఫీ వంటి ఐసీసీ టైటిళ్లను అందుకున్న కోహ్లీ, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) తరఫున ఐపీఎల్ ట్రోఫీని కూడా ముద్దాడాడు. దీంతో తన సుదీర్ఘ కెరీర్‌లో చాలా కాలంగా ఎదురుచూస్తున్న మరో పెద్ద కలను నెరవేర్చుకున్నాడు. అయినప్పటికీ కోహ్లీ ఆటలో మాత్రం ఇప్పటికీ అదే చెక్కుచెదరని దూకుడు కనిపిస్తోంది. 38 ఏళ్ల వయసులోనూ పరుగుల వేటను కొనసాగిస్తూ సరికొత్త రికార్డుల దిశగా వేగంగా అడుగులు వేస్తున్నాడు. సాధారణంగా 38 ఏళ్ల వయసులో చాలామంది క్రికెటర్లు ఆటకు వీడ్కోలు పలికి కామెంటేటర్లుగా, విశ్లేషకులుగా మారుతుంటారు. కానీ కింగ్ కోహ్లీ మాత్రం అందుకు పూర్తి భిన్నంగా మైదానంలోనే తన అసమాన సత్తా చాటుతున్నాడు. ఫిట్‌నెస్, క్రమశిక్షణ, పరుగుల కోసం తపన, మైదానంలో చురుకుదనం.. ఇలా ప్రతి విషయంలోనూ తన ప్రత్యేకతను కాపాడుకుంటున్నాడు. వికెట్ల మధ్య వేగంగా పరుగెత్తడం, ప్రత్యర్థి బౌలర్లపై ఒత్తిడి పెంచడం, మైదానంలో నిరంతరం ఉత్సాహంగా కనిపించడం వంటి లక్షణాలు అతడిలో అలాగే ఉన్నాయి. అయితే కాలం ఎవరికీ ఆగదు కాబట్టి, 2027 వన్డే ప్రపంచ కప్ కోహ్లీ అంతర్జాతీయ కెరీర్‌లో చివరి టోర్నీ కావచ్చని క్రికెట్ వర్గాల్లో ఊహాగానాలు సాగుతున్నాయి. ప్రపంచ కప్ ట్రోఫీని మరోసారి అందుకుని కెరీర్‌కు ఘనమైన ముగింపు పలకాలనే లక్ష్యం అతడికి ఉందని అభిమానులు ఆశిస్తున్నారు. దానికి తోడు క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ నెలకొల్పిన 100 అంతర్జాతీయ సెంచరీల రికార్డు కూడా కింగ్ ముందున్న మరో ప్రధానమైన సవాలు. ప్రస్తుతం విరాట్ కోహ్లీ అంతర్జాతీయ క్రికెట్‌లో 86 సెంచరీలు సాధించాడు. సచిన్ టెండూల్కర్ నెలకొల్పిన 100 సెంచరీల ప్రపంచ రికార్డును సమం చేయాలంటే మరో 14 శతకాలు సాధించాల్సి ఉంది. టెస్టులు, టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లకు వీడ్కోలు పలికిన తర్వాత ఈ రికార్డును అందుకోవడం కోహ్లీకి మరింత కష్టంగా మారింది. అయినప్పటికీ 2025లో టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత వన్డేల్లో అతడి బ్యాట్ నుంచి ఏకంగా నాలుగు సెంచరీలు రావడం అభిమానుల్లో సరికొత్త ఆశలు రేకెత్తించింది. దక్షిణాఫ్రికాతో 2025 నవంబర్ 30న రాంచీలోని జేఎస్‌సీఏ స్టేడియంలో జరిగిన వన్డేలో కోహ్లీ 135 పరుగులు చేశాడు. ఇది అతడి 52వ వన్డే సెంచరీ కాగా, అంతర్జాతీయ కెరీర్‌లో 83వది. ఆ తర్వాత డిసెంబర్ 3న రాయ్‌పూర్‌లో జరిగిన మ్యాచ్‌లో 102 పరుగులు చేసి 53వ వన్డే శతకాన్ని, 84వ అంతర్జాతీయ సెంచరీని నమోదు చేశాడు. అనంతరం 2026 జనవరి 18న ఇండోర్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన వన్డేలో మరోసారి 102 పరుగులతో మెరిశాడు. ఇది అతడికి 54వ వన్డే సెంచరీ, 85వ అంతర్జాతీయ శతకం. ఇక 2026 సెప్టెంబర్ 27న తిరువనంతపురంలోని గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో వెస్టిండీస్‌పై అజేయంగా 139 పరుగులు చేసి 55వ వన్డే సెంచరీని, 86వ అంతర్జాతీయ సెంచరీని తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ నాలుగు సెంచరీలు కేవలం 16 మ్యాచ్‌ల్లోనే రావడం విశేషం. అంటే ప్రతి నాలుగు వన్డేలకు ఒక సెంచరీ చొప్పున సాధించాడు. ఇదే స్థాయి ప్రదర్శనను కొనసాగిస్తే 100 సెంచరీల రికార్డు దిశగా అతడు మరింత ముందుకు వెళ్లే అవకాశం ఉంది. 2027 వన్డే ప్రపంచ కప్‌కు ముందు భారత్ ఇంకా పలు వన్డే సిరీస్‌లు, టోర్నీల్లో పాల్గొనాల్సి ఉంది. న్యూజిలాండ్‌తో నాలుగు వన్డేలు, శ్రీలంకతో మూడు, జింబాబ్వేతో మూడు మ్యాచ్‌లు ఆడే అవకాశం ఉంది. అలాగే 2027లో వన్డే ఫార్మాట్‌లో జరగనున్న ఆసియా కప్‌లో భారత్ గరిష్ఠంగా ఏడు మ్యాచ్‌లు ఆడవచ్చు. వీటితో పాటు బీసీసీఐ ఖరారు చేయని మరో ఆరు వన్డేలు కూడా షెడ్యూల్‌లో చేరే అవకాశం ఉంది. ఇవన్నీ కలిపి చూస్తే 2027 ప్రపంచ కప్ ప్రారంభానికి ముందు విరాట్ కోహ్లీ సుమారు 30 నుంచి 35 వన్డేలు ఆడే అవకాశం ఉంది. దక్షిణాఫ్రికాలో జరగనున్న ప్రపంచ కప్‌లో భారత్ ఫైనల్ వరకు చేరితే మరో 13 మ్యాచ్‌లు తోడవుతాయి. ప్రపంచ కప్ ముగిసే వరకు అతడికి 30 నుంచి 35 వన్డేలు ఆడే అవకాశం ఉంటే, ప్రతి రెండున్నర మ్యాచ్‌లకు ఒక సెంచరీ చొప్పున సాధించాల్సి ఉంటుంది. ఇది అత్యంత కష్టమైన విషయమైనప్పటికీ, కోహ్లీ గతంలో నెలకొల్పిన ప్రమాణాలు, తిరుగులేని ప్రదర్శనను చూస్తే అసాధ్యమని చెప్పలేం. మొత్తంగా 2027 ప్రపంచ కప్ కోహ్లీ కెరీర్‌లో అత్యంత కీలక మలుపుగా మారనుంది. ఒకవైపు దేశానికి మరో ప్రపంచ కప్ అందించాలనే లక్ష్యం, మరోవైపు సచిన్ 100 అంతర్జాతీయ సెంచరీల రికార్డును అందుకోవాలనే అరుదైన అవకాశం ఉన్న ఈ సమయంలో కోహ్లీ తన బ్యాటింగ్ ప్రయాణాన్ని ఎలా ముందుకు తీసుకెళ్తాడో చూడాలి.

పోర్చుగల్ జట్టుకు రొనాల్డో వీడ్కోలు!



23 ఏళ్ల అంతర్జాతీయ ప్రస్థానానికి ముగింపు..

234 మ్యాచ్‌లు, 146 గోల్స్‌తో అరుదైన రికార్డు

ఫుట్‌బాల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో సంచలన ప్రకటన చేశాడు. పోర్చుగల్ జాతీయ జట్టు తరఫున తన అంతర్జాతీయ కెరీర్‌కు ముగింపు పలుకుతున్నట్లు వెల్లడించాడు. 23 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానానికి వీడ్కోలు చెబుతూ సోషల్ మీడియాలో భావోద్వేగ వీడియోను విడుదల చేశాడు. పోర్చుగల్ తరఫున అత్యధిక మ్యాచ్‌లు ఆడటంతో పాటు అత్యధిక గోల్స్ సాధించిన ఆటగాడిగా చరిత్ర సృష్టించిన 41 ఏళ్ల రొనాల్డో.. ఇకపై జాతీయ జట్టు జెర్సీతో మైదానంలోకి దిగబోనని స్పష్టం చేశాడు. తనకు ప్రత్యేకమైన 7వ నంబర్ జెర్సీని తదుపరి తరం ఆటగాడికి అందించనున్నట్లు తెలిపాడు. "జాతీయ జట్టు తరఫున నా ప్రయాణం ముగిసింది. పోర్చుగల్ కోసం నా శక్తినంతా వెచ్చించాననే సంతృప్తి ఉంది. నా ప్రస్థానాన్ని ఎంతో గర్వంగా గుర్తుచేసుకుంటున్నా" అని రొనాల్డో పేర్కొన్నాడు. ఈ ప్రయాణంలో అండగా నిలిచిన అభిమానులు, కుటుంబ సభ్యులు, సహచర ఆటగాళ్లకు ధన్యవాదాలు తెలిపాడు. 7వ నంబర్ జెర్సీ మరొకరి చేతికి వెళ్లినా.. దానిని ధరించిన గర్వం తనకు ఎప్పటికీ ఉంటుందని పేర్కొన్నాడు.

కోచ్‌తో విభేదాలు.. జట్టు శిబిరం నుంచి నిష్క్రమణ

అంతర్జాతీయ కెరీర్‌కు ముగింపు ప్రకటనకు ముందు పోర్చుగల్ జట్టులో చోటుచేసుకున్న పరిణామాలు తీవ్ర చర్చకు దారితీశాయి. ప్రధాన కోచ్ జార్జ్ జీసస్‌తో రొనాల్డోకు విభేదాలు తలెత్తాయి. సెప్టెంబర్ 27న నార్వేతో జరిగిన నేషన్స్ లీగ్ మ్యాచ్‌లో పోర్చుగల్ 2-1తో విజయం సాధించినప్పటికీ రొనాల్డోకు ఆడే అవకాశం రాలేదు. ఫిట్‌నెస్ నిర్వహణలో భాగంగా విశ్రాంతి ఇస్తామని తొలుత చెప్పిన కోచ్.. ఆ తర్వాత మ్యాచ్‌లో 30 నిమిషాలు ఆడిస్తానని హామీ ఇచ్చినట్లు రొనాల్డో వెల్లడించాడు. విరామ సమయంలో వార్మప్ చేసినా మైదానంలోకి పంపకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశాడు. మ్యాచ్ అనంతరం మీడియాకు వాస్తవాలు వివరిస్తానని కోచ్ హామీ ఇచ్చి, అందుకు భిన్నంగా మాట్లాడారని రొనాల్డో ఆరోపించాడు. అయితే జట్టు ఎంపిక, ఆటగాళ్లకు అవకాశాలు కల్పించడం తన బాధ్యతేనని జీసస్ స్పష్టం చేశాడు. ఈ పరిణామాల నేపథ్యంలో డెన్మార్క్‌తో మ్యాచ్‌కు ముందు కోపెన్‌హేగన్‌లోని జట్టు శిబిరం నుంచి రొనాల్డో వెళ్లిపోయాడు. దీనిపై విమర్శలు రావడంతో తన చర్య తప్పేనని అంగీకరించి సహచర ఆటగాళ్లు, అభిమానులకు క్షమాపణలు చెప్పాడు. ఈ ఘటనపై పోర్చుగల్ ఫుట్‌బాల్ సమాఖ్య విధించిన 30 రోజుల సస్పెన్షన్, 255 యూరోల జరిమానాను అనంతరం వెనక్కి తీసుకుంది. 2026 ప్రపంచకప్ తర్వాత వీడ్కోలు పలకాలని తొలుత భావించిన రొనాల్డో.. సమాఖ్య అధ్యక్షుడు పెడ్రో ప్రోయెంకా సూచనతో తన నిర్ణయాన్ని పునరాలోచించినట్లు కథనాలు వెల్లడించాయి.

అరంగేట్రం నుంచి అగ్రస్థానం వరకు..

2003 ఆగస్టులో కజకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్ ద్వారా పోర్చుగల్ జాతీయ జట్టులోకి అడుగుపెట్టిన రొనాల్డో.. 2004లో యూరో కప్ ఫైనల్‌లో ఆడాడు. ఆ మ్యాచ్‌లో గ్రీస్ చేతిలో పోర్చుగల్ ఓడిపోయినా.. జట్టులో కీలక ఆటగాడిగా ఎదిగాడు. 2006 ప్రపంచకప్, 2012 యూరో కప్‌లలో పోర్చుగల్ సెమీఫైనల్ చేరడంలో ముఖ్య భూమిక పోషించాడు. 2016 యూరో కప్ ఫైనల్‌లో ఫ్రాన్స్‌తో జరిగిన పోరులో గాయపడటంతో తొలి అర్ధభాగంలోనే మైదానం వీడాల్సి వచ్చింది. అయినప్పటికీ పక్కన నిలబడి సహచరులను ప్రోత్సహించాడు. అదనపు సమయంలో ఎడెర్ సాధించిన గోల్‌తో పోర్చుగల్ తొలిసారి యూరో కప్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. 2019లో స్విట్జర్లాండ్‌తో జరిగిన నేషన్స్ లీగ్ సెమీఫైనల్‌లో హ్యాట్రిక్ సాధించి తొలి టైటిల్ విజయానికి బాటలు వేశాడు. 2025లో స్పెయిన్‌తో జరిగిన ఫైనల్‌లోనూ గోల్ సాధించి రెండోసారి నేషన్స్ లీగ్ గెలిచిన జట్టులో భాగమయ్యాడు.

రికార్డుల రారాజుగా రొనాల్డో

పోర్చుగల్ తరఫున 234 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడి 146 గోల్స్ సాధించిన రొనాల్డో.. పురుషుల ఫుట్‌బాల్‌లో అత్యధిక మ్యాచ్‌లు, అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా ప్రపంచ రికార్డులు నెలకొల్పాడు. 2026 ప్రపంచకప్‌లో ఆరు వేర్వేరు టోర్నీల్లో గోల్స్ సాధించిన తొలి ఆటగాడిగా మరో ఘనత అందుకున్నాడు. యూరో కప్ చరిత్రలో 14 గోల్స్, 30 మ్యాచ్‌లతో అత్యుత్తమ రికార్డులు కూడా అతడి పేరిటే ఉన్నాయి.


అందని ప్రపంచకప్.. కొనసాగనున్న క్లబ్ ప్రయాణం

ఎన్నో అంతర్జాతీయ విజయాలు సాధించిన రొనాల్డోకు ఫిఫా ప్రపంచకప్ మాత్రం అందని కలగానే మిగిలింది. 2006లో పోర్చుగల్ సెమీఫైనల్ చేరడమే ఈ టోర్నీలో అతడి అత్యుత్తమ ప్రదర్శన. 2022లో మొరాకో చేతిలో క్వార్టర్ ఫైనల్లో, 2026లో స్పెయిన్ చేతిలో ప్రిక్వార్టర్ ఫైనల్లో ఓటములు అతడి ప్రపంచకప్ ఆశలకు అడ్డుకట్ట వేశాయి. జాతీయ జట్టుకు వీడ్కోలు పలికినప్పటికీ క్లబ్ ఫుట్‌బాల్‌లో రొనాల్డో ఆట కొనసాగనుంది. ప్రస్తుతం అల్ నసర్ తరఫున ఆడుతున్న అతడు కెరీర్‌లో 1,000 గోల్స్ మైలురాయికి చేరువలో ఉన్నాడు. తాజా లెక్కల ప్రకారం మొత్తం 979 గోల్స్ సాధించాడు. ఒక యూరో కప్, రెండు నేషన్స్ లీగ్ టైటిళ్లతో పాటు ఎన్నో రికార్డులను పోర్చుగల్‌కు అందించిన రొనాల్డో స్థానాన్ని భర్తీ చేయడం భవిష్యత్ ఆటగాళ్లకు పెద్ద సవాలే.

పూజ ఆల్‌రౌండ్ షో



పూణె: మొదట బంతితో ప్రత్యర్థిని పడగొట్టి ఆ తర్వాత బ్యాట్‌తో అదరగొట్టిన వంక పూజ హైదరాబాద్ విజయంలో కీలకపాత్ర పోషించింది. సీనియర్ విమెన్స్ క్రికెట్ టీ20 టోర్నీ సందర్భంగా పూజ ఆల్‌రౌండ్ షోతో హైదరాబాద్.. పుదుచ్చేరిపై ఏడు వికెట్ల తేడాతో గెలిచింది. పూజ 4 వికెట్లతో చెలరేగగా మొదట బ్యాటింగ్ చేసిన పుదుచ్చేరి 133 రన్స్‌కే కుప్పకూలింది. ఛేదనలో ఆమె 41 బంతుల్లోనే అజేయంగా 55 రన్స్ చేసింది. ఈ టోర్నీలో నాలుగు వికెట్ల ప్రదర్శన చేయడం ఆమెకు ఇది మూడోసారి కావడం గమనార్హం.



ఆ క్రైమ్‌లో ఇరుక్కున్నా

‘దొంగ నా కొడుకు’ హీరోయిన్ సుష్మితా శెట్టి

హైదరాబాద్, నవంబర్ 5 : స్టార్ హీరోలతో వందల కోట్ల భారీ బడ్జెట్ సినిమాలు నిర్మించే అగ్ర నిర్మాణ సంస్థ ‘మైత్రీ మూవీ మేకర్స్’.. కంటెంట్ ఉన్న చిన్న సినిమాలను కూడా ఎంతో ప్రోత్సహిస్తోంది. సరిగ్గా ఈ స్ట్రాటజీతోనే వాళ్ల బ్యానర్ నుంచి వస్తున్న తాజా క్రైమ్ కామెడీ ఎంటర్‌టైనర్ ‘దొంగ నా కొడుకు’. మౌళి తనూజ్ ప్రశాంత్ హీరోగా, శ్రీను కంబాల దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంతో సుష్మితా శెట్టి హీరోయిన్‌గా టాలీవుడ్‌లోకి అడుగుపెడుతోంది. నవంబర్ 13న ఈ సినిమా థియేటర్లలోకి రానున్న నేపథ్యంలో, తన క్యారెక్టర్ గురించి హీరోయిన్ సుష్మితా శెట్టి చెప్పిన ఆసక్తికర విషయాలు విశేషంగా నిలిచాయి. ‘దొంగ నా కొడుకు’ అనే టైటిల్ వినగానే చాలా క్యాచీగా, ఫన్నీగా అనిపించిందని సుష్మితా తెలిపింది. ఈ సినిమాలో తన పాత్ర గురించి వివరిస్తూ.. “ఇందులో నా క్యారెక్టర్ చాలా క్యూట్ అండ్ బబ్లీగా ఉంటుంది. చెప్పాలంటే కొంచెం తింగరి పిల్ల క్యారెక్టర్. హీరో ఈశ్వర్ (మౌళి)ని ప్రాణానికి ప్రాణంగా ప్రేమిస్తుంది. ఆ ప్రేమ కోసం ఎంతకైనా తెగిస్తుంది. తనను తాను చాలా స్మార్ట్ అనుకుంటుంది. కానీ, అదే అతి తెలివితో తెలియకుండానే చాలా ఇన్నోసెంట్‌గా ఒక క్రైమ్‌లో ఇన్వాల్వ్ అయిపోతుంది. నేను సీరియస్‌గా స్మార్ట్‌గా ఏదైనా చేయబోతే.. అది కాస్తా తెరపై ఫుల్ కామెడీగా వర్కవుట్ అవుతుంది” అంటూ తన పాత్రపై క్యూరియాసిటీని పెంచేసింది. తన మూలాలు కన్నడలో ఉన్నప్పటికీ, పుట్టి పెరిగిందంతా హైదరాబాద్‌లోనే అని సుష్మితా శెట్టి తెలిపింది. విదేశాల్లో చదువుకునే రోజుల నుంచే థియేటర్ ఆర్ట్స్ చేసిన సుష్మితకు.. దివంగత అందాల తార శ్రీదేవి అతిపెద్ద స్ఫూర్తి అట. డ్యాన్స్ ద్వారా పలికించే హావభావాలే తనను నటన వైపు నడిపించాయని ఆమె చెప్పుకొచ్చింది. ఇక టాలీవుడ్‌లో జూనియర్ ఎన్టీఆర్, అల్లు అర్జున్, రామ్ చరణ్ ల డ్యాన్స్ అంటే తనకు ఎంతో ఇష్టమని మనసులోని మాట బయటపెట్టింది. ఈ సినిమాలో కూడా తను వేసిన ఒక డ్యాన్స్ నంబర్ ప్రేక్షకులను కచ్చితంగా అలరిస్తుందని ధీమా వ్యక్తం చేసింది. వెండితెరపై లీడ్ హీరోయిన్‌గా ఇది తన మొదటి సినిమా అని, ఒక నటిగా తనను తాను బిగ్ స్క్రీన్‌పై చూసుకోవడానికి చాలా ఎక్సైటెడ్‌గా ఉన్నానని సుష్మితా తెలిపింది. తొలి సినిమాకే ‘మైత్రీ మూవీ మేకర్స్’ లాంటి పెద్ద ప్రొడక్షన్ హౌస్‌లో పనిచేసే అవకాశం రావడం తన అదృష్టమని మురిసిపోయింది. కో-స్టార్ మౌళి చాలా టాలెంటెడ్ అని, దర్శకుడు శ్రీను కంబాలకు ఇది మొదటి సినిమా అయినా సెట్స్‌లో ఏమాత్రం టెన్షన్ లేకుండా చాలా కూల్‌గా సినిమాను తెరకెక్కించారని ఆమె కితాబిచ్చింది. సంగీత దర్శకుడు సింజిత్ అందించిన మ్యూజిక్ ఈ క్రైమ్ కామెడీకి ప్రధాన బలం అని సుష్మితా పేర్కొంది. భవిష్యత్తులో తనకు ‘మహానటి’ తరహాలో అన్ని ఎమోషన్స్ ఉన్న భారీ పాత్రలతో పాటు స్పోర్ట్స్, రొమాంటిక్ కామెడీ, హారర్ థ్రిల్లర్స్ చేయాలని ఉందని తన మనసులోని కోరికను బయటపెట్టింది. ప్రస్తుతం తమిళంలో రెండు ప్రాజెక్టులు చేస్తున్న ఈ బ్యూటీ.. నవంబర్ 13న రాబోతున్న ‘దొంగ నా కొడుకు’ ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించే పక్కా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అని గ్యారెంటీ ఇస్తోంది!



టాలీవుడ్‌ను విమర్శిస్తారా?

రాధికా ఆప్టే కామెంట్స్‌పై పాయల్ రాజ్‌పుత్ సంచలన కౌంటర్!


హైదరాబాద్, నవంబర్ 5 : తెలుగు చిత్ర పరిశ్రమపై నటి రాధికా ఆప్టే చేసిన కామెంట్స్ ఇప్పుడు ఇండస్ట్రీ వర్గాల్లో పెను దుమారం రేపుతున్నాయి. ఈ వివాదంపై తాజాగా బోల్డ్ బ్యూటీ పాయల్ రాజ్‌పుత్ తీవ్ర స్థాయిలో స్పందించింది. టాలీవుడ్‌ను విమర్శించే వారిపై తనదైన శైలిలో సంచలన వ్యాఖ్యలు చేస్తూ దిమ్మతిరిగే కౌంటర్ ఇచ్చింది. తాను గర్వించదగిన తెలుగు నటిని అని పాయల్ సోషల్ మీడియా వేదికగా స్పష్టం చేసింది. ఒకప్పుడు ఏ ఇండస్ట్రీ అయితే మీకు పేరు, ప్రఖ్యాతులు ఇచ్చిందో.. ఏళ్ల తర్వాత అదే ఇండస్ట్రీ నుంచి అన్నీ పొంది ఇప్పుడు తప్పుగా మాట్లాడటం ఏమాత్రం ధైర్యం అనిపించుకోదని, అది కేవలం కృతఘ్నత మాత్రమే అవుతుందని పాయల్ రాజ్‌పుత్ తీవ్ర స్థాయిలో మండిపడింది. మీ కెరీర్‌ను ప్రారంభించి, మీకు నటనలో లైఫ్ ఇచ్చిన మొత్తం టాలీవుడ్ ఎకోసిస్టమ్‌ను ఏళ్ల తర్వాత నిందించడం ఎంతమాత్రం సరికాదని ఆమె చురకలంటించింది. “ఈ రోజు నేను ఈ స్థాయిలో ఉన్నానంటే దానికి కారణం టాలీవుడ్ మాత్రమే, నాకు అండగా నిలబడిన ఈ తెలుగు చిత్ర పరిశ్రమకు నేను ఎప్పటికీ అండగా నిలబడతాను” అని పాయల్ గర్వంగా ప్రకటించింది. తనకు లైఫ్ ఇచ్చిన ఇండస్ట్రీని ఎవరైనా పల్లెత్తు మాట అన్నా సహించేది లేదంటూ పాయల్ రాజ్‌పుత్ చేసిన ఈ సెన్సేషనల్ పోస్ట్ ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్‌గా మారింది. తెలుగు చిత్ర పరిశ్రమపై ఆమె చూపించిన ఈ అపారమైన అభిమానానికి నెటిజన్లు, సినీ ప్రియులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

నేటి తరానికి నచ్చేలా తీర్చిదిద్దిన దృశ్యకావ్యం!

రామాయణ

రాముడిగా రణ్‌బీర్ కపూర్.. రావణుడిగా యశ్ విశ్వరూపం

సీతగా సాయిపల్లవి ఆకట్టుకునే అభినయం



హైదరాబాద్, నవంబర్ 5 : తరాలు, సాంకేతికత మారుతున్న కొద్దీ అందుకు అనుగుణంగా ఎప్పటికప్పుడు రామాయణం సినిమాగా తెరకెక్కుతూనే ఉంది. అందరికీ తెలిసిన వాల్మీకి రామాయణాన్ని మరోసారి అత్యున్నత సాంకేతిక హంగులతో దర్శకుడు నితీశ్ తివారీ తెరపైకి తీసుకొచ్చారు. మన సంస్కృతిలో భాగమైన ఇతిహాసాన్ని నేటి తరానికి మరింత సులువుగా, స్పష్టంగా అర్థమయ్యేలా చేరువ చేయాలన్న ప్రయత్నం ఇందులో స్పష్టంగా కనిపిస్తుంది. ఈ చిత్ర కథ విషయానికి వస్తే, ముల్లోకాలపై ఆధిపత్యం కోసం దేవతలు, రాక్షసులకు మధ్య యుగాలుగా యుద్ధం కొనసాగుతుంటుంది. అసురుల సైన్యానికి రాకుమారి కైకసి నాయకత్వం వహిస్తుండగా, శ్రీ మహావిష్ణువు ఆశీర్వాద బలంతో దేవతలే పైచేయి సాధిస్తారు. లంకా నగరం దేవతల వశమై, పరిపాలన బాధ్యతలను కుబేరుడికి అప్పజెబుతారు. పరాజయ భారంతో రగిలిపోయిన కైకసి.. సంగీత శాస్త్రాలే ప్రపంచంగా గడుపుతున్న తన కుమారుడు దశాననుడి దగ్గరకు వెళ్లి అసురజాతికి ఎదురుతుణ్ణ అవమానాల గురించి చెబుతుంది. అది విన్న దశానన కఠోరమైన తపస్సు చేసి, అటు అసురులు, ఇటు దేవతల చేతిలో తనకు మరణం ఉండకూడదని బ్రహ్మదేవుడు ప్రసాదించిన వర గర్వంతో లంకా నగరంపై విరుచుకుపడతాడు. ముల్లోకాలకూ తానే అధిపతినని ప్రకటించుకున్న ఆ దశాననుడే రావణుడు. రావణ పట్టాభిషేకం తర్వాత లంకలో చోటు చేసుకున్న పరిణామాలు, దశరథుడి పాలనలోని అయోధ్యలో జరిగిన సంఘటనలు, శ్రీరాముడు పట్టాభిషిక్తుడు కావల్సిన సమయంలో చోటు చేసుకున్న నాటకీయ పరిణామాల నేపథ్యంలో ఈ చిత్రం సాగుతుంది. సినిమా అనుభూతి పరంగా, సీతాపహరణం వరకు సాగే ఈ తొలి భాగం ప్రేక్షకుల్ని పూర్తిగా కథా ప్రపంచంలో మమేకం చేస్తుంది. హనుమంతుడి పరిచయం, రామరావణ యుద్ధంతో రాబోయే భాగంపై అంచనాలను పెంచుతుంది. పాత్రలను చూపించడంలో దర్శకుడు ఎలాంటి ప్రయోగాల జోలికి వెళ్లకుండా, మనదైన ఇతిహాసాన్ని హాలీవుడ్ సినిమాల కన్నా ఘనంగా, కళ్ళు చెదిరే విజువల్స్‌తో తెరపై ఆవిష్కరించారు. రావణుడి బాల్యం నేపథ్యం ఈ సినిమాను మరింత ప్రత్యేకంగా మార్చింది. శ్రీరాముడి జననం, బాల్యం, వీరత్వం వంటి ఘట్టాలు ప్రేక్షకుడిని లీనం చేస్తాయి. అసురులైన తాటకి, సుబాహులతో శ్రీరాముడు అడవిలో చేసే యుద్ధం, స్వయంవరం, సీతారాముల వివాహం, ఆపై దశరథుడు, కైకేయి, శ్రీరాముడి మధ్య సాగే సన్నివేశాలు భావోద్వేగాలను పక్కాగా ఆవిష్కరిస్తాయి. విరామం తర్వాత వనవాసం చుట్టూ సాగే ప్రయాణంలో దట్టమైన అడవుల్లో జరిగే యుద్ధ ఎపిసోడ్, రావణుడు మరియు విద్యుత్‌జిహ్వుడు మధ్య సన్నివేశాలు, శూర్పణఖ ఘట్టం, సీతాపహరణ సమయాన జటాయువు మరియు రావణుడి మధ్య పోరాటం ద్వితీయార్ధానికి హైలైట్‌గా నిలిచాయి. పురాణ గాథ అయినప్పటికీ, ఘనమైన విజువల్ హంగుల కారణంగా అద్భుతమైన ఫాంటసీ సినిమా చూసిన అనుభూతి కలుగుతుంది. నటీనటుల ప్రతిభను పరిశీలిస్తే, శ్రీరాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్ ఎంతో ఒదిగిపోయి నటించారు. ఆ పాత్రకు తగినట్టుగా హుందాగా కనిపిస్తూనే భావోద్వేగాలను అద్భుతంగా పండించారు. రావణుడిగా యశ్ వంద శాతం న్యాయం చేశారు. పరిచయ సన్నివేశాలతోనే సినిమాపై బలమైన ప్రభావం చూపించారు. సీతగా సాయిపల్లవి అభినయం కట్టిపడేస్తుంది. లక్ష్మణుడిగా రవి దూబే, శూర్పణఖగా రకుల్ ప్రీత్ సింగ్ తమ పాత్రలకు పూర్తిన్యాయం చేశారు. డీఎన్‌జీ అందించిన విజువల్ ఎఫెక్ట్స్, ఏఆర్ రెహమాన్ మరియు హన్స్ జిమ్మర్ సంగీతం సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లాయి. ఈ చిత్రంలో విజువల్స్, నటీనటుల అభినయం, యాక్షన్ ఘట్టాలు అత్యంత ప్రధాన బలాలుగా నిలిచాయి. అక్కడక్కడ కథా సన్నివేశాలు కొద్దిగా నెమ్మదిగా సాగినప్పటికీ, మొత్తంగా చూస్తే మన పురాణ గాథలను తెరపై ఎంత ఘనంగా ఆవిష్కరించవచ్చో చాటిచెప్పిన అద్భుత దృశ్యకావ్యం ఈ ‘రామాయణ’.

‘ధర్మన్’ పటాకా

అదిరిపోయే స్టెప్పులతో అలరించడమే కాదు తనదైన నటనతోనూ మంచి క్రేజ్ సంపాదించుకున్నారు అందాల తార శ్రీలీల. భాషతో సంబంధం లేకుండా అగ్రతారల సరసన నటించే అవకాశాల్ని అందిపుచ్చుకుంటున్న నాయికీమె. తమిళంతో పాటు హిందీలో పలు ప్రాజెక్టులతో బిజీగా ఉన్న ఆమె ఖాతాలోకి మరో అగ్ర హీరో సినిమా చేరింది. రజనీకాంత్ ప్రధాన పాత్రలో.. అశ్వత్ మారిముత్తు తెరకెక్కిస్తున్న ‘ధర్మన్’ చిత్రంలో ఆమె నటించనున్నారు. నయనతార, రామ్, సిమ్రాన్, రాశీ ఖన్నా కీలక పాత్ర ల్లో నటిస్తోన్న ఈ సినిమాలో తాజాగా శ్రీలీల చేరినట్టు అధికారికంగా తెలుపుతూ సామాజిక మాధ్యమాల వేదికగా ఓ వీడి యోను పంచుకుంది చిత్రబృందం. “ఆమె లో ఆ మెరుపు ఉంది, ఆమెలో ఆ పటా కా ఉంది, అందాల శ్రీలీలకు ధర్మన్‌లోకి స్వాగతం” అనే వ్యాఖ్యను జోడించింది. ఈ చిత్రాన్ని కమల్ హాసన్ తన రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ సంస్థపై ఆర్.మహేంద్రన్‌తో కలిసి నిర్మిస్తున్నారు. అనిరుధ్ సంగీతమందిస్తున్నారు. శ్రీలీల ప్రస్తుతం అజిత్ కుమార్ ప్రధాన పాత్రలో వస్తున్న ‘డేర్ డెవిల్’, ధనుష్ ‘ఓం’ చిత్రాల్లోనూ నటిస్తున్నారు.



CHANGE OF NAME

I, **CHINTHALA BRAHMACHARY S/o CHINTHALA VENKAIAH** I have changed My name as **CHINTHALA JESHWANTH** **S/O CHINTHALA VENKAIH** H.NO 5-16 , Laxmidevipalli Sarangapur (Mandel) District, jagitial Pincode:505529, Telangana. **(NEW NAME) CHINTHALA JESHWANTH, S/O, CHINTHALA VENKAIAH** for all purpose.

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com